ఆంధ్రభూమి * స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.

సంపుటము : ౪. యువ, భాద్రపదము : సెప్టెంబరు, 1935. సంచిక : ౩.

# విపంచి

తేనెలొలుకు పలుకులతో, మానవుని హృదయమునం దావరించియున్న దుఃఖతిమిరమును పారద్రోలి నవ్వువెన్నెలల వెలయింపగలవాడు కవి. ప్రశాంతమగు హృదయమునందు క్రోధానలమును రవుల్కొలిపి రణరంగమున కుఱికింపగలవాడు కవి. కరుణయెఱుగని కటికవాని హృదయమును సహితము కరగింపగలవాడు కవి. ఇట్టి ప్రతిభాసమన్వితుడగు కవికుమారుడు, సెలయేటి నీటితుంపరలయందు జలకమాడి, పుప్పొడిదుమారములయందు విహరించి, కుసుమములు గుబాళించు కమ్మతావుల నాస్వాదించి, పరుగుపరుగున బోవు పిల్లతరగల విరుపుల యొయ్యారమునకలరి, పలుచని జలదమునందు దాగి దోబూచులాడు జాబిల్లి చిరునగవుల గని సంతసించి, బాహ్యలోకమునే మఱచి, భావనాప్రపంచమునం దానందపారవశ్యమున అరమోడ్పుకన్నులతో చేజాచి చేకొనిన విపంచిపై అపస్వరముల పలికించునా? లోకములు పులకింప మధురభావములజిలికింపడా? అదృష్టవంతుడగు కవికుమారున కేమి కొదువ? అతనికడకు:

'మెల్లగా సాగిపోయెడి మేఘశకల మింతకదలని పర్వతశృంగసీమ,
నీటబడివచ్చు నా సెలయేటినురుగు భువనమోహనసందేశములను దెచ్చు.'

అతడు, 'కుటిలమానవసమాజకల్పితన్యాయహీనశాసనాధీనదుర్బలస్వాంతుడు' కాకుండుటచేతనే నేటికిని నిర్భయముగ లోకమును శాసించుచున్నాడు; 'రాజాస్థానము లెన్నియో యతని గర్వాలంకృతశ్రీపదాంభోజమ్ముల్ దలదాల్చి శాశ్వతపదమున్ బొంది' వర్ధిల్లుచున్నవి.

'చెలువారన్ సురలెల్ల రాగడపకుర్చీలందు గొల్వుండ, బల్
మెలపుల్ మైజిగి సొంపుజూపి సభవారిన్ రక్తిగట్టింతు; మ
ద్దెల కాడెవ్వ డపస్వరమ్ములను బృథ్వీగోళమూగించు? నే
ర్పులకుం దగ్గ మఱొక్కనిన్ వెదకి కీర్తుల్ వ్రాయు దిగ్భిత్తులన్.

అని సౌదామనికి అపస్వరముల తెలియజెప్ప దొరకొనిన, ఈ కవి, విపంచిపై వినిపింప దలచిన మధురగానతరంగములయందు వక్రత గానుపించునా? అక్షరాస్యులగు తెలుగు వారాగానామృతము నాస్వాదించి తలయూపకుందురా?

ఈ గ్రంథమునందు, 'సాకీ,' 'జనదేవుడు,' 'మూగనోము,' 'కాపుపడుచు,' 'కవిరాజు,' 'సాక్షాత్కృతి' అను ఖండకావ్యములయందు మానవప్రకృతి వర్ణింపబడినది. మిగిలిన పదునాల్గు కావ్యములయందును ప్రకృతిమాతయొక్క వింత సొబగులు వెలువరింపబడినవి. మానవప్రకృతికి చెందిన ఆకొలదిపద్యముల నీ గ్రంథమునుండి తొలగించియుండిన బాగుండెడిది; అప్పుడే ఈకవి ప్రకృతి నారాధించువారిలో నగ్రగణ్యుడై, తన గ్రంథమున కొక క్రొత్త గౌరవస్థానమును నేటి వాఙ్మయమునందు సంపాదించి యుండెడివాడు. శ్రీ వేంకట

పార్వతీశ్వర కవుల 'కావ్యకుసుమావళి' యందు పెద్దభాగము ప్రకృతిమాతకు సమర్పింపబడెను. ఈ గ్రంథమునందును ప్రకృతిమాతనుగూర్చియే కవి అధికముగ గానమొనరించినందున, 'కావ్యకుసుమావళి' వరుసయందే దీనిని చేర్చవలసియున్నది.

విరహాభరమున 'మాటి కారటమున గుండు తెమ్మిజవరాలు;' లోలోన సురుంగులు గ్రక్కి ఘూర్ణిల్లు కడలిరాయుడు; 'తూరుపు తెల్లవారినది దొట్టి, మునిమాపుదనక' సంచారములు సల్పు బికారి మగనిగని కన్నీరొలికించు తేటిబోటి; ఈ కవికుమారుని హృదయమును కదలించినవి. వీనిని పురస్కరించుకొని, ప్రవిమలమగు ప్రేమ మహిమను, దురాశాపీడితులగు వారి బ్రతుకు బండాలమును, మాయదారుల తుటారిని గట్టుకొనిన మగువ జీవితమును, కవి పాఠకుని యెదుట ప్రదర్శించుచున్నాడు:

'అవతరించె ప్రియుండు, ఉద్యన్మనోహరాకృతి; దపస్సు పండెం గదమ్మ! ఎచటి
ప్రణయబంధమ్మలో! మిన్నువదలనట్టి రవియు, గొలకు కదలని నీరజలతాంగి.'

అని పలికి, ప్రవిమలప్రేమతత్త్వమును విశదపరచుచున్నాడు. 'మిన్నువదలని రవి, కొలను గదలని నీరజలతాంగి,' యే అగునుగాక, ఆప్రణయమున కంతరాయమే లేదు. హృదయములు కలసిపోయి అవ్యాజానురాగవల్లిక కొనలుసాగి పెనవైచుకొనిన తరువాత మధ్యనున్న యంతర మెంతయైననేమి? ఈ ప్రేమతత్త్వమునందలి రహస్యమును శూన్యహృదయుడగు నరు డెట్లు గ్రహింపగలడు? రసికుడగు కవికుమారుడే, అందుల కర్హుడు. అట్లగుటనే:

'కోరిక దీఱునట్టు లదిగో, ఉదయాచలసానువుల్ రుచి
స్ఫారములయ్యె! నీమనసు పట్టినరాగమె తోచెనేమొ ది
క్తీరములందు; మేల్ముసుగు దీసి యుపాసతి పల్కరించు శృం
గారము లేమిటే? చెవులు కన్నులుగా వినుచున్నదానవే!'

అని తమ్మిజవరాలి ప్రణయరహస్యములను సహితము, కనుగొన వేడుకపడుచున్నాడు.

లోకప్రవృత్తి నెఱిగిన కవిచంద్రుని హృదయము కడలిరాయుని తిలకించినంతనె క్రొత్తభావములతో నుప్పొంగినది. మానవులస్వార్థపరత ఆతనికి జ్ఞప్తికివచ్చినది; అందులకే:

'దొరకినతావుకై నిలువు దోసిడియిత్తురు, పుంతత్రోవ ల
బ్బురముగ జేలలోగలసి పోయి సుఖమ్ముగ నున్నవన్న నె
వ్వరు మడిగట్టియుండి రిదెపల్కుము వ్రేల్మడువంగ; దేరగా
దొరికిన బోవనీయరు గదోయి, తటస్థల మాక్రమింపుమా!'

అని కడలిరాయని పురిగొల్పుచున్నాడు. మఱియు:

'వెలబెట్టించిన గవ్వసేయని మహావిద్వాంసులే నేడు ర
చ్చలలోనం దలలెత్తినారు; జగమిచ్ఛావ్యాపృతిన్ మీరి మే
రల, గొమ్ముల్ మొలిపించుకొన్న దకటా! రత్నాకరుం డన్న కీ
ర్తులు మ్రోయించిన నీవె కాల్గదల వేదో, మున్గనున్నట్లుగా.'

అని ప్రశ్నించుచున్నాడు. ఈ పై పద్యమునందు, అర్థపుష్టికి వలయు పదములు కొఱతపడియున్నవి. ఇందు 'గవ్వసేయని విద్వాంసుల' యభ్యుదయమును, ఉదాహరణముగ జూపి

'రత్నాకరుని' యందు నిద్రించుచున్న చైతన్యమును మేల్కొలుపుటకు కవి ప్రయత్నించినాడు. 'వెలవెట్టించిన గవ్వసేయని' దరిద్రులే నేడు తలలెత్తినారని రత్నాకరుని మేల్కొలుప దలంచుట పాడిగాని, విద్వాంసులు తలలెత్తినారని రత్నాకరుని యులికించుట వలన లాభమేమి? విద్యావంతులకును, ధనవంతులకును సామ్యమెట్లు కుదురును? 'జగమిచ్ఛావ్యాపృతిన్ మీరి మేరల, గొమ్ముల్ మొలిపించుకొన్న దకటా!' అని యనుటలోనే, పేదవారు మొదలగు జనులెల్లరు తలలెత్తినారని, తెలుప ప్రయత్నించినచో, 'వెలవెట్టించిన గవ్వసేయని మహావిద్వాంసులే నేడు రచ్చలలోనం దలలెత్తినారు,' అని ప్రత్యేకముగ విద్వాంసులనే విడదీసి చూపుటవలన సాధించిన దేది?

'తూరుపు తెల్లవాఱినది దొట్టి చెలీ మునిమాపు దనుక సం
చారము, లింటియాబిడ విచారము దూరము; వాడవాడ సిం
గారపు టుత్సవమ్ములు! బికారిమగం డికచాలు! ఏల క
న్నీ రొలికింతు వింతయు గణింపని యావెడ చెల్మి సేతకున్?'

అని, కవివరుడు తేటిబోటిని యోదార్ప దొరకొని, నేడు మానవులయందు సహితమిట్టి కడగండ్లకు గురియైన అబలల దుర్భరజీవితములను స్మృతికి దెచ్చుచున్నాడు. మఱియు కామాంధకారమునబడి మన్ను మిన్నెఱుంగక నెంతటి పనియైన జేయ వెనుకాడని మానవుని బ్రతుకెట్లు ప్రతినిముసము ప్రమాదముల కాలవాలమై యుండునో సూచించుచు, భ్రమరాంగనకు వింతరీతి ఈ క్రింది పద్యమున గావింపబడిన హెచ్చరిక కవికుమారుని భావనాబలమునకు చక్కని నిదర్శనమై వెలయుచున్నది:

'ఇంతకు నీ వెఱుంగవనియే తలపోసెద: వీధిబడ్డ నీ
మంతిను లిందఱుండ, మతిమాలిన సేతలుగాక, పద్మినిన్
జింతనసేయునే? బ్రదికె నీదగు తాళిబలాన, భూమిపై
నింతకు నూకలున్నవి, చెలీ, యినుడన్న మహాప్రచండుడే!'

మెఱపు అను కావ్యమునందు, కవి, 'సుధాశీతలమందహాసపరిషిక్తవిలోలవిలోచనోన్మిషత్ జ్యోతులతో దిగంతముల నొక్కపరిన్ వెలిగించుచుండి, నిర్భీతి జరింతు; వింత వివరింపుము నీ కథ లోతటిన్నటే!' అని ప్రశ్నించుచున్నాడు; అపస్వరములతో బృథ్వీగోళ మూగించు మద్దెలకానిని ఆక్షేపించినాడు, 'పనిగొన కూరకే తిరుగుచాటొనరించుచు మబ్బుగుట్టముల్ గొనగొనలాడ, గొట్టు తళుకుంగొరడా మెఱపద్ది యా మహేంద్రుని' దనియందురు, అది ఎంత దనుక సత్యమో తెలిసికొనగోరినాడు. ఇట్లాతురతతో తడబడుచున్న ఆతని హృదయమునం దొకవిషాదగాథ జ్ఞప్తికి వచ్చినది; కనుల నీరు గ్రమ్మె:

'కలదొక వార్తనిన్నడుగగా గమకింతు, నెఱింగియున్నచో
బలుకుమునిల్చి, మా వలపుపంటకు దెచ్చిన బిడ్డలిద్ద ఱా
త్మలనువగల్ రగుల్కొలిపి మబ్బులమాటయినారు; నీకు దా
రుల నెప్పుడైన గన్పడుదురో? మము దల్తురొ ఓక్షణప్రభా!.'

అని దీనముగ ప్రశ్నించి పాఠకుని హృదయమును సహితము కరగించినాడు; తుదిని, 'నీ రూపు నామనమ్మునింపుకొన్నది; సౌదామనీ, నిజానకింతయో అంతయో హృదయేశ్వరి

కిని సాటివచ్చుట నయనప్రచాలనముల' అని పలికి కలతదేరినహృదయముతో తృప్తిని వెలువరించినాడు. ఎవరి యదృష్టమెట్లుండునో ముందే నిర్ణయించుట కష్టము. అందులకే అల్పకాలము జీవించియుండు కుసుమమును సహితము:

'రమణివాల్జడ గుల్కెడో ప్రణయమధురహృదయులకు జిక్కి? ఆ పరమేశ్వరాంతి
కమును బడయుదో భక్తులకరమువట్టి ? ఇహపరమ్ములయందు నీకేది గలదో!.'

అని కవి ప్రశ్నించుచున్నాడు. తుంపరులు అను కావ్యమునందు, తానే యొకప్రసూనముగా జన్మించినచో:

'ఎలదోటన్ జెలువంపు మల్లియనుగా నే బుట్టియున్నన్, వధూ
విలసద్దీర్ఘవినీలవేణిపయి నువ్విళ్ళూరు పూగుత్తి మొ
గ్గలలో నొక్కటినై, కపోలముల సింగారించుచున్ నర్తన
మ్ములు గావించెడి రాళ్లలోలకులదీప్తుల్ గప్ప రంజిల్లెదన్.'

అని యువ్విళ్ళూరుచున్నాడు. కాని పైన గీటుంచిన పద్యభాగమునందు వెలువరించిన కోరిక ఫలవంతమెట్లు కాగలదు? 'కపోలముల సింగారించుచున్ నర్తనములు గావించెడి రాళ్లలోలకుల' దీప్తులు, విలసద్దీర్ఘవినీలవేణిపయినున్న పూగుత్తిమొగ్గల నెట్లు రంజిల్ల జేయగలవు? జినదేవుని త్యాగమహిమను వివరించునపుడు;

'ముద్దుల మూటగట్టు నగుమోమున తల్లి పయంట ద్రోయుచున్
సద్దు దొలంగి రొమ్మునకు జల్లని చేతులు సాచుచున్న యా
నిద్దపుమేల్ కడాని పసినిగ్గుల వన్నెలుదేరి యచ్చునం
గ్రుద్దిన లీల నిన్నె సరిగొన్న కుమారకు వైపె చూడవే ?'

అని మిగుల, స్వభావసిద్ధముగ వర్ణించి,పాఠకుని కనుగొనల చెమ్మగిల చేసిన ప్రతిభావంతుడగు కవి, అచ్చటేలనో వెనుకడుగు వైచెను.

ఇంద్రధనుస్సును తిలకించినంతనె వింతయూహ లీ కవికుమారున కుద్భవిల్లినవి :

'మలగొని కొండనట్టనడుమం బడిపోయిన యానెలుంగు త్రో
వల శ్రమమెంచకే నడచివచ్చిన నీ యిలు సేర్చునంచు గో
ర్కులు పురిగొన్న వీ మొదలెలుంగని మార్గము నాశ్రయించి యే
వలన దుదిం గడింపగల'

నని పరాత్పరుని ప్రశ్నించుచున్నాడు. ఈ పలుకులయందు ప్రతిఫలించుచున్న గంభీరభావము, ప్రవిమలమగు ఆశయము ప్రశంసార్హములై యలరుచున్నవి.

రమ్యహర్మ్యముల యందే నివసించి, సువర్ణపళ్ళెరముల యందే భుజించి, పన్నీట జలకమాడెడి, శ్రీమంతుల జీవితములు మాత్రమే ఆనందమున కాకరములని తలచువారు, ఈ కవివర్యుని పలుకుల నాలకింపవలసియున్నది.

'తొయ్యలి, నీవు లేక పని తోచదు వానికి, వాడు లేక నీ
కి య్యిలు సేరరాదు, కలయించిన కూరుము లెంతగట్టివో !
తియ్యని యీవసంత మరుదెంచిన సౌఖ్యము మీకుగాక, యే
యయ్యకు నమ్మకుం గలుగునా ? మగనాలి వెలుంగ వింతయున్.'

అని నిరాడంబరముగ జీవితమును గడపు కాపు దంపతులను గూర్చి పలుకుచున్నాడు. నివసించునది కారుచీకటులజిమ్ము కారడవియేఅగునుగాక, వారల కదియే నందనవనము. మాయమర్మముల నెఱుంగని వారి ప్రేమవల్లరి చిగిరించి విరియబూయుట కెంతయో కాలము బట్టదు. అందులకే :

'ఓ యెలనాగ, కొండి సిగ నుంచిన పూవులు త్రోవరాలె న
న్యాయముగా ; నెఱుంగ విసుమంతయు ? నేటికి గాపురమ్ము గై
సేయగ వచ్చి నాలుగు నిశీథులు సాగవు, మూండునాళ్ళలో
దీయని కోర్కులెన్ని నినదించినవే, యనురాగవల్లకిన్ ?'

అని కాపుపడతిని ప్రశ్నించి స్మరణీయమును, అనుసరణీయమును అగు కాపు దంపతుల మధురజీవితమును, పాఠకులకు తెలియబలుకుచున్నాడు.

'నిలువన్ నీడయు గూడుగూడ గఱవౌ నిర్భాగ్యదేశీయ మూ
ర్తుల కంఠమ్మున నీదు వేదన; వెతల్ దోగాడు నా చూపులం
జెలువుంబాసిన నీ ముఖమ్ము గనుపించున్! సత్య మిన్నాళ్ళకుం
దెలిసెన్ నీ కలగూప మెల్లయు! నమస్తే అస్మదాంధ్రావనీ !'

అని పలికి కవివరు డీగ్రంథమును ముగించుచున్నాడు. ఇకనైన భావిభారతభాగ్యోదయమున కనువగు ప్రయత్నములను సల్పి, మాతృఋణమును, ఈ కవికుమారుడు తీర్చుకొనునుగాక. జినదేవునివంటి త్యాగమూర్తులను ప్రసవించిన దేశమాతపాదాంకముల చెంత ప్రణమిల్లి, వానిని, భావసౌరభముల గుబాళించు కావ్యకుసుమములచే, నీ కవికుమారుడు పూజించునుగాక!.

'నీలిమబ్బు బందాలను ద్రోచివచ్చి', 'చాతకి తనదప్పి యార్చుకొనగ . నీళ్ళు కఱవయ్యనే ధరణీతలాన!,' 'కెరాణి పోత బోయుచునున్న లేతనవ్వు,' 'కులాని కంతకున్ రవ్వను దెచ్చుపోకిళులై,' 'వీథిబడ్డ సీమంతిను లింపఱుండ,' మొదలగు చక్కని పదములపొందికతో కవి వన్నె గూర్చుచున్నాడు.

'ప్రకృతిశోభావిలాసలాలసులు కవులు' అను, ఈ కవివర్యుని పలుకులయందలి సత్యము నరయగోరువారీగ్రంథము నేయొకసారి పఠియించిన చాలును. శ్రీబాపిరాజుగారి కవిత్వము ధారాశుద్ధికి పుట్టినిల్లు. వీరిపద్యములయందు, అందును కొన్ని వృత్తములయందు, ఉండవలసినచోట విభక్తిప్రత్యయములు లేకుండుటచే, అన్వయము కుదుర్చుకొనుట కష్టతరముగ నున్నది. ఇట్టివియే కొలదినెరసు లీగ్రంథమునం దచ్చటచ్చట గన్పట్టుచున్నవి. ఇట్టి వానిని సవరించుకొని విసుగెరుగని హృదయముతో, భాషాయోష కూడిగ మాచరించి బాపిరాజుగారు నేటి వాఙ్మయమునం దొక సముచితస్థానము నాక్రమింతురని తలంతును.

ముద్దులు మూటగట్టున ట్లీగ్రంథము ముద్రింపబడినది. ఇందలి రేఖాచిత్రములు కవి హృదయమును చక్కగా అనుకరించుచున్నవి. ఈ గ్రంథముయొక్క వెలమాత్రము మిగుల స్వల్పము; ప్రతి యాంధ్రుని యందుబాటులోనుండుటకే ఇట్లు నిర్ణయింపబడిన దనుకొందును.

—చిరుమామిళ్ల. శివరామకృష్ణ ప్రసాదు, బి.ఏ.

# మీ ప్రియమైన పుత్రుడు

మీపూర్వజన్మతపఃఫలరూపుడగు మీ చిన్నిబిడ్డని, మీరెంతయో జాగ్రత్తతో పోషించుచున్నారు. వాని చిన్నతనమునుండియు మీమీ శక్తుల ననుసరించి అతని కేకొఱంతయు లేకుండునట్లు చూచుచున్నారు. సర్వవిధసౌఖ్యములయందును నోలలాడించుచున్నారు. అతని సౌఖ్యముల కెంతయో ధనము వెచ్చించుచున్నారు. చాల ధనము పెట్టుబడిపెట్టి విద్యాబుద్ధుల గఱపుచున్నారు. కాని యుక్తవయస్కుడై, విద్యావంతుడై, పట్టభద్రుడై జీవితరంగమున కాలుబెట్టినవెంటనే అనేకవిధములగుసమస్యలు అతని నెదుర్కొనుచున్నవి. ఉద్యోగములా, లేవు. వ్యాపారమునకా, పుష్కలమగు ధనము పెట్టుబడి యవసరము. కనుక అందులకు మీరేమి సదుపాయముచేసితిరి? మీరు చేయు సదుపాయములు భద్రమైనట్టివియు నిశ్చయమైనట్టివియునై యుండవలయును కాని ఒడుదుడుకులు ఉండునట్టివిగా నుండకూడదు. అట్టి సదుపాయమెద్ది? ఇందులగుఱించి వివరములు కావలసినచో ఈక్రింది అడ్రస్సుకు 10-వ నెంబరుపట్టీనిమిత్తము వ్రాసినచో బడయవచ్చును.

జయ్ విజయ ఇన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్,

16, లింగిచెట్టివీధి, మదరాసు.

# సుబ్రహ్మణ్యం దెయ్యం

## ౧

‘ఏమిటీ! లక్ష్మణరావు ఇప్పు డొకచిన్నపిల్లను పెళ్ళాడతాడా! ఇంతవరకూ జ్ఞానంలేక ఒడుగుచేసుకో లేదుకాని ఇప్పుడు పెళ్ళిలోనే ఒడుగుకూడా చేసుకుంటానంటాడా!......‘మనము హిందూసంఘమంతా ఒక్కసారి మార్చలేం. క్రమేపీ మార్చాలి తొందరపడి చేస్తిమా మనమొక్కళ్ళమూ వేరయిపోతాం. ఇప్పుడు నాగతి అంతేఅయింది. నన్నందరూ ఒక విచిత్రవ్యక్తిని చూసినట్టుగా చూస్తున్నారు.’ ఇదీ వాడిధోరణి. ఇది వాడివాదన. లేక, మాకు నీతిచెప్పడంకూడా కమోసు! తెలివైన కుర్రవాడే! .....హిందూసంఘం మమ్మల్ని విచిత్రవ్యక్తులకింద మాడలే! మమ్మల్ని పాపులకింద చూస్తూవుంటే మేం భరించలే! తోడి మానవులు తన తండ్రిని ఎంతనీచంగా చూశారూ!..... పిరికిపంద, వట్టి అభాజనుడు, ద్రోహి! ఎటువంటివాడి కడుపున ఎటువంటివాడు పుట్టాడు!’ అని ప్రకాశరావు లక్ష్మణరావునుగురించి కోపంగా ఆలోచిస్తూ సుబ్రహ్మణ్యాన్ని తలచుకోగా అతనికి సుబ్రహ్మణ్యంమూర్తి మనస్సులో ప్రత్యక్షమయింది. సుబ్రహ్మణ్యం మొహం ఎంతోదీనంగా వున్నట్టు అతనికి కనబడింది. అతను అప్పుడు ‘సుబ్రహ్మణ్యం! ఎటువంటి కష్టాలు అనుభవించావోయి నువ్వు! ఎటువంటి ఘోరమైన బాధలు భరించావు! నువ్వు చేసినవన్నీ తప్పుగా కనబడుతున్నాయిట ఈ వాజమ్మకి...ఈ నాగమ్మ తండ్రిని విమర్శించేటంతవా డయాడు!......ద్రోహి, తుచ్ఛుడు, పంద......సుబ్రహ్మణ్యం! నిన్ను నీతండ్రి దమమాలి కట్టుగుడ్డలతో ఇంట్లోంచి తరిమెయ్యగా నువ్వు నిర్భయంగా భార్యాసహితంగా ఇల్లువెడలి వచ్చేసి వీరేశలింగంగారి అచ్చాఫీసులో చిన్నఉద్యోగంలో చేరి, లేమి మాటతలపెట్టకుండా ఎంతో ధైర్యంగా బతికావు. ‘నా ఒంట్లో ఒక్క రక్తపుచుక్క మిగిలినా నేను సంఘసంస్కరణకు సహాయపడక మానను. ఇదే నా ప్రతిజ్ఞ’ అని, కడవరకూకూడా సాహసంతో పనులు చేసి ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నావు. ఆరాత్రి......అది నాకు ఇంకా జ్ఞాపకంవస్తూంది. నా జన్మ తుదవరకూ ఆరాత్రిని నేను మరిచిపోలేను. ఆరాత్రి ఆ విధవపిల్ల, పెళ్ళికోసం తన వూరినుంచి రాజమహేంద్రవరంవస్తూ, వేగిరం నడవలేకపోయిందని నువ్వు బుజాన్ని పెట్టుకుని ఎంతదూరంమోశావు! ఎంత పట్టుదలోయి నీది! నిన్ను చూసి వీరేశలింగంగారు ‘నా కుడిభుజం’ అని పొంగిపోయేవాడు!’ అని ప్రకాశరావు విచారించగా అతని కంటికొలికినుంచి కన్నీటిచుక్క జారి కిందపడింది. ‘నాకు కనక ఇప్పటివరకూ పెళ్ళికాకుండా వుండివుంటే నేను వితంతువను పెళ్ళిచేసుకుని వుండేవాణ్ణి. ఈ జన్మకి నా కీఅదృష్టం పట్టనందుకు నా మనస్సులో ఘోరమైన బాధగావుంది’ అని నువ్వు చిన్నప్పుడు నాతోచెప్పి ఆబాధ భరించలేక కన్నీళ్ళు సెలయేళ్లుగా ఏడ్చావు. ధన్యుడివోయి సుబ్రహ్మణ్యం! నువ్వు ధన్యుడివి ..ఆ పుప్పిగోళ్ళరోగం నీకు వచ్చిందేమోయి! నాకువచ్చినా బాగుండిపోను. నేను చచ్చిపోయినా తీరిపోను. నీలాంటివాడు కావాటోయి దేశానికి కావలసింది. నాలాంటివాళ్ళు వెయ్యిమంది బతికినా ఏం ప్రయోజనం.’ ప్రకాశరావు కళ్ళనుంచి వెచ్చని కన్నీళ్లు జారి చెక్కులమీద ప్రవహించాయి. అతనికి సుబ్రహ్మణ్యం విగ్రహం మరింత స్పష్టంగా కనబడింది. సుబ్రహ్మణ్యం మొహంమీద కుడివైపునవున్న ఒక పెద్ద గంటు అతనిదృష్టిని ఆకర్షించింది. ఆ గంటు ఎప్పటిదంటే—ఒకమాటు సుబ్రహ్మణ్యం ఒక వితంతు వివాహం వూరేగింపులో వెళుతున్నాడు. అప్పుడు సనాతనులు ఆ వూరేగింపుమీద రాళ్ళవర్షం కురిపించారు. ఒక పెద్దరాయివచ్చి సుబ్రహ్మణ్యం కుడికణత కు తగిలింది. అతను వెంటనే మూర్ఛపోయాడు.

స్నేహితులు శైత్యోపచారాలు చెయ్యగా తెలివి వచ్చింది. ఆ దెబ్బ తొలూరుగంటు అసి. ప్రకాశరావు ఆ గంటునుచూసి 'అంత దెబ్బ తినీకూడా నువ్వు మూర్ఛనుంచితేచిన వెంటనే పకపకనవ్వుతూ సరదా మాటలు మాట్లాడావు. నువ్వుగాక మరొకడు అలాగ మాట్లాడగలడా! 'తెలివితక్కువ వెధవ ఎవడో వెధవ రాయిముక్క విసిరాడు. కత్తి విసిరివుంటే ఎంతో బాగుండిపోను. వాడిప్రాణానికి హాయిగా వుండును' అని అన్నావు నువ్వు. వీరుడవంటే నువ్వేకాదుటోయి! ...నీ కడుపున ఎటువంటివాడు పుట్టాడు! పులికడుపున లేడి పుట్టినట్టుగా పుట్టాడు.' అని ప్రకాశరావు దుఃఖిస్తూ తలచుకున్నాడు. అతను సుబ్రహ్మణ్యాన్ని గురించి తలవగా ఇంకా మరికొన్నిసంగతులు జ్ఞాపకం వచ్చాయి. 'నా అనుకరింపుశక్తిని మా సుబ్రహ్మణ్యం ఎంతో మెచ్చుకునేవాడు. నేను తరచు వీరేశలింగం గారిని అనుకరించేవాణ్ణి. నేను ఆయన కీచుగొంతుక తోటీ, దగ్గుతోటీ, మాట్లాడుతూవుంటే సుబ్రహ్మణ్యం పకపకనవ్వుతూ 'నువ్వు గోడచాటునవుండి మాట్లాడితే మేమంతా పంతులుగారు వచ్చేరని బయిలుదేరి వస్తాము సుమా' అనేవాడు. నేను ఒకసారి తలుపువెనకాల నిలుచుని సుబ్రహ్మణ్యంస్వరంతో మాట్లాడాను. అప్పుడు అతను 'ఏమోయి నాప్రతిధ్వనీ ఇలాగరా' అన్నాడు. నేను 'ప్రతిబింబంతోసహా వస్తున్నాను' అనిచెప్పి, అతనిలాగే కండువావల్లెవాటు వేసుకుని, పెదిమెలు బిగించుకుని, ఠీవిగా నడిచివెళ్ళాను. అందరూ నన్ను 'సుబ్రహ్మణ్యంప్రతిబింబం' అని పిలిచి పకపకనవ్వారు. సుబ్రహ్మణ్యం నా చెయ్యిపట్టుకుని ఆడించి 'నేను చచ్చిపోయినా నీలో బతికివుంటానుసుమా' అన్నాడు. అప్పుడు నేను అతని నోరునొక్కి 'నాలాంటివాళ్ళు వందమందిచచ్చినా దేశానికి నష్టంలేదు. నీలాటివాడు ఎంతో అవసరం. తెలుగుదేశం బాగుపడాలంటే నీలాంటివాళ్లు వెయ్యేళ్లు బతకాలి' అన్నాను. కాని ఆ మాయరోగంవచ్చి వెయ్యేళ్ళూ ఇట్టే నిండించింది. మా సుబ్రహ్మణ్యాన్ని తనపొట్టను పెట్టుకుంది.' ప్రకాశరావు దుఃఖం భరించలేక వెక్కివెక్కి ఏడ్చాడు. కొంత సేపటికి శాంతించి 'మా సుబ్రహ్మణ్యం ఎంతసేపూ ఉపన్యాసాలలో ఒక్క సంగతిగురించి చెప్పేవాడు. 'ఈ దేశం బాగుపడాలంటే మొదట స్త్రీలు బాగుపడాలి. సంఘసంస్కరణ స్త్రీలనుంచి ప్రారంభించాలి. స్త్రీలకు విద్య మొగవాళ్ళకంటేకూడా అవసరం. స్త్రీవిద్యావ్యాప్తికి సంస్కర్తలు కంకణంకట్టుకోవాలి' అని అనేవాడు. ఆ ఉద్దేశంతోటే అతను భార్యను కష్టపడి చదువుచెప్పాడు. ఆ పతివ్రతకూడా అతనికి అనేక పనులలో సహాయపడేది. పతిమాటను ఎన్నడూ ఎదురాడి ఎరగదు ఆ మహాఇల్లాలు. అటువంటి దంపతులకు ఇటువంటి దురాత్ముడు ఎలాగపుట్టాడో!' ప్రకాశరావు ఆశ్చర్యంతో ఎంతోసేపు అలాగే వుండిపోయాడు. ఆ తర్వాత అతను 'ఆ అల్లుడు ముండాకొడుకు ఎన్నిబాధలు పెట్టాడోయ్ నిన్ను సుబ్రహ్మణ్యం! తన మామగారు అని చెప్పుకోడానికి తాను ఎంతో సిగ్గుపడుతున్నాడుట! సుబ్రహ్మణ్యం విధవావివాహాల్లో తిరిగేమాటుంటే తను పెళ్ళాన్ని విడిచి పెట్టేస్తాడుట! ఎన్నికష్టాలు భరించావోయి నువ్వు! సుబ్రహ్మణ్యం! నీదే జన్మంటే. నీదే బతుకంటే. తక్కినవాళ్ళందరివీ కుక్కగొడ్డుగు జన్మలు.' సుబ్రహ్మణ్యం జీవితంగురించి తలపోయగా, తలపోయగా ప్రకాశరావుకి 'సత్కార్యాలకు పరమశత్రువు భగవంతుడేనా ఏమిటి చెప్మా' అని అనిపించింది. ఆ తర్వాత అతనికి లక్ష్మణరావు జ్ఞాపకంవచ్చాడు. 'ఈ కుర్రవెధవనుచూసి మా సుబ్రహ్మణ్యం ఎంత సంబరపడేవాడు. నా పేరు నిలబెడతాడు మావాడని పొంగిపోయేవాడు. 'మాపుత్రుడు నాపని నిర్వహిస్తాడు కాబట్టి నేనింక ధైర్యంగా చచ్చిపోవచ్చు' అనేవాడు. అంతే కాని ఈవెధవ ఇంత నిర్భాగ్యుడు అవుతాడని అతను కలలోనేనా అనుకోలేదు. ఎటువంటి తండ్రికి ఎంటువంటి కొడుకువు పుట్టావురా లక్ష్మణరావూ!'' ప్రకాశరావు పళ్లు బిగించాడు. అతని గుప్పిళ్లు బిగిశాయి. అతని ఒంటో రక్తం వడివడిగా ప్రవహించింది. ''ఈ దురాత్ముడికి తగిన శిక్ష చెయ్యాలి. సుబ్రహ్మణ్యం యొక్క ఆత్మకు బాధకలిగిస్తూన్న వీడికి గట్టిగా ప్రాయశ్చిత్తం

చెయ్యాలి, తప్పదు.'' అని అనుకున్నాడు. ప్రకాశరావు మనోనేత్రానికి సుబ్రహ్మణ్యం మరింత స్పష్టంగా కనపడ్డాడు. అతను స్నేహితుణ్ణి ఆపాదమస్తకం చూశాడు. సుబ్రహ్మణ్యం కళ్ళనుంచి కన్నీళ్లు కారడం అతను గుర్తించాడు. ప్రకాశరావు కళ్ళనుంచి కూడా కన్నీళ్ళు కారాయి. అప్పుడు అతను నెమ్మదిగా 'అటువంటి కొడుకును కన్న నీ ఆత్మకు శాంతి ఎక్కడిది! ఎప్పుడూ కలకలలాడుతూ వుండే నీ మొహానికి ఈ దీనత్వం తెచ్చిపెట్టాడు నీ కొడుకు' అని అనుకుని, లేచాడు. తువ్వాలుతీసుకుని కళ్లు తుడుచుకున్నాడు. విచారం వదలడానికి ఒళ్ళు విరుచుకుని తర్వాత మఠం వేసుకు కూచుని ముందు చెయ్యవలసిన పనిని గురించి గంభీరంగా ఆలోచించాడు.

౨

లక్ష్మణరావు పద్దెనిమిదేళ్ళ కుర్రవాడు. అతను ఆకారంలో తండ్రిపోలికే గాని మనస్సులో మాత్రం కాదు అతను అంత స్థిరమైన చిత్తం కలవాడు కాదు. మాటలుకూడా విచిత్రంగా వుంటాయి. దేనిని గురించి మాట్లాడినా వెర్రి వేదాంతంగా మాట్లాడతాడు. గాంభీర్యం అతని మొహంలోగాని పనులలోగాని లేదు.

లక్ష్మణరావు ఒకనాడు సాయంత్రం ప్రకాశరావు ఇంటివైపు వెళుతున్నాడు. ప్రకాశరావు వీధి అరుగు మీద కూచుని చంటిపిల్లను ఆడిస్తున్నాడు. లక్ష్మణరావు ప్రకాశరావుని చూసి ఆగి, అరుగుదగ్గరికి వచ్చాడు. ప్రకాశరావు చాపతెద్దామని లేచాడు. కాని లక్ష్మణరావు 'చాపవద్దు, ఇక్కడే కూచుంటాన'ని చెప్పి చేతికర్ర అరుగుమీదపెట్టి కూచున్నాడు.

''క్షేమంగా ఉన్నావా'' అని ప్రకాశరావు అడిగాడు, మనస్సులో ప్రజ్వరిల్లుతున్న కోపాన్ని ఒకవైపుకు తోసివేసి.

'అదే క్షేమం' అన్నాడు లక్ష్మణరావు ఆకాశంవైపు మొహం తిప్పి.

ప్రకాశరావు లక్ష్మణరావుని అతని పెళ్ళిని గురించి అడుగుదామని అనుకున్నాడు కాని, దానిని గురించి తాను శాంతంగా మాట్లాడలేననీ, కోపంగా మాట్లాడితే ముందు తాను చెయ్యబోయే పనికి భంగం రావచ్చుననీ పూరుకుని, ఉత్తినే 'షికారు బయలుదేరేవా' అని అడిగాడు.

'అదేనండి. మా రైతునూ, పాలికాపునూ కూడా నమ్మలేకుండా వున్నానండీ! ఇద్దరూకూడా ఎవడి మట్టుకు వాడే మామిడికాయలు అమ్మేసుకుంటున్నారని ఎవరో నాతో చెప్పారు. ఒకమారు తోటకు హఠాత్తుగా వెళ్ళి విషయాలు తెలుసుకుందామని బయలుదేరాను' అని లక్ష్మణరావు చేతికర్ర తీశాడు పూరికే.

'మంచిదే' అన్నాడు ప్రకాశరావు, ఈసమయం నాకేమేనా పనికివస్తుందా అని లోలోపల ఆలోచించుకుంటూ. తర్వాత అతను 'ఇంత సాయంత్రం బయలుదేరేవేం' అని ప్రశ్నించాడు, విడిపించుకొని పోతున్న చంటిపిల్లను దగ్గరికి లాక్కొంటూ.

'ఏదో ఇప్పటివరకూ అశ్రద్ధయి పోయింది ఇప్పుడు బుద్ధి పుట్టింది వెళ్ళివద్దామని. బయలుదేరాను' అన్నాడు లక్ష్మణరావు, చేతిలో బెత్తం అరుగు మీద పెడుతూ.

'బాగానేవుంది. ఇంకా ఆలస్యంచేస్తే మరీ ఆలస్యమయిపోతుందేమో, వెళ్లిరా' అన్నాడు ప్రకాశరావు కోపాన్ని దిగమింగుతూ.

'అలాగే' అన్నాడు లక్ష్మణరావు. అని అరుగు మీది బెత్తం తీసుకుని బయలుదేరాడు.

ప్రకాశరావు అరుగుమీదే కూచుని ఆలోచించాడు, 'ఈ అవకాశం నాకేమేనా పనికివస్తుందా? ఈ సాయంత్రం నేనుకూడా అతని వెంట వెళితే లాభముంటుందా' అని. కాని 'ముందుసంగతి నిర్ధారణగా ఎవడు చెప్పకలడు' అని అనుకొని అతను వెంటనేలేచి ఇంట్లోకి వెళ్లి, పిల్లను భార్యచేతికి యిచ్చి, గుడ్డలు వేసుకుని, ఒక చిన్న దోమతెర మూటకట్టుకుని, మరొకదారిని లక్ష్మణరావుతోటకు బయలుదేరాడు.

లక్ష్మణరావుయొక్క చిన్న మామిడితోట రాజమహేంద్రవరంలో మోరంపూడిరోడ్డున ఫ్యాక్టరీల అవతల ఉంది. ఆతోటకు చుట్టూ కంచెలాగ జీడిమామిడి

చెట్లు ఉన్నాయి. తోటలో అన్నిరకాల పళ్ళచెట్లూ కాస్తోకూస్తో ఉన్నాయిగాని మామిడిచెట్లే ముఖ్యంగా ఎక్కువ. లక్ష్మణరావు సూర్యుడు కుంకినతర్వాత ఆ తోట చేరుకున్నాడు. అతను తోటలోకి వెళ్ళి పాక దగ్గిర ఒకకేక వేశాడు. రైతూ పలకలేదు, పాలికాపూ పలకలేదు. గుంజలకు కట్టేసిన రెండుఎడ్లూ మాత్రం మేస్తున్నాయి. ఎవరూ లేనందుకు లక్ష్మణరావు గొణుక్కుంటూ పాకలోకి వెళ్ళి చూశాడు. ఎవ్వరూ కనపడలేదు. తిరిగి ఎడ్లదగ్గిరికి వచ్చి వాటిని నువ్వి బుజ్జగించాడు. రైతుగాని, పాలికాపుగాని వస్తాడేమో మాట్లాడదాం అని కూచున్నాడు కాని వాళ్ళు వస్తూన్న జాడ కనబడలేదు. అప్పటికప్పుడే ఆకాశంలోవున్న కాస్తవెలుగూకూడా జారిపోయింది. చెట్లనీడలు చీకటిని మరింత త్వరగా రప్పిస్తున్నాయి. కోకిల ఆఖరిసారి పాటపాడి ఎగిరిపోయింది. జెముడుకాకి కంసాలివానిసుత్తిలాగ చప్పుడుచేస్తూంది. మరికొన్ని పక్షులు సందడి చేస్తున్నాయి. కీచురాళ్ళు సంగీతం పాడుతున్నాయి. అధమం పాలికాపేనా వస్తాడని, వాడి సాయంవల్ల తాను ఇంటికి పోవచ్చునని, లక్ష్మణరావు తలచి పాకదగ్గిరే కూచున్నాడు. అతను మరికొంచెం సేపు చూశాడు, ఎవరూ రావడం కనబడలేదు. అప్పటికప్పుడే పక్షుల సందడి చాలామట్టుకు తగ్గిపోయింది. చీకటిపడుతూంది. కాలక్షేపం కోసమని అతను మామిడికాయలు రెండు కోసి కొరుక్కు నములుతున్నాడు. నములుతూ 'ఏదేనా దీపం ఉండినా బాగుండిపోను. ఇక్కడే కూచుందును వాళ్ళెవళ్ళేనా వచ్చేవరకూ' అనుకున్నాడు. మరికొంచెం సేపు చూశాడు. పక్షుల ధ్వనికూడా తగ్గిపోయింది. నిశ్శబ్దంమాత్రమే చెవుల్లో గింగురుమని శబ్దంచేస్తూంది. అతను తనలో 'చీకటిమయం. ఈ చీకట్లో ఇక్కడ ఒంటరిగా కూచునే బదులు ఇంటికి బయలుదేరుతేనే మంచిదేమో, ఈ వెధవలు ఇంకా రాలేదు' అని అనుకుని రైతును నాలుగూ, పాలికాపును నాలుగూ తిట్టి, నిలబడ్డాడు. చుట్టూ గాఢాంధకారం కీచురాళ్ళ శబ్దంమాత్రం వినబడుతూంది. అప్పుడప్పుడు వీస్తూన్న గాలికి ఎండుటాకులు ఎగిరి చప్పుడు చేస్తున్నాయి. అంతకుమించి మరేమీ సందడిలేదు. లక్ష్మణరావు చేతికర్రచప్పుడు చేస్తూ బయలుదేరాడు. చీకటిలోంచి పొడుచుకు చూస్తున్నాడు. ఎండుటాకులు కాలికిందపడి చప్పుడు చెయ్యగా అతను అదిరిపడుతున్నాడు. పదిగజాల దూరంలో ఏదో సర్రున పాకిపోయినట్టనిపించింది. అతని గుండె జారిపోయింది. కాలికింద ఎండుపుల్ల పడగా తుళ్ళిపడి ఒక్క గంతు వేశాడు. ఆపుల్ల టుప్పున విరిగింది. పాముకాదని అతను ధైర్యంపొందాడు. అలవాటయిన దారి అవడంచేత అతను దారికోసం విశేషం తడుముకోక నడుస్తున్నాడు. ముద్దకట్టిన చీకటిలాగ వున్న చెట్లవైపు చూడడానికి అతను ఎంతో భయపడుతున్నాడు. పొరపాటున దృష్టి ఆవైపు మళ్ళితే చెట్లమీంచి దెయ్యాలు దిగివస్తూన్నట్టుగా అతను వూహించుకునేవాడు. చీకటిభయం, పాములభయం, దెయ్యాలభయం. అతను ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని నడుస్తున్నాడు ఎలాగయితేయేం సగందూరం వచ్చేశాడు. అంతవరకూ ఏమీ ప్రమాదం రానందుకు దేవుడికి వెయ్యిదండాలుపెట్టి రైతును గురించీ, పాలికాపును గురించీ సణుక్కుంటూ, నడక సాగించాడు. ముందు అడుగువేశాడు. 'నాయనా' అన్న మాట వినబడ్డది. లక్ష్మణరావు గుండె బద్దలయి పోయింది. గభాలున ఆగాడు. మళ్లా ఏశబ్దమూ వినబడలేదు. కీచురాళ్ళుమాత్రమే చప్పుడు చేస్తున్నాయి. ఏశబ్దమూ వినబడనందువల్ల అతను, భయపడ్డ తన మనస్సు సృష్టించుకొన్న శబ్దమది అని తలచి, అడుగువేశాడు. మళ్లా 'నాయనా' అన్నమాట వినబడింది. అతని గుండె చక్కలయిపోయింది. ఊపిరి ఆగి పోయింది. రక్తమంతా ఒక్కమారు తలకెక్కి పోయింది. గాలిదుమారానికి ఆడిన చెట్టులాగ అతను వణికి పోయాడు. మూర్ఛపోకుండా వుండడానికి అతను ఎంతో ప్రయత్నంచేసి చివరికి నెగ్గాడు. 'నాయనా' అన్నమాట మళ్లా వినబడింది. తుళ్ళిపడ్డాడు. ఆధ్వని ముసలివాడి గొంతుకలాగ వినబడింది లక్ష్మణరావుకి. అతని నోంట్లో ప్రతికండరం అదరడం మొదలెట్టింది. 'నాయనా! నేనే

రా, మీ నాన్నని' అంది ఆస్వరం. లక్ష్మణరావు ఒళ్ళు విపరీతంగా జలదరించింది. ఎంతో ప్రయత్నంచేసి అతను నీరసించిన కళ్ళను ధ్వనివస్తున్నవైపు తిప్పి ఒక పెద్దమామిడిచెట్టు పక్కని, నిలివిడెత్తు తెల్లని పదార్థంవుండడం చూశాడు. అది దెయ్యమని నిశ్చయించుకున్నాడు. విద్యుచ్ఛక్తిదెబ్బ తగిలినట్లుగా అతని ఒళ్ళు అదిరింది. ఒక్క పరుగులో ఇంటికి పోదామని అనుకున్నాడు కాని కాళ్ళు ఆడలేదు. నేలకు పాతేసినట్టుగా కాళ్ళు నిలబడిపోయాయి.

'నాయనా! భయమెందుకురా వెర్రితండ్రీ, నేనేరా, మీ నాన్నని' అంది ఆస్వరం

'నాన్న' అన్నశబ్దం ప్రియమైనదేకాని అదిదెయ్యం నోటినుంచి వచ్చినదవడంచేత లక్ష్మణరావు మరింత అదిరిపడ్డాడు. ఆదెయ్యం తన తండ్రిదెయ్యంఅని నిశ్చయించుకున్నాడు.

'నాయనా' అని దెయ్యం మళ్ళీపలికింది.

లక్ష్మణరావు కొంచెం ధైర్యంతెచ్చుకుని 'ఎం—దు—కూ' అని నత్తివాడు అన్నట్టుగా అన్నాడు. అని తన శబ్దానికి తానే తుళ్ళిపడ్డాడు.

'భయమెందుకురా, వెర్రినాయనా నేనేరా మీనాన్నని' అంది దెయ్యం మళ్లీ.

అతనికి వున్నధైర్యంకూడా పోయింది. కాని మంచితనంగా వుండి దెయ్యాన్ని వేగిరం వదల్చుకుందామని అతను 'ను-వ్వా!' అన్నాడు.

'బాబూ ! నిన్ను చిన్నపిల్లడప్పుడు చూశానురా. ఎంతవాడ వయావురా తండ్రీ.'

'ఎం—దు—కూ'

'దగ్గిర కొస్తావుట్రా నాయనా'

'బాబోయ్!' అని ఒక్క కేకవేశాడు లక్ష్మణరావు. అతను ఎంతో పెద్దకేకవేశానని అనుకొన్నాడు కాని శబ్దం నోటిలోంచి ఇవతలికి రానేలేదు. పరిగెత్తిపోడానికి ఎంతో ప్రయత్నంచేశాడుకాని కాళ్ళు ఆడలేదు.

'పోనీలే, తండ్రీ! భయపడకురా' అంది దెయ్యం నెమ్మదిగా.

లక్ష్మణరావు ఒళ్ళు విపరీతంగా జలదరించింది.

'నాయనా ! నేను ముసిలివాణ్ణయి పోయానురా. నువ్వు నా ఈముసలిబతుకును సుఖపెట్టవురా?

దెయ్యానికి ఏదో సమాధానంచెప్పి వేగిరం వదుల్చుకుందామని అతను 'ఎ—లా—గా' అన్నాడు, కొంచెం ధైర్యం తెచ్చుకుని.

'తండ్రీ! నేను కష్టపడి నాబతుకంతా సంఘసంస్కారణకే వినియోగించానురా. నువ్వు నామనస్సు కలతపెట్టి నూరుపోవ తొక్కుతున్నావుట్రా? బాబూ. న్యాయమేనా? తండ్రీ!'

లక్ష్మణరావుకు చెప్పలేనంత భయంవేసింది. 'లే—దు' అన్నాడు వణుకుతూ.

'నాయనా! నువ్వు ఒకుగుచేసుకుని చిన్నపిల్లను పెళ్లిచేసుకో దలచుకున్నావుట్రా? బాబూ!' అంది దెయ్యం.

లక్ష్మణరావు గుండె ఒక్కమాటు ఆగిపోయింది. ఒళ్ళు విపరీతంగా వణికిపోయింది. దెయ్యానికి ఈ విషయం ఎలా తెలిసిందో అని అతనికి భయంవేసింది. కాని ఆవిషయమై అతను ఆట్టే ఆలోచించక 'లే—దు' అన్నాడు.

'ఆపనులుచేసి నా ఆత్మను దుఃఖపెడతావుట్రా? తండ్రీ!'

'లే—దు—నా—న్నా' అన్నాడు లక్ష్మణరావు అని 'నాన్నా' అన్నమాట తనకు తెలియకుండా నోటినుండి వచ్చినందుకు భయపడి, వణికాడు.

'ఇప్పుడు నా కొడుకువు అనిపించుకున్నావురా తండ్రీ. నాముద్దుతండ్రీ.'

లక్ష్మణరావు వెనకటిమోస్తరుగానే 'లేదు' అని, మళ్ళీ జ్ఞాపకం తెచ్చుకుని 'ఔ—ను'అన్నాడు.

'అంతభయమేమిట్రా తండ్రీ, వెర్రినాన్నా. ఇంక వెళ్ళిరానుట్రా బాబూ.'

'ఊఁ—వె—ళ్ళు' అన్నాడు లక్ష్మణరావు వూపిరి బంధించి.

దెయ్యం కదిలింది. అది వెళుతూ వెళుతూ క్రమేపీ చిన్నదయిపోడం లక్ష్మణరావు చూశాడు. ఆకులు

చప్పుడు కాకుండా దెయ్యం ఎట్లా నడిచిపోయిందా అని అతను కాస్త ఆశ్చర్యపడ్డాడు. అంతసేపూ ఆగిపోయిన కాలం తిరిగి కదిలినట్టు లక్ష్మణరావుకి అనిపించింది. దెయ్యాన్ని వెళ్ళనిచ్చి అతను ఇంకా ఆ తోటలో వుంటే అది మళ్లా ప్రేమచేత తిరిగి వస్తుందేమో అని అనుకుని, 'ఈ బరువుకూడా ఎందుకని చేతిబెత్తం కింద పారేసి ఒక్క పేపరుగు పుచ్చుకొని రోడ్డు దగ్గరికి వచ్చి, మాలాళ్ళ కొంపలదాకా మళ్లా దవుడు తీసి, వెనక్కి తిరిగి చూసి, దెయ్యం తనవెంట రానందుకు సంతోషించి, తాను బతికివున్నందుకు భగవంతుడికి వెయ్యిదండాలు పెట్టి పడిపడిగా నడిచి ఇంటికి వెళ్లిపోయాడు.

లక్ష్మణరావు పరుగెత్తి వెళ్ళిన తర్వాత ప్రకాశరావు తాను ఒంటిమీద కప్పుకున్న దోమతెర తీసేసి మూటకట్టుకున్నాడు. నెమ్మదిగా ఇంటికి బయలుదేరాడు. ప్రకాశరావు తాను మామిడిచెట్టు దగ్గర నవుస్తూన్నంతసేపూ చప్పుడుకాకుండా వుండేటందుకుగాను తాను తోటలోకి వచ్చినవెంటనే ఆచెట్టు చుట్టూవున్న ఎండుటాకులు తీసేసి దూరంగా పారేశాడు. లక్ష్మణరావు 'వెళ్ళు' అని అన్నప్పుడు, అతను మామిడిచెట్టు వెనక్కి వెళ్ళిపోయాడు. కాని లక్ష్మణరావుమాత్రం దెయ్యం వెళుతూ వెళుతూ చిన్నదయిపోయిందనీ, ఆకుల చప్పుడు కాకుండా నడిచిందనీ భ్రమపడ్డాడు. ప్రకాశరావు తాను సుబ్రహ్మణ్యందెయ్యంభూమిక చక్కగా ధరించినందుకు తన్ను అభినందించుకుంటూ తన యత్నం లక్ష్మణరావుమీద తప్పకుండా పనిచేస్తుందని అనుకుంటూ ఇంటికి వెళ్ళిపోయాడు.

* * *

లక్ష్మణరావు ఆతర్వాత ఒడుగుచేసుకోలేదనీ, చిన్న పిల్లను పెళ్ళిచేసుకోడం మానేశాడనీ పాఠకులకు వేరే చెప్పనక్కర్లేదు. అతను కొన్నాళ్ళయిన తర్వాత ఒక వితంతు పిల్లను పెళ్లిచేసుకున్నాడు. సంఘసంస్కరణవిషయంలో అతను ఎటువంటి కష్టాలకూ వెనుతియ్యక, తన తండ్రినే ఆదర్శంగా పెట్టుకుని ప్రవర్తించాడు.

—పేకమళ్ళ కామేశ్వరరావు, బి.ఏ.

# ఇది ఉరుము ఉరిమి మంగలంమీద పడ్డమేనా?

## ౧

రామారావూ, చంద్రమూ కలసి సుబ్బులింటికెళ్లేరు. వీళ్ళని చూసి పార్వతికూడా అక్కడకు పరుగెత్తుకు వచ్చింది.

'డాక్టరాట ఆడుకుందామురే?' అన్నాడు చంద్రం.

'ఆఁ ఆడుకుందాం; మా ఇంట్లో మందులున్నాయ్; థర్మామీటరుంది' అంది పార్వతి.

'సరే, నడువు; మీయింటికే వెళ్ళి ఆడుకుందాం' అన్నాడు చంద్రం. సుబ్బులు వాళ్ళకూడా వెళ్ళింది.

పార్వతి వాళ్ళనందరినీ బోషాణం వెనకాల కూచోమని లోపలికెళ్ళి, వాళ్ళ అమ్మా, నాన్నా చూడకుండా బీరువాలో ఉన్న హోమోపతీ మందుల పెట్టీ, బల్బుపగిలిన థర్మామీటరూ తెచ్చింది. చంద్రం 'నేను డాక్టరిని; నేను డాక్టరుని' అని కేకలేశాడు.

'నేను – నేను' అని అరిచింది సుబ్బులు. వీళ్ళ అల్లరివిని 'ఎవరురా అక్కడ' అని సింహగర్జనచేసింది పార్వతితల్లి.

చప్పుడుకాకుండా చంద్రమూ, సుబ్బులూ వీధి తలుపు తీసుకొని బైటపడ్డారు. మిగిలినవాళ్ళు దొడ్డిదారి పట్టేరు. అందరూ కావమ్మగారి ఇంటికెళ్ళేరు. వాళ్ళ గాదెకు వెనకాల ఓచాపవేసుకు కూచున్నారు.

'జ్వరం ఎవరికొచ్చిందో వాళ్ళు పడుకోండి' అన్నాడు చంద్రం.

'నాకు జ్వరమొచ్చిం'దని, దుప్పటీ కప్పుకొని పడు కుంది పార్వతి.

'ఎల్లావుందమ్మాయీ' అని పార్వతిదగ్గరకొచ్చి పొట్టమీద చెయ్యివేసిచూసి 'అమ్మో! ఎంతజ్వరమో' అంది సుబ్బులు.

'అబ్బా! వుండవే; నన్ను చంపుతావ్ ?' అంటూ చెయ్యి అవతలకు విదలించింది పార్వతి.

డాక్టరుగారు లోపలికొచ్చారు. సుబ్బులూ, కావమ్మా ఓపక్కగా నుంచున్నారు.

'నీకు జరంగావుందా ?'

'మరే.'

'దగ్గొస్తోందా ?'

'ఒస్తోంది' అని నెమ్మదిగా దగ్గింది.

'ఈథర్మామీటరు నోట్లోపెట్టుకో.'

* * *

'అబ్బో! జ్వరం చాలాఉంది; ఇవిగో ఈమాత్రలు మింగు' అని పదిమాత్రలు సీసాలోంచి తీసి ఇచ్చాడు చంద్రం.

కాసేపు అల్లాగే పడుకొని ఉంది పార్వతి. సుబ్బులొచ్చి 'ఇక లేవవే' అంది. పార్వతి లేచికూచుంది.

'జ్వరంపోయిందా?' అన్నాడు చంద్రం.

'ఆఁ పోయింది' అంది పార్వతి.

'నాకూ జ్వరంగాఉంది—రెండుమాత్రలీయవురా?' అంది కావమ్మ. చంద్రం నాలుగుమాత్రలిచ్చాడు.

'నాకు కాలునెప్పిగా ఉంది' అంది సుబ్బులు.

'నాకు తలనెప్పిగాఉంది' అన్నాడు రామారావు.

అందరికీ, తలోనాలుగూ ఐదూ ఇచ్చి తాను తిండానికి సీసాడుమాత్రలైతే చేతిలో ఒంచుకున్నాడు చంద్రం.

'అమ్మో! అన్నిమాత్రలే! మానాన్న తిడతా'డంటూ కలియబడి లాక్కోబోయింది పార్వతి.

చంద్రం తొందరపడి నోటిలో వేసుకోబోయాడు. రామారావు వెనకాలనుంచి చేతిమీద కొట్టేడు. అన్నీ కింద పడిపోయినాయి; ఎవరికి దొరికినవి వాళ్ళు తిన్నారు. మందులపెట్టి తీసుకొని ఏడుస్తూ ఇంటికెళ్ళిపోయింది పార్వతి.

## ౨

'ఏమే, ఏడుస్తున్నావేం?'

'వాళ్ళచంద్రం కొట్టేడు.'

'అయిందిగదా? నీకంతే కావాలిలే. అయ్యో! ఆ మందుల పెట్టి ఎప్పుడు పట్టుకెళ్ళేవే? అసి నిన్ను...'

'నేను పట్టుకెళ్ళలేదు.'

'నువ్వు పట్టుకెళ్ళకపోతే నీచేతిలోకి ఎల్లావచ్చిందీ? ఏది ఇల్లాతే.'

'.........................'

'ఆసి, నీయిల్లు వల్లకాడుగానూ, మందులన్నీ కాజేశావుటే? జబ్బుచేస్తుంది కూడాను ఇవన్నీ తింటే— ఏం సాధనమమ్మా?.........ఊఁ ఆ చంద్రిగాడితో నిన్నెవ రాడమన్నారే?' అంటూ బుగ్గలు సాగతీసి, ఓ చరుపు చరిచింది.

'వాడేతెమ్మన్నాడు.' (ఏడుస్తూ)

'ఛా, నోర్యూమ్మాయి; వాడు గడ్డితినమంటే తింటావా?' అని మళ్ళీ ఈ లెంపా ఆలెంపా వాయించి పైకి ఏడవొద్దని శాసించి, 'నాన్నొచ్చేదాకా నోరు మూసుకొని, కదలకుండా అల్లాగే కూచో—నీరోగం కుదిరిపిస్తా' అని లోపలి కెళ్ళిపోయిం దామె.

పార్వతల్లాగే నోరుమూసుకు కూచుంది. కొంతసేపటికి వాళ్ళ నాన్నొచ్చి 'ఏమిటే, అల్లా నోరుమూసుక్కూచున్నావ్ ?' అన్నాడు చేత్తో వీపుతట్టుతూ.

'అమ్మ కొట్టింది' అని బావురుమంది పార్వతి.

'నేను కనుక్కుంటాను, ఊరుకో' అని సముదాయించి, ఏడుపుమానినతర్వాత లోపలికెళ్ళి, 'ఏమే, పిల్ల కంతకఠినశిక్ష విధించావ్?' అన్నాడు.

'ఆఁ విధించరు! వెధవల్లరి ఇదీనీ. ఆ చంద్రిగాడితో కలసి నానాఅల్లరీనీ; ఆమందులన్నీ ధ్వంసంచేశారు. తియ్యగా ఉంటాయిగదా అని తిన్నన్ని తిన్నారు—చూశారా ఈ సీసాల్లో దుమ్మెంత కలిపేరో?'

'దాన్నెందుకు తీసికెళ్ళనిచ్చావు నువ్వు?'

'అదుగో, నేననుకుంటూనే ఉన్నా అల్లా అంటారని; ఉలుముటిమి మంగలంమీద పడిందిట! అది పాడుచేయడమేమిటి? మీరు నన్ను నిలదీసి అడగడమేమిటి? మాబాగా ఉంది.'

'ఐతే, అందేం అల్లరిచేస్తున్నా, ఏవిపాడుచేస్తున్నా నువ్వు చెప్పనక్కర్లేదన్నమాట!'

'చెప్పకేం? చెప్పాలి. ఒకమాటు, చెప్పొచ్చు; రెండుమాట్లు చెప్పొచ్చు ఉదయాస్తమానాలూ అల్లరయితే ఎన్నింటికని చెప్పి చచ్చేది? ఐనా ఆ చంద్రిగాడు ఏం వెధవఅల్లరిపనులు నేర్పుతున్నాడమ్మా పిల్లకి?—మధ్య నాకొస్తున్నాయ్ చివాట్లు' అంటూ అశ్రుధారాస్త్రాన్ని ప్రయోగించి దొడ్లోకి వెళ్ళిపోయింది.

'ఏమిటీ అంటున్నావ్? చేతనైతే పిల్లల్లరి చేయకుండా చేసుకోవాలి వాళ్ళను కొడితేనూ తిడితేనూ ఏంలాభం? అజ్ఞానులుగదా? ఊఁ.'

'ఏమోమరి, నేనంత చదువుకోలేదు, ఈమాత్రపు ఊహ కలగడానికి.'

'చాలుతే ఊరుకో ఈపాటికి; పిల్ల మందులపెట్టి ముట్టుకోకుండానే చూడాలి; నీకా తెలివితేటలు లేకపోతే నోరుమూసుకు కూచోవాలి. దాన్ని చితకకొడితే వస్తుందా ఇప్పుడు? ఆ శాంతమే ఉండాలని చెప్పేది-నేను;'

'........................'

'మొన్న పిల్లనేదో అన్నారని ఆ వెంకమ్మగారి ఇంటిమీదికెళ్ళేవుగదా యుద్ధానికీ—చంద్రశేఖరాన్ని చంద్రిగాడనడం వింటే వాళ్ళూరుకుంటారా? నీపిల్ల నీకెంత ముద్దో వాళ్ళ పిల్లాడు వాళ్ళకంత ముద్దుకాదూ? ఆమాత్రం తెలియక్కర్లేదూ?'

'ఎప్పుడూ, ఇల్లా ఊళ్ళోవాళ్ళనే వెనకేసుకొచ్చారు; ఎందుకూ ఈగొడవ? నాదే బుద్ధితక్కువలెండి.'

'ఊరుకో ఇంక.'

## 3

పిల్లలందరూ చేరేరు వీధులో; చంద్రం తెచ్చిన బంతితో కొంతసేపాడుకున్నారు 'ఇక రైలాట ఆడదాం, వరసగా నుంచోం' డన్నాడు చంద్రం. ఒకరి బుజం ఒకరు పట్టుకొని నుంచున్నారు. ఇంజనుస్థానంలో చంద్రం నుంచుని 'కూ' అని గట్టిగా కూసి 'ఝూంప్, ఝూంప్' అంటూ బండి సాగించాడు. ఒకటి రెండు వీధులు తిరిగింది బండి. వీళ్ళల్లరివిని పార్వతి వీధిలోకి పరుగెత్తుకువచ్చింది. దొడ్లో ఉన్న వాళ్ళమ్మ ఒస్తోందేమో అని లోపలికి తొంగిచూసి, వాళ్ళల్లో కలిసి, వెనకా లోరైలుపెట్టెగా నుంచోబోయింది. మందులపెట్టె మళ్ళీ తెస్తానంటే మాతో ఆడనిస్తా మన్నాడు చంద్రం.

'ఊఁ' అనబోతోంది పార్వతి.

తల్లి, లోపలకిటికీకి ప్రక్కగా నుంచుని 'నేను చెబితే నమ్మరు; మూడండి వాడివేషాలు; మళ్ళీ మందులపెట్టి తెస్తేనేగాని మాతో ఆడనివ్వమంటున్నాడు.—ఇల్లారారేం?' అని భర్తను కేకేసింది.

'పిల్లలేవో అల్లర్లుచేస్తారు. ఊరుకుందూ' అన్నాడు భర్త.

ఇంకా సంభాషణ ఎల్లాజరుగుతుందో చూద్దామని ఆ కిటికీదగ్గరే నుంచుందామె.

మందులపెట్టి తీసుకురావడానికి అంగీకరించి వాళ్ళతో వెడుతోంది పార్వతి. తల్లి వీధులోకెళ్ళి పార్వతిని కేకేసి చివాట్లు పెట్టి, లోపలికి తీసుకువచ్చింది.

పార్వతితల్లి వీధులోకి రావడంతోటే, మందులన్నీ ఎందుకు తిన్నావని తన్ను కొడతుందేమో అని భయపడ్డాడు గాబోలు చంద్రం—జోరుగా పోనిచ్చాడు బండిని.

ఏడుస్తూ లోపలికొచ్చిన పార్వతిని చూసి, భార్యను చీకొట్టి 'వెళ్ళి ఆడుకో—నీకేం భయంలే' దంటూ కుమార్తె నావలకు పంపేడు తండ్రి.

—పమ్మి రామశాస్త్రి.

# 'వనిత తనంతఁదావలచి వచ్చినఁ జుల్కనగాదె యేరికిన్'

కామం పురుషునికంటె స్త్రీకి ఎనిమిదిరెట్లు ఎక్కువనీ, ఆకారణంచేతనే సురత సుఖముకూడా పురుషునికంటె స్త్రీకి ఎక్కువనీ కామశాస్త్రగ్రంథకర్తలు సిద్ధాంతం చేసి చెపుతున్నారు. అయినప్పటికీ స్త్రీ తనంత తాను పురుషునివలచి వెళ్ళదు; గొప్పనిగ్రహ మును కలిగి ఉంటుంది. ఇట్లు నిగ్రహము చూపెట్టడం స్త్రీ సహజప్రకృతి అని కూడా శాస్త్ర కారుల సిద్ధాంతం. అయితే ఈ సిద్ధాంతాన్ని వ్యత్యస్తం చేసిన కొందరు స్త్రీలు ఉన్నారు. వారు తమంత తాము వలచి పురుషునివద్దకు వెళ్లారు. వారి 'మదతీక్ష్ణకటాక్షకోణము' లకు ప్రాయకంగా పురుషులు వశ్యులవుతూనే వచ్చేరు. కాని కొందరు పురుషులు తమంత తాము సిద్ధురాలైన నాయికల విషయమున వైముఖ్యమును చూపి తమ జితేంద్రియత్వమును ప్రదర్శించినదానికి తోడు పురుషులు వామశీలురు గనుక సులభురాలిని అవమానిస్తారనే ప్రా యోపవాదానికి కూడా తార్కాణమైనారు. ఈ పురుషులు ఆరాధనీయులై క్రాలుచున్నారని అందరూ ఒప్పుకుంటారు. కాని 'వనిత తనంతఁదా వలచివచ్చినఁ జుల్కనగాదె యేరికిన్' అని వాపోయిన ఆ తిరస్కృతస్త్రీలు దయనీయలుగా ఉన్నారని కూడా అందరూ-ప్రకాశంగా కాకపోయినా, మనస్సులోనేనా-ఒప్పుకోనితీరాలి. తమంత తాము వలచివెళ్ళి తిరస్కృతలై అందుచేత విశేషంగా దయనీయలైన స్త్రీలు మన సారస్వతంలో తొమ్మండుగురు కనిపిస్తు న్నారు. వారినిగూర్చి కొద్దిగా తెలుసుకుందాము.

## ౧. వరూధిని

పెద్దన్నతాతగారి 'పేశలసుధామయోక్తు ల్లో' ఈమె తెలుగువారికి బాగా పరిచితు రాలై ఉంది. ప్రవరుణ్ణి వలచి ఆతన్ని తన వశ్యంకావించుకోడానికి వరూధుని పన్నిన మాయలు చాలా చమత్కారంగా ఉం టాయి. ఆమాయలేవీ కార్యకార్లు కాక పోవడంనుంచి ఈమె 'పాలిండ్లు పొంగార పై యంచుల్ మోపఁగ' ప్రవరుణ్ణి గౌఁగిలిం చింది. అయినా నారికేళం నమలబడలే. ఈ వ్యాసానికి శీర్షికగా ఉంచబడ్డ 'వనిత తనం తఁ దా వలచివచ్చినఁ జుల్కనగాదె యేరికిన్' అన్న వాక్యం ఈప్రసిద్ధురాలు అన్నదే.

## ౨. చిత్రాంగి

ఈమెకూడా తెలుగువారికి బాగా తెలిసిందే. సవతిపుత్రుణ్ణి కోరింది. అది దుర్లభజనానురాగమే అయింది. కాగా వలపు అంతా ద్వేషంగా మారింది. సారంగ ధరుని ఉత్తరీయం ఆనవాలుగా చూపించి రాజరాజనరేంద్రునిచే ఆతన్ని చంపించింది.

## ౩. ఊర్వశి

దేవవేశ్య. ఎందరో 'ఇనుపకచ్చడాల్ కట్టు కొన్న మునిముచ్చులను' తనకు దాసుల్నిగా చేసుకున్న చేడె. దేవలోకమునకు చుట్టపు జూపుగా వచ్చిన అర్జునున్ని చూసి కామించి సింగారించుకొని విభావరీవేళ వివిక్తప్రదే

శంలో అతన్ని చేరింది. పాతవావులు పైకితీసి ఆతడు ఆమెను తిరస్కరించాడు. ఆతిరస్కారానికి ఆమెకు కోపంవచ్చింది. అర్జునున్ని నపుంసకుడవు కమ్మని శపించింది.

### ౪. ఉత్తరదిశ

అష్టావక్రుడు అనే మునీశ్వరుడు. హిమాలయపర్వతంమీాది ఒక హేమమయమైన భవనంలో సుందరీనికాయంమధ్య ఉండవలసి వచ్చింది. రాత్రిపూట ఒక సుందరాంగి అతని సెజ్జకు చేరింది. అయినా అష్టావక్రుడు వికలచిత్తుడు కాలేదు. ఆమె తన్ను పరీక్షింపడానికి స్త్రీరూపంతో వచ్చిన ఉత్తరదిశ అని తరవాత అతడు తెలుసుకున్నాడు.

### ౫. అంబ

ఈమెచెల్లెల్లతోబాటు ఈమెనుకూడా భీష్ముడు తనతమ్మునికిచ్చి పెళ్ళిచెయ్యాలని తలపెట్టాడు. కాని అంబ తాను సాళ్వుడు అనే రాజునువలచి ఉన్నాననీ, తన్ను వానివద్దకు పంపమనీ అడిగింది. భీష్ముడు పంపేడు. తనంత తావలచి వచ్చిన కన్య అయిన అంబను సాళ్వుడు తృణీకరించాడు.

### ౬. గంగ

ప్రతీపుడనే రాజు మహానిష్ఠతో తపస్సు చేసుకుంటున్నాడు. వాని సుగుణాలు గంగాదేవి వలపును రేకెత్తించాయి. ఆమె స్త్రీవేషధారిణియై వచ్చి ప్రతీపునకు తనవలపును ఎఱిగించుకొంది. అతని తొడమీాదికికూడా ఎక్కికూర్చుంది. అయినా ఆవలచి వచ్చిన వనితను ప్రతీపుడు త్రోసిరాజన్నాడు.

### ౭. శూర్పణఖ

ఈమె అందమైంది కాదే అనుకోండి. అయినా మానవుడు సాధారణంగా తనభార్య కాకపోతే ఆడగొఱ్ఱెల్లాఅయినాసరే అందంగా ఉంటుందనుకుంటాడనే సుప్రసిద్ధకవివాక్యం అక్షరమై ఉండగా తనకు తా వలచివచ్చినప్పుడు శూర్పణఖవంటిదైనా తిరస్కరింపబడడం ఆశ్చర్యంగానే ఉంటుంది. భర్త విద్యుజ్జిహ్వుడు చచ్చిపోయి ఎంతోకాలంకాలేదు. ఆ దుఃఖానికి తోడు తనపుత్రుడు జంబుకాసురుడు నరులచే చంపబడ్డాడను విషాదవార్త. తన కుమారున్ని చంపిన నరుల్ని వెతికి చంపివేయాలన్న కోపంతో బయలుదేరింది. రామున్ని చూడ్డంతోటే వలపుమంటలు ప్రజ్వరిల్లాయి. ఆ ఎదలో కుమారుని చావుకూడా మరిచిపోయింది. రాముడుకాని, లక్ష్మణుడుకాని మెత్తపడ్లేదు. ఆశాభంగానికి అవమానంతోడైందన్నట్లు వలపు ఈడేఱకపోగా ముక్కుచెవులకు కోతలు.

### ౮. రంభ

అందానికి పేరుమోసిన దేవకన్యల్లోకల్లా అందమైందని రంభకు ప్రసిద్ధి. అల్లాంటి రంభ—రావణుడివంటి జగదేకవీరుడికికూడా లొంగనిరంభ—తనకు తాను వచ్చి తన్ను వరింపమని కోరినప్పుడు శుకుడు లొంగలేదు. తుదకుద్వైదీభావమైనా చూపలేదు. 'మాకీవిశ్వంబున గెల్వంగూడని విభుండే లేఁడెప్పుడున్' అని గర్వించిన రంభపూర్తిగా ఖిన్నురాలై 'వనిత తనంతఁదా వలచి వచ్చిన చుల్కన గాదె యేరికిన్' అన్న నానుడికి తార్కాణమైంది.

### ౯. దేవయాని

తన తండ్రి అయిన శుక్రునివద్ద విద్యనేర్చుకుంటూ ఉన్న కచుణ్ణి వరయోగ్యామై ఉన్న దేవయాని వలచింది. అతణ్ణి చూడకుండా ఆమె అన్నంకూడా తినలేక పోయేది. ఘోరమైన ప్రమాదాలనుండి అతన్ని రెండుసార్లు బతికించింది. గురువువద్ద సెలవుతీసికొని అతడు

పోయేటప్పుడు ఆమె అతణ్ణి సమీపించి తన్ను పెళ్లాడవలసిందని కోరింది. తన్ను అన్వేషించుకొనుచు వచ్చిన అరత్నాన్ని కచుడు కాళ్ళ దన్నాడు. క్రుద్ధురాలై తాను ఆతనికి పనికి రానప్పుడు తన తండ్రివిద్యకూడా ఆతనికి పని చేయకుండుగాక అని ఆమె శపించింది.

ఇట్లు పురుషతిరస్కృతలైన ఈ స్త్రీల తొమ్మండుగురిలో చిత్రాంగి ఒక్కర్తే మగనాలి. ఆపతివత్ని—పతి ఎంత వృద్ధుడైనా—పరపురుషుణ్ని కామించడం, ఆ కామించిన పరపురుషుడు సవతికొడుకై ఉండటం చూస్తే ఆమెచేసిన పని క్షంతవ్యమైందిగా కనపడదు. ఇక మిగిలిన ఎనమండుగురిలో వరూధిని అనన్యకాంత; దేవయాని, అంబ కన్యలు; ఊర్వశి, రంభ దేవవేశ్యలు; గంగ స్త్రీరూపధారిణి; ఉత్తరదిశ పరీక్షకురాలు; శూర్పణఖ వితంతువు. వీరి కోరికలు కొంతవఱకు క్షమింపదగినవిగాను, వీరి చరిత్రలు కొంతవఱకు దయనీయములుగాను ఉన్నవి. ఇందలి ఒక్కొక్క స్త్రీనిగూర్చి కొంత విపులంగా చర్చిస్తేగాని ఇది నిరూపించడం కష్టం. కాబట్టి ఒక్కొక్క స్త్రీనిగురించి ఒక్కొక్క ప్రత్యేకవ్యాసం వ్రాయవలసివుంటుంది.

---

# ఆడదాని మనస్సు

## ౧

అప్పుడు నేను మదరాసులో వుంటున్నాను. నేను బి.ఏ. పాసైన సంవత్సరం నా తండ్రి చనిపోవటంవల్ల నేను తిరిగి చదవటానికి వీలులేకపోయింది. స్నేహితుల సలహాపైన ఉద్యోగపు ప్రయత్నాలు మానుకొని మోటారు డ్రైవింగు నేర్చుకునేందుకు స్కూలులో ప్రవేశించాను. ఆరుమాసాల ట్రెయినింగు పూర్తి అయ్యాక నేను స్నేహితులతో కలిశి తిరిగి నౌఖరీకోసరం ప్రయత్నించాను. చివరకు ఒక కోటీశ్వరుడివద్ద ప్రవేశించాను, డ్రైవరుగా.

అతడు మదరాసులోని ధనికులందఱికంటె ధనికుడు. సుమారు నలభై సంవత్సరాల వయసుంటుంది. కొంచెం లావుగానూ, ఎఱ్ఱగానూ, పొట్టిగానూ ఉంటాడు.

అతడి నడకలోనూ, మాటలోనూ కూడా అతడికున్న అపారధనసముదాయంవల్ల కలిగిన గర్వం వ్యక్తమవుతూ వుంటుంది. ఇదంతా అతడి స్వార్జితమేనట. మహాకవికి తాను వ్రాశిన పరమోత్తమగ్రంథం చూచుకుంటే ఎంత గర్వం గలుగుతుందో, అంతకంటె ఎక్కువగర్వం అతడికి తను స్వంతంగా సంపాదించుకున్న ఆధనంచూశి.

అతడికి వూరుబయట నాలుగు వయిపులం నాలుగు ఉద్యానవనా లున్నాయి. వాటన్నింటిలోనూ తలొక ఉంపుడుగత్తెకూడాను. యీ సంగతులన్నీ నేను నాతోటి డ్రయివర్లవల్ల తెలుసుకున్నాను.

వారి కందరికీ తలకొక మోటారూ వుంది. ఒకరోజున అతడిని 'విలాసభవనం'లోకి తీసుకువెళ్లాను. నన్ను తిరిగి వెళ్ళిపొమ్మని అతడు పైకి వెళ్ళిపోయాడు. ఆవిలాసభవనం నిజంగా విలాసభవనమే. నేను చాలాసేపు ముగ్ధచకితనేత్రాలతో ఆ అందమైన తోటవంక చూస్తూ నిలబడ్డాను. వివిధములైన చెట్లతోనూ, మంచిమంచి పూలమొక్కలతోనూ, నేత్రపర్వంగా అలంకరింపబడ్డ ఆ ఉద్యాన

వనం అతిరమణీయంగా వుంది.

ఆ భవనంలోని సుందరిపేరు విలాసిని. అంత అందగత్తె మదరాసులో యికలేదు. ఎందరెందరో ఆమెకోసరం ప్రయత్నించారు గాని, నెలకు పదిహేనువందలిస్తూ, యీ కుబేరుడు వారినోట గడ్డగొట్టాడు. అప్పటినుంచీ ఆమె అతడి మందిరంలో విలాసశిథిలమైన తన జీవితాన్ని గడుపుతోంది.

ఆమెకు అనేక దాసదాసీ లున్నారు. రోల్సురాయిసు కారుంది. దాని మీదనే ఆమె పట్టణాన్నంతటనీ, 'తన్నే చూడమన్నట్లు' విహరిస్తుంది. విలాసినే అతడి జీవితసర్వస్వం. ఆమెవద్దనుంచి కభురురావటం తరువాయిగా, రెక్కలుకట్టుకుని, అక్కడ వాల్తాడు.

యీ సంగతులన్నీ నేనక్కడి డ్రైవరు వల్ల విన్నాను. ఆమె సౌందర్యప్రశంస విని, నేను నమ్మలేక పోయాను. యీమహాపట్టణంలో ఎందరు సుందరులులేరు? ఈమె ఆకాశంమీదినుంచి ఊడిపడిందా ఏమిటి? అనుకున్నాను.

అకస్మాత్తుగా ఒకరోజున యజమాని నన్నుపిలిచి 'చూడు. నీవువెళ్ళి విలాసభవనంలోవుండాలి. అక్కడ రాణిగారికారుకు డ్రైవరు అవసరమయ్యాడు. వెళ్లు' అన్నాడు.

నేను ఉలిక్కిపడి—'ఎక్కడికండయ్యా?' అన్నాను.

అతడు—విలాసభవనానికి. ఏం నువ్వెరగవా? నీవు అక్కడికి నన్ను చాలాసార్లు తీసుకువెళ్లావు కాదూ?

నేను—ఎరక్కేం? ఎప్పుడు వెళ్లాలి?

'మధ్యాహ్నంవెళ్లు అక్కడ నీకు గది ఉంది. నీ కింకేమైనా కావలిస్తే చెప్పు?' అన్నాడు,

'అక్కరలే ద'న్నాను కృతార్థభావంతో.

## ౨

సాయంత్రం నౌఖరొకడొచ్చి 'రాణీగారు షికారువెడ్తారు. కారు తీసుకురా.' అన్నాడు యిక్కడ అందరూ విలాసినిని రాణీఅంటారు. మాయజమానే ఆమెను రాణిగారని పిలుస్తాడు. నే నింతవరకూ ఆమె దర్శనం చెయ్యలేదు. కారుతీసి మహలుముందు నిలవబెట్టాను. కొన్ని నిముషాలు గతించాక, అప్సరస వంటి స్త్రీ బయటకు వచ్చింది. యౌవనమూ, రూపమూ ఆమె ముఖంలో తాండవించుతున్నాయి. నేను సంభ్రమాశ్చర్యాలతో శాల్యూటుపెట్టి కారుతలుపు తీశాను. ఆమె నెమ్మది నెమ్మదిగా ఏనుగగున్నలాగ కారులో ఎక్కింది. నేను యథాసాధ్యమైన నమ్రతతో—'ఎక్కడకు వెళ్లాల'ని అడిగాను.

ఆమె కలకంఠంతో - 'బీచికి నడుపు' అంది.

నేను కారు స్టార్టుచేశాను.

ఒకటిరెండు గంటలు తిరిగి యింటికి వచ్చేశాము. కారుదిగి నేను తలుపుతీసి నిలువబడ్డాను. ఆమె లాలిత్యంగా నావంక చూస్తూ లోపలకు వెళ్లిపోయింది.

అటుతరువాత ఆమె విశేషంగా నాపైన ఆదరణ చూపెట్టేది. ప్రతిరోజూ నన్ను పిలిచి మాట్లాడుతూ ఉండేది. నేను ధన్యుడనయ్యాననుకొనేవాడిని. అనేకవిధాల ఆలోచనలతో ఉన్మత్తుడనై వుండేవాడిని.

ఒకరోజున ఆమె 'మీయింట్లో ఎవరెవరున్నారు? నీకు చెల్లెళ్లెందరూ? పెళ్ళి అయిందా?' యిల్లాగే కుటుంబవిషయాలనేకం ప్రశ్నించింది. తండ్రి చచ్చిపోయాడనీ, యిద్దరు చెల్లెళ్లున్నారనీ, చెప్పాను. పెళ్లివిషయం అడిగినప్పుడు మాత్రం ఉద్దేశ్యపూర్వకంగా, యిద్దరు పిల్లల తల్లయిన పెళ్ళాము యింట్లోవున్నా, బ్రహ్మచారిననే చెప్పాను.

తరువాత ఆమె యింకేమీ అడుగలేదు. ఆమెవంక చూశాను. ఆమె కళ్ళల్లో విషాద చ్ఛాయ లగుపించాయి. ఆదృశ్యం నన్ను చాలా ఆకర్షించింది.

నేను నన్ను అందమైనవాడిననే అనుకుంటాను. నేను కాలేజిలో చదువుతున్నప్పుడు కూడా అందరూ నన్నందగా డనేవారు.

ఆమె నన్ను మాటిమాటికీ పిలిచి మాట్లాడుతూ వుండేది. నేనప్పుడు దేవదుర్లభమైన ఆనంద మనుభవించేవాడిని.

ఒకరోజు సాయంత్రం సినీమాకు వెళ్లాము. ఆమె నాచేతికి రూపాయిలుయిచ్చి రెండు రిజర్వుడు టిక్కెట్లు తెమ్మంది. యిద్దరమూ లోపలకువెళ్ళి చెరోబాక్సులోనూ కూర్చున్నాము. నేను చాలాసేపువరకూ ఆమె తన ప్రక్కన కూర్చోమని పిలుస్తుందేమో నను కున్నాను. కాని ఆమె పిలవలేదు.

అది సాంఘికఫిలుము. విషాదాంతము. ఫిలుము ఆఖరయ్యేసరికి ఆమె కళ్ళవెంట నీళ్ళు ప్రవహిస్తున్నాయి. ఆట పూర్తి అయినాక బైటకు వచ్చాము. తరువాత కొద్దిరోజులవరకూ చెప్పదగ్గ విశేషాలేమీ జరుగలేదు.

మూడోరోజు నా చెల్లెలికి జబ్బుగా ఉందని ఉత్తరము వచ్చింది. యింటికి వెళ్ళటానికిగాను సామానూ అన్నీ సర్దుకుని ఆమె వద్ద అనుజ్ఞ పుచ్చుకోవటం కోసరం వెళ్లాను.

ఆమె నన్ను చూడటంతోనే—'చెప్పు.ఏం కావాలో?' అని ప్రశ్నించింది. కాని యిప్పుడామె కొంచెం ఉదాసీనంగా కనుపించింది. ఆమె ప్రేమమయమైన, ఆ లావణ్యాపరిపూర్ణమైనముఖంపైన కారుణికదృశ్యం కనుపించింది.

నేను—నేను వెంటనే వెళ్ళిపోవాలి. నా చెల్లెలికి జబ్బుచేసిందిట.యిదుగో ఉత్తరము' అని చూపించాను.

'జబ్బు ఎక్కువగా ఉంది కాబోలు'అంది.

'అవునండి. అట్లాగే వ్రాశారు. సెలవిస్తే వెడతాను' అన్నాను.

ఆమె చేతితో ఆగమని సంజ్ఞచేస్తూ లోపలకి వెళ్ళి రెండు నూరురూపాయిల నోట్లు పట్టుకువచ్చి నాచేతికిచ్చింది.

నేను ఆశ్చర్యంతో 'జీతము నాయజమాని వద్ద తీసుకుంటాను. నాకు మీవద్ద తీసుకోమని ఆజ్ఞలేదు. క్షమించాలి' అన్నాను.

విలాసిని కోలకులు కన్నీళ్ళతో నిండాయి. అయినా ఎంత అందంగా వుందో!

'కుమార్! మీరంతా నన్ను 'వేశ్య' అనుకుంటారు. వేశ్యలకు హృదయం ఉండదని మీవుద్దేశ్యం. కాని చాలామంది వేశ్యలు వేశ్యలుగా పుట్టరు. చాలామంది యీ నీచ జీవనానికి ముందు, మరొకరకపు జీవనం గడిపి వుంటారు. వాళ్ళకుకూడా ఒక చరిత్ర వుంటుంది. వాటితోబాటు మధురతమస్నేహస్నిగ్ధప్రేమోజ్జ్వలములైన కోరికలూ, స్మృతీ వుంటాయి. యీ మాయాప్రపంచంలో అడుగుపెట్టక ముందు గడిపిన జీవనం వాళ్ళకూ జ్ఞాపకం వుంటుంది. ఒక్కసారిగా మరువలేరు. వారినీ, తమ విశుద్ధమయజీవనంలోని కోమల భావాలు ప్రేరేపిస్తూనే వుంటాయి. నేను చెప్పేది నీవు నమ్మకపోవచ్చు నాకూ ఒక సోదరుడున్నాడు. నీలాగే ఉండేవాడతడు. యీలాంటి ఆకారమే అంతాను. యిదేమాట. యిదేనడక. అతడు నన్నెంత ప్రేమించాడు!' యిట్లా అంటూవుంటే ఆమె కళ్ళవెంట నీళ్ళు పటపటా క్రింద పడుతు

న్నాయి. నేను శూన్యభావంతో ఆమెవంక చూస్తున్నాను. కాని హృదయం ముక్క—ముక్కలైపోయింది.

ఆమె అదేభావంతో అంది—'నేను దుష్టుల ప్రేరేపణవల్లా, యౌవనమదంచేతా, ఆప్రపంచాన్ని విడిచి ఐశ్వర్యపరిపూర్ణమైన యీ మహాపట్టణంలోకొచ్చి, యీ కళ్ళు మిరుమిట్లు గొలిపే అలసమందరజీవనం గడిపాను. కాని ఆమాధుర్యమయజీవనం మరుపుకొస్తుందా? ఎప్పుడైనా అన్నదమ్ములు జ్ఞప్తికొస్తే హృదయానికి ఆఘాతం కలిగేది. నిన్నుచూశి నాహృదయం చలించింది. నీవు సరిగా నాతమ్ముడిలా వున్నావు. నిన్ను చూశి అతడే వచ్చాడనుకున్నాను. నిన్ను చూడగానే బాల్యలీలలు జ్ఞప్తికొచ్చాయి. అందువల్ల ఎప్పుడూ నిన్ను చూస్తూనే ఉండాలనిపించేది. కారణం తెలియకపోయినా, నిన్ను చూస్తే, నాహృదయం శాంతిపొందేది. నిన్ను చూచినప్పటినుంచీ, నా మనస్సుకు ఎంత తృప్తి, ఎంత శాంతీ, కలిగిందో, నీమీద నాకు ఎంత ప్రేమకలిగిందో అది నాహృదయానికే తెలుసును.'

ఆనోట్లు రెండూ తీసి జేబులోపెట్టుకున్నాను. ఏఏభావనలు నాలో కలిగాయో నేను చెప్పలేనుగాని, నేను ఆమె పాదాలపైన సాష్టాంగ పడ్డాను. నామనస్సులోని మైలను పోగొట్టి వెలుగునిచ్చే దివ్యజ్యోతి ఆమెలో వెలుగుతోందని నేననుకున్నాను. ఆమె వెంటనే నన్ను లేవదీసి నుంచోబెట్టింది.

నేను నిశ్చేష్టుడనై నిలువబడ్డాను. దీపశిఖవలె నాహృదయం మండిపోతోంది. నాహృదయంలోని పాపం, నాఆత్మకాలుష్యం నన్ను తినేస్తోంది. నేనొక్కసారి ఆమెవంక చూశాను: ఆమె దివ్యజ్యోతిలాగ వెలిగిపోతున్నట్లు కనుపించింది. ఆమె మళ్ళీ చెప్పింది. 'నీవు వెళ్ళు. నీకు ఆలస్యం అవుతుంది. యింకా యజమానివద్దకు వెళ్లాలి. యీరూపాయిలు నువ్వు ఖర్చుచేసుకో. భగవంతుడి దయవల్ల నీ చెల్లెలు కులాసాగా వుండొచ్చు. వెళ్ళు.'

నేను వెళ్ళిపోయాను. తిరిగి అక్కడికెప్పుడూ పోలేదు. నాహృదయం చాలా బాధపడుతోంది. మనస్సులో ఒక తుపాను లేస్తోంది. తిరిగి అక్కడికి వెళ్ళటానికి ధైర్యం చాలటంలేదు. ఆస్మృతి నా హృదయాన్ని దహించేస్తోంది.

మనకళ్లు విషయవాసనవల్ల చుట్టూ పాపాన్నే పరికిస్తూ వుంటాయి. మనవంక ఏ బాలికైనా ఆకర్షణగా చూస్తేసరి, యిక మనలను ప్రేమభిక్ష కోరుతున్నట్లే తలుస్తాము. మన హృదయాల్లోని కాలుష్యమే, ఆ మాలిన్యమే మనకు నలువైపులా కనుపిస్తూవుంటుంది. ఈవేశ్యాబాలికలు వ్యభిచారమనే భయంకరమైన పాపంచేత తాము మునుగుతూ, మనలనుకూడా నరకానికి చేరువ చేస్తున్నారు. కాని వాళ్ళు మనమనుకునేటంత నీచులుగా వుండరు. వారు తమ స్త్రీత్వము విడువలేరు. వారుకూడా స్నేహమయి అయిన తల్లినో, ప్రేమతోచూశిన సోదరుడినో తలుచుకుని దుఃఖపడుతూనే వుంటారు. వారుకూడా ఏపురుషుడి పాదాలపైనో తమ ఆత్మను సమర్పించే వుంటారు. మనలోని పాపమే అందరిలోనూ వుంటుందని మనం అనుకుంటూ వుంటాము. మంచి వుంటుందని మనం భావించనేలేము.

మన యీదుర్బలత్వం మనలను పాడుచేస్తోంది. యీబాధలోనుంచి మనకు ఎప్పుడు విముక్తి కలుగుతుందో?

—భోగరాజు పేరాజు.



# మహిళా ప్రబోధము

౧

తెల తెలవారుచుండె నిదె తెల్వి
ని గాంచెను దిక్కు లెల్లెడన్
కల కల కూయుచున్నవదె కమ్మ
ని కంఠము లెత్తి కోయిలల్
మెలకువగాంచకుండ నిటు మేకొ
ని పండుట మేలుగా దహో
తెలుగువెలందులార! వడి తెల్వి
ని గాంచుడి నిద్రగూరకన్.

౨

అదె ప్రాక్పశ్చిమ విస్తృతాఖిల సతీ
యంతస్సులం దంతటన్
రొదవెన్ తీవ్రతరైకవాంఛ నిజజా
త్యుద్ధారణన్ జేయ నీ
యదనున్ వీడక యావదాంధ్రసతు
లాద్యశ్రేణిలో నిల్చి వే
కదలంగా వలె మేము మేమనుచు పీ
కన్ సంఘసంసేవకై.

౩

సాటి రాష్ట్రీయకాంతలు సరభసమున
స్త్రీల సమితులు స్థాపించి సేవజేయ
పూని రప్పుడె తెల్గుపూబోడులార!
వెడలి రారండు మీరును వెనుకబడక.

౪

ఎన్నడెఱుగని యాచార మిద్దియంచు
పూర్వాపరముల యోచన బూనుకొనక
దేశకాలపాత్రంబుల తీరు బట్టి
చేయవలె సేవ నిజజాతిశ్రేయమునకు.

౫

ఎన్న డెఱుంగలేదు సుమి యిట్టి హి
తైషిణీమండలుల్ భళా
యన్నులమిన్నలం దనుచు నక్కజ
మందుచు జూతురేల మీ
రెన్నిక బెట్టిచూడు డివు డేర్పడ
గాంచెడి వింత లన్నియున్
యున్నవె ? పూర్వకాలమున నూహాలు
సేయుడి మీ మనంబులన్.

౬

తాతల నాడున్న తాటాకు పత్రంబు
  లీనాడుగలవొకో యెంచిచూడ
నాయనమ్మలనాటి నాటుబండ్ల ప్రయాణ
  మీనాడు గలదొకో యెంచిచూడ
అవ్వలెల్లరి కప్పు డందమౌ కొప్పులు
  యీనాడు గలవొకో యెంచిచూడ
అమ్మమ్మ తొడిగిన యద్దాల రవికలు
  యీనాడు గలవొకో యెంచిచూడ

ఏల యిన్నిసూచన లిపు డింతులార !
మార్పు వలదని వాదించు మనుజులైన
వేషభాషల నిప్పటి విధము బట్టి
మారకుండిరో ? గాంచుడీ మనసుపెట్టి.

౭

మారెను వేషభాషలును మారెను
  వైదిక శిష్ట పద్ధతుల్
మారెను శాస్త్రధర్మములు మారెను
  లోకుల దృష్టి నైజముల్
మారెను వర్ణభేదములు మారెను
  కాంతల దైన్యవృత్తముల్
మారనివేవి యిప్డు నిజమ్మారయ
  ప్రాక్తనకర్మకాండలో.

౮

మార్పు సహజంబు సృష్టిధర్మంబునందు
నుండదేదియు నొకరీతి యుర్వియందు
కాలచక్రంబుతో నన్ని కదలుచుండు
నిలుపగారాదు యెరికి నిశ్చలముగ.

౯

మూలనున్నవారి ముంగిళ్ళకీడ్చెడి
  యోటింగుహక్కుల హోరులొకట
పరిణయ పద్ధతుల్ పరివర్తనముసేయు
  క్రొంగ్రొత్త చట్టాల గోల యొకట
దేశదాస్యముబాప దీక్షమై పచరించు
  రాజకీయంబుల రగడ లొకట
స్త్రీపురుషసమాన సిద్ధాంతసిద్ధికై
  తీవబోదులుసేయు తీర్పులొకట

దేశమంతట వ్యాపించి దినదినంబు
నాపరానట్టి యూహల రేపుచుండ
స్త్రీహితైషిణీసమితుల జేరి సతులు
స్వీయవృత్తంబు గనకుంట శ్రేయమగునె ?

౧౦

వివిధదేశములందు వెలసెడి వార్తల
  నేనాటి కానాడె యెఱుగవచ్చు
నిజదేశమున గల్గు నిఖిల విశేషముల్
  తేటతెల్లముగాగ దెలియవచ్చు
ప్రాచీనగాథల పరమార్థ మెల్లను
  నింపుగా మది గ్రహియింపవచ్చు
మాన్యులౌ పెద్దల మహనీయ బోధలు
  వీనుల విందుగా వినగ వచ్చు

పరగ నన్యోన్యపరిచయభాగ్యమునను
స్నేహ మభివృద్ధి జెందంగ చేడె లంద
ఒక్కతల్లిబిడ్డలవలె నుండవచ్చు
స్త్రీ సమాజంబు లిడుమేలు చెప్పదరమె ?

౧౧

కాన మహిళాసమాజముల్ గలుగజేయు
వివిధలాభార్థవితతుల విలువనెఱిగి
చేరుడీ యందు శుభముల జెందగలరు
పూజ్యమతులార ! తెలుగుపూబోడులార !

—కనుపర్తి వరలక్ష్మమ్మ.

# 'నేను అభాగ్యుణ్ణి'

## ౧

ఆనాడు ధవళయామిని. భూతలము దివ్యధావళధళ్య ప్రభాచ్ఛన్నజ్యోత్స్నావిలసితమై విరాజితమగుతున్నది. వసంతసమీరుని కమ్మ తెమ్మెరలు శరీరాన్ని ఆనందస్పందితము కావిస్తున్నవి. ప్రకృతి నీరవమై ప్రశాంతముగా నున్నది. అది మిక్కిలి రమణీయమైన చిత్తాకర్షకదృశ్యము. నేను సౌందర్యోపాసకుణ్ణి కాన, చక్కని అట్టి యవకాశాన్ని ఎట్లు వదలిపెట్టగలను ? ఏవో స్మృతికందని తలపులతో అట్లా షికారువెళ్ళి తిన్నగా హోటలకు వచ్చేసరికి గంట తొమ్మిది కొట్టింది. భోంచేసుకొని సినిమాకు పోదామని బయలుదేరాను నేను తీరా సినిమాహాలువద్దకు పోయేసరికి కారులో కొందరు స్త్రీలు వచ్చారు. వారితో కూడా డ్రయివరు తప్ప పురుషులు ఎవరులేరు. వారు గబగబ కారులోనుంచి దిగునప్పుడు వారిలో నొక కుసుమపేశలయగుయువతి కాలికి యేదో కుట్టింది. ఆమె అబ్బా అని క్రింద కూలబడ్డది. ఆమె కాళ్ళన చెప్పులు లేవు. అకుట్టిందేమిటో కాని తేలుకుట్టినంత బాధపడుతున్నది. సహజముగా ఉదకమండలములో తేళ్ళు ఉండవంటారు తేలు కానో కాదో అవటంతో వెతికారు. ఏమి కనుపించలేదు. ఏదైతేయేమి పాపము ఆమె ఆబాధకు సహించుకోలేక ఏడువసాగెను. కూడానున్న స్త్రీలు ఏమితోచక గాబరాపడుతుండిరి. అది చూచి నేను పరాయివాణ్ణని ఊరుకోలేక పోతిని. దగ్గరకుపోయి యేమైనగాని అని సాహసించి తాత్కాలికోపశమనచికిత్స కొంచెముచేసి, ఆ కారులోనే వారిని ఆసుపత్రికి తీసికొని పోయి ఇంజెక్షను చేయించాను. తోడనే బాధ ఉపశమించింది. అప్పుడు ఆమె నావైపు కృతజ్ఞతాసూచకదృక్కులతో చూచి యొకింత లజ్జతో తలవంచుకొన్నది. ఆలజ్జ ఆమె కమనీయతను మిక్కిలి పెంపొందజేసింది. ఆమె అపరంజి లేచెక్కులపై అరుణిమ నృత్యమాడింది. నేను నిర్నిమేష నయనాలతో ఆ అనుపమసౌందర్యరాశిని చూడసాగాను. ఆమె కిశోరావస్థ దాటి యౌవనవేదికపై అప్పుడప్పుడే ప్రథమ చరణం మోపుతున్నది. నేను ఆమె అసమానలావణ్యానికి ముగ్ధుణ్ణయిపోయాను. ఆమె పదపంకజములపై అజ్ఞాతరూపముతో నాహృదయకుసుమాంజలి సమర్పించాను. నేను కొంతతడవు మంత్రముగ్ధుణ్ణయి ఊరకేఉండి, అనంతరము, 'అమ్మా ! బాధపూర్తిగా తగ్గిపోయిందా ?' అన్నాను.

ఆమె సిగ్గుతో, 'తగ్గింనండి' అన్నది.

'అయితే నేను మీతోవచ్చి మిమ్మ మీ ఇంటివద్ద వదలిపెట్టి పోనా ?'

'మంచిది మీదయానురాగములకు సదా కృతజ్ఞలము.'

నేను వారిని తీసికొనిపోయిన బంగాళా నేనున్న మాడరన్ హిందూ హోటలకు దాపుననే ఉన్నది. కారునిల్పి హారన్ ఇచ్చిన తోడనే నలభైసంవత్సరాల మనిషి తలుపుతీసి యివతలకు వచ్చి ఆతురతాభావముతో ఇంత త్వరగా సినిమానుంచి వచ్చిన కారణమడిగాడు. ఆమె ఆయనకు కుమార్తెగాను, తక్కిన వారు సన్నిహితబంధుస్త్రీలుగాను తోచింది. ఆమె జరిగిన యుదంతాన్ని సవిస్తరంగా చెప్పింది. ఆయన అది విని, మిగుల ప్రసన్నముతో నన్ను కౌగిలించుకొని, మరల ప్రొద్దున్నే వచ్చునట్లు నాచేత వాగ్దానము తీసుకొని, నన్ను వీడ్కొల్పెను.

## ౨

నేను హోటలకువచ్చి ప్రక్కపై పడుకొన్నాను. కాని నిద్రపట్టలేదు. మాటిమాటికి ఆదృశ్యమే నాకళ్ళ ఎదుటకు వస్తున్నది. పలువిధకల్పనాప్రపంచములో జాగరణముచేశాను. ఇంతలో తెల్లవారింది. సూర్యోదయ కాంతులు విభావరిని పారద్రోలినవి. కాని నేను నా యోజనాభావపరంపరలను దూరముకొనింపలేక పోయాను. ఉండుండి నామనస్సు ఆ సౌందర్యమూర్తి

దర్శనానికి వ్యాకులపడుతున్నది. ఒక్కొక్కక్షణము నాకొక్కొక్కయుగమువలె ప్రతీత మగుతున్నది. తొమ్మిదిగంటలకు ఒకసారి బంగాళాకు పోయాను. అంతకుమునుపే ఆమెతండ్రి ఏదో పనిమీద బయటకు పోయాడట. ఆమె తల్లికూడా స్నానముచేస్తున్నది. ఆమె అత్యంత గౌరవముతో అభ్యుత్థానముజేసి నాకు స్వాగతమిచ్చి కూర్చోడానికి ఒక కుర్చీనిచూపి వినమ్రభావముతో 'ఇదిగో, ఇప్పుడే వస్తా.' నంటూ లోనికి పోయి కాఫీ, ఫలహారము యెత్తించుకొని వచ్చింది. 'అమ్మ యిప్పుడేవస్తుంది. మీరు కాఫీతీసుకోండి.' అన్నది.

నేను సంకోచముతో ఏమిచెప్పడానికి తోచక ఊరకున్నాను. నాసంశయభావాన్ని ఆమె గ్రహించి, మాటల నన్ను గట్టిగా బలవంతపెట్టింది. అపుడు ఆమె బలవంతాన్ని తిరస్కరింపలేక పోయాను నేను. మేము కాఫీత్రాగుతున్నపుడు, మా యొండొరుల చూపులు ఒకటిగా సంధిల్లి లీనమవుతున్నవి. కాని, సంకోచవశముచే ఆమె ఏమి పలుకలేదు. నేను ఏమి పలుకలేదు.

తుదకు నేను మౌనముద్రను వీడి, 'మీపేరు తెలుసుకోడానికి ఆసక్తుణ్ణి.' అన్నాను.

ఆమె చిరునవ్వుతో, 'నాపేరు ఉషా. మీపేరు ?' అన్నది.

'నన్ను రాజశేఖరుడంటారు.'

'ఏమి చదువుతున్నారు.'

'బి.ఏ. ఆనర్సు.'

'ఏకాలేజీలో.'

'ఆంధ్రయూనివర్సిటీలో. మీరు ?'

'నేను క్వీన్ మేరి కళాశాలలో చదువుతున్నాను. ఈసంవత్సరమే ఎఫ్‌యేకి పోయాను. మీపరీక్షా ఫలితము తెలిసిందా ?'

'ఆ! తెలిసింది. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడనైనానని నాలుగైదురోజుల క్రిందనే తెలిసింది.'

ఆనాడు యింతే మాసంభాషణ. నేను తిరిగి హాస్టలుకు వచ్చాను.

మాస్నేహము క్రమముగా ప్రబలింది. ఉషాదేవి తండ్రితోకూడా నాకు దృఢమైత్రి యేర్పడింది. ఆయన పేరు కేశవరావు. మదరాసు హైకోర్టు వకీలు. మంచి సంస్కరణాభిలాషి. కొమార్తెను చక్కగా చదివిస్తున్నాడు. కేవలము ఇంగ్లీషేకాకుండా కవితిలక కంచనపల్లి కనకమ్మగారిచేత సంస్కృతము, తెలుగు కూడా చెప్పిస్తున్నాడు. ఆయనకు ప్రస్తుత హైందవ సంఘములోని మూఢసాంఘికాచారాలయందు హేవగింపేగాకుండా, అవి జాతీయాభివృద్ధికి, మానవకల్యాణానికి ఎంతో హానికరమని తలస్తుండేవాడు. అట్టి భావముకలవాడు కావున, ఉషకు స్వేచ్ఛాజీవితానికి అవకాశము యిచ్చాడు.

ఉదకమండలములో ఆయనకు స్వంతభవనము కలదు. వేసవిలో ప్రతివర్షము విశ్రాంతికి ఊటీ వస్తుంటారు. ఈసంవత్సరము మాకాలేజికి సెలవులు యిచ్చినతోడనే ఎండలకు నిభాయించలేక నేను కూడా ఊటీకి పోయాను. ఇదిగాక ఆప్రదేశము చూడాలని నాకు అతికుతూహలముగాకూడా ఉన్నది.

## 3

కూనూరులో గవర్నరుచేత ప్రారంభోత్సవము కావింపబడనున్న పుష్పప్రదర్శనానికి, ఉషాకూడా తాను స్వయముగా కృషిజేసి, తన దోహదప్రభావమున వన్నెవన్నె రంగులుగా పుష్పింపజేసిన, పూలతొట్లను పంపి ఉన్నది. ప్రథమ బహుమానము తనదేనని ఊరిపోతున్నది. అందువలన అక్కడకు వెళ్ళడానికి ఆనాడు సూర్యోదయానికి పూర్వమే నేను, ఉషా అట్లా విహారానికి పోయాము. పక్షులు కొండలపై నికుంజములో సూర్యుని ఉదయింపబోవు బాలభాస్కరునికి విజయోత్సాహగీతాలను మధురకంఠాలెత్తి పాడుతున్నవి. లతలు ఆనందముతో ఊగుతున్నవి. ప్రాతఃకాలశీతలపవనుడు లలితపల్లవములను ఆలింగనమొనర్చుకుంటూ వస్తున్నాడు. మేము అనైసర్గికమైన ప్రకృతి శోభను తిలకిస్తూ త్వరత్వరగా ఇంటికి వచ్చి కూనూరు పోవడానికి సిద్ధమయ్యాము. మాతో ఉషాతండ్రి కేశవరావుకూడా వచ్చాడు. ఆ ప్రదర్శనము చూడడానికి ఉద్యోగ ఉద్యోగేతరులగు గొప్ప గొప్పవాళ్ళు పెక్కండ్రు వచ్చారు. ఆప్రదర్శనానికి తీరుతీరు పుష్పములను పంపి పాలుగొన్నది పురుషుల

కంటే స్త్రీ లేను. అచట నానావిధచిత్రవిచిత్ర రంగుల పుష్పచయము ప్రదర్శింపబడెను. మేము వాటి తౌరళ్య సౌకుమార్యాలకు హర్షోన్మత్తులమై భగవంతుని సృష్టి నైపుణ్యానికి అక్కజపడ్డాము. ఆనాడు ప్రదర్శనానికి వచ్చిన పుష్పములయొక్క అభిన్నభిన్నరంగుల వైచిత్ర్యాన్ని గూర్చియు, భగవంతున కల్పనాచాతుర్యాన్ని గూర్చియు మాహృదయాల్లో సులలిత భావాలు యెన్నో రేకెత్తి ఒక క్రొత్తందనము చవిచూపించెను. అప్పుడు మేము ఏనందనవనములోనో ఉన్నట్లు తలపించెను. కాని ఆపుష్పముల చక్కందనమునకు తగిన పరిమళము లేకపోవడము విచారనీయము. మేము తిరిగి సాయంత్రము నాలుగుగంటలకు ఉదకమండలము వచ్చాము.

అనంతరము కాఫీ త్రాగి యధావిధిగా ఉషాదేవి, నేను వారి సౌధానికానుకొనియున్న నిర్ఝరితటమునకు పోయి కూర్చున్నాము.

అనుక్షణము ఏవిధముగా నామనోవాంఛను ఆమెకు తెలుపనా అన్న ఆలోచనలో మునకలు వేస్తుండేవాణ్ణి. ఇప్పుడుకూడా నేను అట్టి ఆలోచనలోనే మగ్నుణ్ణయి ఉంటిని ఉష నాభుజముపై చేయివేసి, 'ఏమో ఆలోచిస్తున్నారే?' అన్నది.

నేను (ఉలికిపడి)- 'ఏమిలేదు.' అన్నాను.

'అబద్ధము. ఏదో ఆలోచిస్తూనే ఉన్నారు. చెప్పకూడనిదా? అయితే పోనిండు.'

'లేదు, ఉషా! నీతో చెప్పకూడనిదా? మన మెంత సుఖవంతులము అని యోచిస్తున్నాను. కాని మన ఈ సుఖసౌభాగ్యము చిరస్థాయి కాగలదా? నీ ఈ యమూల్య స్నేహము మనశాశ్వతసాహచర్యజీవితానికి నిబద్ధము కావింపబడుతుందా యని సంశయిస్తున్నాను.'

'సందేహానికి కాస్పదమెందుకు కలిగింది?' అని ఆమె చెక్కిట చెయిబెట్టుకొని అనురాగమునిండిన విచలిత జలతరంగములవంటి చూపులతో ఊరకే నాచాయ కాసేపు తేరపార చూచింది.

అప్పుడు ఆమె ఆచూపులలో నీకు అర్ధాంగినై నిన్ను సుఖమున తేల్తును అను విమలభావాన్ని సూచిస్తున్నట్లు నాకు స్ఫురించింది. ఆచూపులు నన్ను ఉన్మత్తునిచేయ, ప్రణయోత్కంఠుణ్ణయి ఆమెను గాఢముగా కౌగిలించుకొని......మైమరచా నొక క్షణకాలం. ఆమె కూడా పరవశంగా పులకరిల్లి నాభుజముపై కొరిగిపోయింది. ......అంతట అవశంగా నాబాహువులు విడిపోయినవి. అప్పుడు మాయిద్దరిమధ్య సిగ్గుదొంతరలు నిలువ ఆమె దూరముగా జరిగి కూర్చుని తలవంచుకొన్నది.

నాకు యెక్కువకాలము ఆమె పొలకడలివంటి ప్రేమ నుపభోగించే ప్రాప్యము కలుగలేదు. ఆ నాటి గుంటూరునుంచి మాతల్లికి చాలా జబ్బుగానున్నది రమ్మని తంతివచ్చింది. నాకు ఆమెను చూడాలని విచారము కలిగింది. ఉషాకూడా చాలా దుఃఖపడ్డది. ఆకస్మికముగా తటస్థించిన నా ప్రయాణానికి కుందుచున్న హృదయాన్ని బిగబట్టుకొని నన్ను పోయిరమ్మని అనతిచ్చింది. నేను మరునాడు గుంటూరికి పోడానికి బయలుదేరాను.

## ౪

నేను యధాసమయానికి ఇల్లుచేరాను. మాతల్లి అంతిమసమయము దాటుతున్నది. ఆమెను అప్పుడు దించి క్రిందపెట్టబోతున్నారు. ఇంట్లోవారందరు ఆమె చిరవియోగాశంకచే శోకాభిభూతులై ఉన్నారు. నన్ను చూడగానే అందరు ఒక్కపెట్టున గొల్లుమని ఏడ్చారు. నా నేత్రాలలోకూడా అవిరళ అశ్రుధార ప్రవహించింది. నేను మా అమ్మదగ్గరకుపోయి ఆమె వక్షస్సుపై శిరము వాల్చి కన్నీటిబిందువులతో మాతృదేవి నభిషేకించాను. తల్లిచావు ఎవరికి దుఃఖదాయినికాదు? అప్పుడు ఆమె నాగొంతుశబ్దమువిని అత్యంతకష్టముతో కళ్లు యెత్తి ప్రేమవీక్షణాలతో నన్ను చూస్తూ, తనచేతులెత్తి నన్ను తన వక్షాన కదుముకోపోయింది కాని, చేతులు పైకి లేవలేదు. అప్పుడు అస్పష్టస్వరముతో...

'నాయనా! వచ్చావా? మంచిది. ఇక నేను సంతోషముతో స్వర్గధామము చేరుతాను. కాని నీవు నాకోరికను పూర్తిచేయకున్న, నేను ఆకోరికను మనస్సులో పెట్టుకొనే పోవలసి ఉంటుంది.'

ఆమె కోరేకోరిక నేను ఎరుగుదునుగాన, గుండెల్లో రాయిబడ్డట్లు ఊరకున్నాను. నామాటాన్ని చూచి ఆమెకు కొంచెము ఆయాసము కలుగుతున్నట్లు కనిపించింది. ఆమె నేత్రములనుండి జొటజొట అశ్రువులు కారిపోతుండ మరల, 'నాయనా! ఏమట్లున్నావు? పలుకవేమి? అవును. నేనెరుగుదును నీయాభిప్రాయాన్ని. సరే. నీయిష్టము. ఇప్పుడు నేను వెళ్ళిపోతున్నాను. ఇక తిరిగి నిన్ను బలవంత పెట్టుటకు రాబోను. ఈ కళ్ళతో నీసుఖాన్ని చూచేవంతు లేకున్నను, తుదకు సంతోషముగా పొయ్యే అదృష్టము కూడా లేకపోతున్నది' అంటూ కళ్ళు మూసుకొన్నది.

అప్పుడు నేను స్థిరత్వాన్ని గోలుపోయాను. నా మర్మాంతికా వేదనయొక్క బిగువు సడలిపోయింది. మాతృభక్తిచ్యుతుడను కాలేక ప్రియజనని పాదాలు పట్టుకొని, విషాదముతో, 'అమ్మా! అమ్మా! నన్ను క్షమించుము నీయాజ్ఞాపాలనకు సంసిద్ధుణ్ణి. ఒక్కసారి పలుకుము.' అన్నాను.

నాకుముందె ఆమె తమ్ముడు రంగారావుగారు నెల్లూరునుండి వచ్చియున్నాడు. ఆయనతో ఆయన కుమార్తె మాలతికూడా వచ్చిఉన్నది. మా అమ్మకళ్ళు యెత్తి నాతట్టుచూచి, 'రాజా! నాయనా? ఏది నీ చేయి' అంటూ, దూరముగా నిల్చుకొని ఉన్న మాలతిని పిలిచి, 'బిడ్డా! నీవుకూడా యిటురమ్మ'ని, నా చేతిలో ఆమెచేతినుంచి, 'మీరు సుఖాన్ని బొందుదురుగాక! నాకోరిక పూర్తిఅయినది. ఇక నేను పరమశాంతముతో మరణింతును.' అని అంటూఉండగానే ఆమెకళ్ళు మూతలుబడ్డవి. పిమ్మట కొంతసేపటికి ప్రాణాలు వదలింది.

**౨**

అనంతరము కొన్నాళ్ళకు గోదావరిపుష్కరాలు వచ్చినవి. ఆ సందర్భమున జరుగనున్న స్వదేశీవస్తుప్రదర్శనప్రారంభోత్సవము కావించడానికి, సేవాదళము ఏర్పాట్లకు నన్ను రమ్మని రాజమహేంద్రవరమునుండి సోదరసమితివారు వ్రాశారు. నేను రాజమండ్రి బయలుదేరునపుడు నాతో మాలతికూడా వస్తానన్నది. ఆమెను తీసుకొనిపోయాను. ఆంధ్రావని నుండి లక్షలకొలది ప్రజలు వచ్చారు. ఎక్కడచూచినా జనమే. ఒకనాడు ప్రాతఃకాలమున సోదరసమితివారు, మేము సేవాదళముతోకూడా గోదావరి తీరానికి పోయి, సేవాదళాన్ని ఆయా పనులకు నియమించి మేము తిరిగి వచ్చేటపుడు, మాకు అకాత్తుగా ఒకవిరాగిణి ప్రత్యక్షమయింది. ఎట్టి దివ్యరూపము!—ఎట్టి అప్రతిమానతేజస్సు ఆమె ముఖమండలముపై వలుకుతున్నది!! ఆమెను చూడగానే ఎక్కడోచూచిన పరిచితరూపమువలె తోచి, నిస్తబ్ధుణ్ణయి విభ్రాంతితో నిల్చుకొన్నాను. నాతోనున్న వారందరుకూడా నిలబడ్డారు. అప్పుడు ఒకసారి ఉషాదేవి దివ్యమంగళవిగ్రహము స్మరణకువచ్చి, నా శరీరమంతా ముచ్చెమటలుపోసి వణకిపోయింది. పృథ్వి తిరుగుతున్నట్లు తోచింది. ఆతరుణమున అవిరాగిణిస్థితికూడా విచిత్రముగానే కనుపించింది. నన్ను చూడగానే ఉన్మాదినివలె అరచి 'మీదర్శనం లభించింది. ధన్యురాలను నాతుది వాంఛ తీరినది నా తపస్సు పరిపూర్ణసిద్ధి పొందింది.' అంటూ ఆమె నాపాదములపై వ్రాలి నమస్కరించి కళ్ళ కద్దుకొన్నది. నేను వివశుణ్ణయిపోయాను. 'ఉషా, కుశలమా! నన్ను క్షమించు. నేను మహాపరాధిని,' అని వేడుకోబోయాను. కాని అంకిళ్ళు ఒత్తుకపోయినట్లయి నోటమాట రాలేదు. పెదవులు మాత్రము గడగడలాడుతున్నవి ఇంతలో ఆమెలేచి నిలబడి నావంక, మాలతి వంక చూచి, 'భగవంతుడు మీకు సుఖమును ప్రసాదించునుగాక!' అని ఆశీర్వదించింది.

అనంతరము ఆమె అట నిలవకుండా ద్రుతగమనముతో ఆజనకోలాహలములో నొకవైపు దూరిపోయింది. నన్ను నేను సమాళించుకొని, ఆమెను వెంబడించాను. కాని, ఆక్షణికాలస్యానికే ఆమె ఆగుంపులో నెక్కడనక్కిందో వెయ్యికళ్ళుపెట్టుకొని వెతికినా కనుపించలేదు.

'నేను అభాగ్యుణ్ణి'

—పొనకా కనకమ్మ.

# కారపు శనగలు

[శ్రావణమాసం శనగలమాసం—ఈ శనగలు చదివేవికాని తినేవికావు—ఆవిడికి స్వర్గానికి వెళ్లినా విడాకులు తప్పవు—తెనుగుదేశపు దోమలికి తెనుగుదేశపు నాయకుల గుణాలే—జాతిసమితి లెక్కలపుస్తకాలు తయారుచేస్తోంది—భూకంపాలవల్ల పెళ్లిళ్లు వచ్చుతాయి.]

శ్రావణమాసం : శనగలు. ఆద్యక్షరాలు ఒకటి అవడమే కాకుండా శ్రావణమాసానికి శనగలికి ఏదో సన్నిహితసంబంధం వుండితీరాలి శ్రావణమాసంలో సాతాలించిన కారపుశనగలు కొద్దోగొప్పో సంసారాలులేని సన్యాసులికికూడాల భిస్తాయి అంటోంటే ఇక కేవలం సంసారులమాట చెప్పనక్కర్లేదు కద! శ్రావణమంగళవారాల నోముపట్టి కారపుశనగలు ధారాళంగా సప్లయిచేసే అక్కో, చెల్లెలో, వదినో, మరదలో ప్రతీ సంసారికి లేకపోయినా వాయినాలకెళ్ళి శనగలమూట తెచ్చి వాటిని సాతాళించిపెట్టే భార్యో, తల్లో, మేనత్తో ప్రతీ సంసారికి ఉంటారని ఒప్పుకు తీరాలి. ఏతావతా చెప్పవచ్చేది ఏమిటంటే ఈ ప్రపంచంలో వాన్లో తడవనివాడు లేనట్లే ఆంధ్రసంఘంలో శ్రావణమాసంలో శనగలు తినకుండా ఉండేవాడు లేడని. కాబట్టి వైశాఖమాసం విసనకర్రలమాసం అయినట్లే శ్రావణమాసం శనగలమాసం అయింది.

... ... ...

'శ్రావణమాసం : శనగలు' ఈవిధమైన ఆలోచనలతో ఉన్నప్పుడే ఏదేనా వ్యాసంపంపించమనే ఆంధ్రభూమిసంపాదకుని లేఖవచ్చింది. ఎన్ని శనగలుతిన్నా - శనగలు బలకరములంటారు-ఈమధ్య పెద్దవ్యాసాలు వ్రాసే ఓపిక నాకు కలగడంలేదు. సంపాదకులుకూడా వ్యాసాలు సాధ్యమైనంత చిన్నవిగానే ఉండాలంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఏదో 'కారపుశనగలు' అనే పేరుతో చిన్నచిన్న టుంబ్రీలు ఒక్కచోట చేరుస్తూ అదే ఓచిన్నవ్యాసంకింద తయారుచేస్తూ పత్రిక్కి పంపిస్తూ ఉంటే బాగుంటుందని తోచింది. కారపుశనగలు అనడంతోటే అపక్వాహారసిద్ధాంతులికికూడా నోరు ఊరుతుంది. కారపుశనగలరుచి వర్ణించి చెప్పడం కష్టం. కమ్మదనానికి కమ్మదనం, కారానికి కారం, ఉప్పనికి ఉప్పన ఇంకా ఎన్నోరుచులు అందులో సమ్మేళనం అయి నాలిక్కి చాచా నాటకాన్ని చూపిస్తాయి. అట్లాగే కారపు శనగలు అనే శీర్షికతో ఉండే నా ఈవ్యాసంలో శనగలలో ఉండేరుచి, కారంలో ఉండే ఘాటు, ఉప్పులోఉండే ఉప్పన, మినపబద్దలలో ఉండే కమ్మతనం, జీలకర్రపాయలలో ఉండే గుబాళింపు, కరివేపాకులోఉండే సువాసన మిళితం అయి ఉండడానికి ప్రయత్నిస్తా. ఈటుంబ్రీలు మీకు ఇష్టంలేకపోయినా కారపుశనగలమీద మీకుండే మమకారం చేతనన్నా - తండ్రిపేరు పెట్టాముగదా అని అల్లరికొడుకుల్ని పల్లెత్తుమాటఅనని తండ్రుల్లా - చదువుతూ ఉండవలసిందని కోరుతాను. తినవలసిన కారపుశనగలు ఇల్లా చదవ్వలసిన కారపుశనగలు అయిపోయినందుకు విచారించకండి. తినడానికీ, చదవడానికి ఉపయోగించేది నాలికేగా.

... ... ...

విడాకులచట్టం మనదేశానికూడా ఒకటి అవసరమని మనస్త్రీలు కొందరు తమ కోకిలకంఠాల్తో చాటుతూఉన్నారు. పాశ్చాత్యదేశాలలో కుక్కలికి లైసెన్సు పొందడం ఎంతపరిపాటో దంపతులికి విడాకులు పొందడంకూడా అంత పరిపాటే అయిందని పత్రికలలో చదువుతున్నాం. తూర్పుదేశాలతీరుకూడా యిట్లానేఉంది. జపానుసంగతి చూడండి. ఆదేశంలో నిమిషానికి ఒక్కొక్కపెళ్ళి జరుగుతూనే ఉంటుంది. ఇల్లా జరిగే ప్రతి పది పెళ్ళిళ్ళకి ఒక్కొక్కటిచొప్పున విచ్ఛేదమవుతుంది. డైవోర్సు కోర్టులవు ఆదేశంలో దినానికి దామాషాని 140 కేసులు వస్తాయి. ఒక్కొక్కగంటకే అయిదుకు మించిన విడాకుకేసు అన్నమాట. ఇందులో

నూటికి 86 కేసులు భార్యలచేతా, 11 కేసులు భర్తల చేతా, 3 కేసులు ఉభయుల సమ్మతిని కోనిరాబడు తున్నాయి. ఈవిషయాలు తెలుసుకున్న మీదటకూడా మనదేశంలో ఇంకా విడాకులచట్టం కావాలనే ఆడది ఉంటే ఆమెతో ఆమె ఇప్పటిభర్తేకాదు మరి ఎవరున్నా నిలకడగా కాపరం చెయ్యలేరు. ఆవిడికి స్వర్గానికి వెళ్ళినా విడాకులు తప్పవు.

... ... ...

'హస్తిమశకాంతరం' అనే సామెత అందరికీ తెలిసిందే. ఏనుక్కంటే దోమ తక్కువనీ, దానికి దీనికి పోలిక ఏమిటనీ అనేభావాన్ని ఆసామెత సూచిస్తుంది. మనరక్తం తాగి మనకీమధ్య ఎక్కువవుతూ ఉన్న గౌరవ భావాన్నికూడా తమ శరీరాల్లోకి ఇంజెక్టు చేసుకొంటూ ఉన్న దోమలుమాత్రం ఇందుకు ఒప్పుకోక ఏనుగులకంటె తామే ఎక్కువంటాయి. నాల్గుపాదాలు, తొండము, ఘీంకారము ఏనుగులతో పాటు మాకూ ఉన్నాయి; మరి ఏనుగిలికిలేని రెక్కలు రెండుమాకు ఎక్కువ; కాబట్టి సామజాలు మాకు సామ్యమా అని దోమలు చెపుతాయని ఒకచాటుధారాపద్యం ఉంది. ఒకానొకశాస్త్రవేత్త దోమల ఈ రెక్కలశక్తినిగూర్చి తీవ్రంగా పరిశోధించి అవి ఎక్కడా వాలకుండానే పదిగంటల్లు గాలిలో ఎగురుతూ పోగలవని నిర్ధారణచేశాడు. ప్రపంచంలో ఇతరదేశాల దోమల విషయంలో ఈశక్తి ఎల్లాఉందో నేను చెప్పలేను కాని మన ఆంధ్రదేశపు దోమలికి మాత్రం ఈ శక్తిలేదని, ఉన్నా ఉపయోగించటం లేదని చెప్పగలను. ఏమంటారా నా అనుభవంలో ఉన్న పాలకొల్లు దోమలు, రాజమండ్రి దోమలు, తెనాలిదోమలు ఈ శాస్త్రవేత్త దోమజాతికున్నదనే ఆ శక్తిని కొంచెమేనా కలిగిఉన్నట్లుగాని, కలిగిఉన్నా వాడుకలో పెడుతూన్నట్లుకానికనిపించదు. ఆయాఊళ్ళ దోమలు కదిలి ఎక్కడికీ పోవటంలేదు. మన నాయకుల దోషాలే మనదోమలికికూడా పట్టినాయేమో! చూడండి: మనలో మేధావిఅయిన ఒక నాయకుణ్ణి దూరంలో ఉన్న ఢిల్లీసభకుపోయి ఆంధ్రుడికి కీర్తితేవయ్యా అంటేపోక దగ్గరలోఉన్న మదరాసుసభకు ఎగప్రాకాడు; మరోనాయకుడు ఎంత ప్రతిమాలినా మారుమూల ఉన్నపద్రగపట్టణాన్ని వదలి బయటకురాడు. తాను చెడ్డకోతి వనంఎల్లా చెరిచిందనే సామ్యంగా మననాయకులు తమశక్తిని వినియోగించక పోవడానికి తోడు మన దోమలుకూడా వాటికున్న శక్తిని ఉపయోగించకుండా చేస్తున్నారేమోనని నాకు అనుమానంగా ఉంది.

... ... ...

1934 లో ప్రపంచంలోని వివిధదేశాలు యుద్ధపరికరాల నిమిత్తం 980,000 000 పౌనులు వెచ్చించాయనీ, గతసంవత్సరం మొత్తంకంటె ఇది 100,000,000 పౌనులుజాస్తి అని జాతిసమితివారు ప్రచురించారు. వివిధదేశాలమధ్య యుద్ధాన్ని ఆరికట్టే సత్తా లేక పోయినా వివిధదేశాలు యుద్ధపరికరాలకు చేసే వ్యయాన్ని అయినా అంచనాకట్టి సమకూర్చిన జాతిసమితిని అభినందించవలసిందే. పక్క నుంచి జపాను తాపు, పైనుంచి జర్మనీతాపు తిని డోక్కుపోయిన జాతిసమితికి కిందనుంచి ఇటలీ తాపుకూడ సంప్రాప్తమయ్యేటట్లుంది. ఎన్నితాపులు తిన్నా జాతిసమితి పదికాలాల పాటు బతికి ఇల్లాంటి లెక్కలపుస్తకాలన్నా తయారుచేస్తూ ఉండనియ్యమని సమితివిషయంలో తాను చేసే ఖర్చుకు తనకు బాధ్యత లేకుండా ఉన్న హిందూదేశం వంటి దేశాలు భగవంతుణ్ణి ప్రార్థింపవలసి వుంటుంది.

... ... ...

భూకంపాల్నిగురించి వ్రాయబడ్డ ఒకవ్యాసంలో ఇల్లాఉంది: 'భూకంపాలు పెళ్ళిళ్ల సంఖ్యను పెంచుతాయి. 1906 లో శాన్‌ఫ్రాంసిస్కోలో సంఘటిల్లిన భూకంపంతరవాత అచట చాలాపెళ్ళిళ్లు జరిగాయి. అనాథలై పోయిన స్త్రీలెందరో తిరిగి వెంటనే వివాహాలు చేసుకున్నారు.' మన బీహారుభూకంపం, క్వెట్టాభూకంపం విషయంలో ఈ సిద్ధాంతం ఎంతవరకు వర్తిస్తుందో తెలుసుకోడానికి ఇంకా రెండుమూడేండ్లు పోతేగాని అవకాశం ఉండదు. అయినా అధికారులు ఈ లోపుగా ఈ విషయాన్ని గురించి కూడా లెక్కలు కట్టుతూ ఉంటారని నమ్ముతాను.

—వి. విశ్వనాథము, బి. ఏ.

# విడ్డూరములు

**• ఆవూళ్ళో మొగుళ్లు అందరూ గ్రుడ్డివాళ్లు: పెళ్లాళు అంతా అందకత్తెలు :—**

యుగోస్లావియాకు బెల్‌గ్రేడ్ నుంచి రెండుగంటల రైలు ప్రయాణంలో వెట్రినిక్ అని ఒక ఊరుఉంది. ఆ వూళ్ళో ప్రతిభర్తా గ్రుడ్డివాడే. మరి వారిభార్యలో? యుగోస్లావియా దేశపు అందకత్తెలవర్గానికి చెందినవారు. ఆ దంపతులకు పోట్లాటల్లేవు. గతయుద్ధంలో గ్రుడ్డివారిగా చేయబడ్డ మగవాళ్లకోసం ఆగ్రామం నెలకొల్ప బడింది. ఒక్కొక్కడికి ఒక్కొక్క చిన్నఇల్లు, కొంత పొలం, కావలసిన పనిముట్లు ప్రభుత్వంవారే యిస్తారు. యుద్ధంలో కళ్ళు పోగొట్టుకొన్న ఈ వీరుల్ని వరించడానికి స్త్రీలు కావాలని వార్తాపత్రికల్లో ప్రచురించినారు. అవసరమైనవి ముప్ఫయి దరఖాస్తులే అయినా చాలామంది స్త్రీలు దరఖాస్తు పెట్టడం, అల్లా దరఖాస్తు పెట్టినస్త్రీలంతా అందకత్తెలయి ఉండడం అధికారులకు ఆశ్చర్యం కలిగించింది. ఈ వివాహాల్లో ఒకరిని ఒకరు ఎన్నుకోవడమనేదిలేదు. అధికారులే ఒకస్త్రీకి, ఒకపురుషునకు పెళ్ళిచేశారు. అయినప్పటికే అన్ని పెళ్లిళ్ళు సుఖదాయకములే అయిఉన్నాయి. ఏడేళ్ళక్రింత ఆగ్రామంజనాభా అరవైమాత్రమే. ఇప్పుడు అక్కడ ఎనిమిది వందలమంది ఉన్నారు. ఆ దంపతులికి పుట్టినపిల్లల్లో ఒక్కళ్లుకూడా గుడ్డివాళ్లులేరు.

**• పెంపుడుకోతులు హంతకుణ్ణి పట్టుకున్నాయి :—**

ఇది బెంగాల్‌లో ఈ నడుమ నిజంగా జరిగినకథ. తనదగ్గరఉన్న రెండుకోతులచేతా ఆటలాడించి పొట్ట పోసుకునే ముష్టివాడు. ఒకసంతలో ఆడించి ఏదో నాలుగుపైసలు గడించి ఒకనాడు ఇంటికి వస్తున్నాడు. మధ్య దారిలో ఒక చిట్టడవిలో అతన్ని దొంగలు అటకాయించి హత్యచేశారు. అతని పెంపుడుకోతులు చెట్టెక్కి ఈ ఘోరదృశ్యాన్ని చూశాయి. హత్యచేసి అతన్ని అక్కడే పాతిపెట్టి దొంగలు పారిపోయారు. అప్పుడు కోతులు నెమ్మదిగా చెట్టుదిగివచ్చి యజమాన్ని పాతిపెట్టినచోట ఒక వెదురుముక్క గుచ్చి ఆనమాలు పెట్టి ఇంటికివచ్చేశాయి. ముష్టివానిపెళ్లాం మొగుడు రాకుండా కోతులు రావడంచూసి అనుమానపడి పోలీసువారితో చెప్పుకుంది. పోలీసువాళ్లు వచ్చారు కోతులు వాళ్లకాళ్లావేళ్లాపడి వారిని హత్యాస్థలానికి తీసుకొనిపోయి వెదురుముక్కచుట్టూ ప్రదక్షిణం చెయ్యడం ప్రారంభించాయి. మట్టి కొత్తగా తవ్వబడిఉండడం, కోతుల ఈ చేష్టలు చూసి పోలీసువారు అక్కడ తవ్వించి శవాన్ని బయటకు తీశారు. అప్పుడు ఆ కోతులు ముఖచేష్టలవల్ల, ఇతరచేష్టలవల్ల హత్యచేయబడిన తీరు అంతా ఆడిచూపించాయి. దొంగలుపోయిన దారికూడా చూపించాయి. అవి చూపించిన దారివెంబడే పోయినారు. పోగా పోగా ఒకచిన్నపల్లె వచ్చింది. అచ్చట ఇద్దరు హంతకుల్ని ఆనవాలుపట్టి కోతులు వాళ్లమీద పడ్డాయి. ఆ యిద్దర్నీ పోలీసులు పట్టుకునే లోపుగా ఆ కోతులు హంతకుల్ని ఒళ్లంతా రక్కి నానాఅల్లరి చేశాయి. హంతకుల్ని అరెస్టు చేసి పోలీసులు కేసు పెట్టారు. ఆ కోతుల తెలివితేటలకు అందరూ ఆశ్చర్యపోయారు.

**• ఇకమీద మోటారుకార్లు ఆకాశంమీదకూడా నడుస్తాయి :—**

మోటారుకార్లకే రెక్కలుకూడా పెట్టి అవిరోడ్డుమీద పోయేటట్లే అవసరమైతే గాలిలోకూడా విమానాల మాదిరిగా పోయ్యేటట్లు చెయ్యడానికి ఇంజనీర్లు ఇప్పుడు తీవ్రంగా కృషిచేస్తున్నారు. ఇంగ్లండులో, అమెరికాసంయుక్తరాష్ట్రంలో, జర్మనీలో, ఇటలీలో ఇంజనీర్లు ఈ విషయంలో రహస్యంగాను, స్పర్థతోను

పనిచేస్తున్నారు. వాళ్ల ప్రయత్నాలు చాలావరకు ఫలముఖానికివచ్చాయి. రోడ్లకి అడ్డంగా ఇకమీద నదులూ, పర్వతాలూ ఉన్నా ఏ ఇబ్బందిఉండదు. ఈ క్రొత్త యంత్రాల్లో పోయినంతదూరం భూమిమీద పోవచ్చు, లేదా ఎగిరి ఆకాశంమీద పోవచ్చు. ఒక్కయంత్రంతోటే మనం భూచరులం, ఖేచరులంకూడా కావచ్చు.

౬. దాదాపు ఒకగంటవరకూ నిలిచి పలికే గ్రామఫోను రికార్డు :—

మనకు ఇప్పుడు పరిచయం అయిఉన్న గ్రామఫోను ప్లేట్లు కొద్దిని మిషాలుమాత్రం పాడతాయి. కాని ఏకటాకీని ఏభయినిమిషాలవరకునిలిచి పలికే గ్రామఫోనుప్లేట్లు కనుగొన బడ్డాయి. ఈ రీతిప్లేట్లను జర్మనీలో ఇద్దరు శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా కనిపెట్టి ప్రత్యేకంగా పేటెంటు చేసికొన్నారు దీర్ఘోపన్యాసములు రికార్డుచేయడానికి ఇవి బాగా అక్కరకువస్తాయి. ప్రసిద్ధి కెక్కిన యాక్టర్ల, ఉపన్యాసకుల ఉపన్యాసములను రికార్డు చేసి పిల్లలకు ఉపన్యాసధోరణి నేర్పడానికి ఇవి బాగా పనికివస్తాయి. అదిన్నీగాక పుస్తకాలికిపుస్తకాలు ఇందులోరికార్డు చేయబడి గ్రుడ్డివారికి వినిపించడానికి అవకాశం ఉంది. కాబట్టి ప్రపంచంలోని అంధరక్షక శాలలవారు వీనిని హెచ్చుగా అభిమానిస్తున్నారు. ఈదేశంలో కాఫిహోటలువాళ్ళు వీనిని ముందుగా తెప్పిస్తారేమో!

౬. ఆపక్షి ఐదుభాషల్లో మాట్లాడుతుంది :—

బార్డు ఫర్డుకు చెందిన థాక్లీ చెంతగల బర్నెట్ ప్లేస్లో నివసించే విలియం హెన్రీ' అనేవాని దగ్గర ఒకపక్షివుంది. అది ప్రపంచంలోని అన్నిపక్షులకంటె బాగా చదువుకున్నదని చెప్పబడుతోంది. దానికి బహుభాషలువచ్చు. లాటిన్ భాషలో చాలామాటలను అది చెప్పగలదు. ఇంగ్లీషులో మూడు వాక్యాల్ని పలకగలదు. జర్మన్, ఫ్రెంచి, స్పానిష్ భాషలలో అది ఒక్కొక్కదానిలో మూడేసి జాతీయాల్ని ఉచ్చరించగలదు. ఆ పక్షి పన్నెండు కొత్తమాటలు నేర్చుకోడానికి ఒకవారం తీసుకుంటుంది. వివిధభాషల్లో అది ఏడాదికి ఏభైఏసి వాక్యాలచొప్పున నేర్చుకుంటుంది. పక్షుల తెలివికి ఇది ఒక నిదర్శనం.

౬. కెమెరా అబద్ధం ఆడగలదు :—

సినీమాతెరమీద మనం తరుచుగా విమానం నుండి పోతూ భూమిమీదికి వాల్తూ ఉండడం మొదలైన అద్భుతదృశ్యాలు చూస్తాం. అవి సాధారణంగా నిజంగా జరిగినవి అయిఉండవు. కెమెరా అబద్ధం ఆడి మన కళ్లను కప్పుతుంది. విమానం లాంటిది ఒక మోడల్ తయారుచేసి అది కాల్తూఉండగా కెమెరాకు ఎత్తుతారు. అబద్ధాలాడ్డంలో, అతిప్రజ్ఞగల కెమెరా అది అచ్చంగా నిజదృశ్యమే అయినట్లు మనకు చూపెడుతుంది. హాలీవుడ్డుకు చెందిన హారీకెక్కు అనే ఫొటోగ్రాఫరు ఈ విషయాన్ని గురించి ఇల్లా చెపుతున్నాడు. "మనకళ్లు చూసే ప్రతిదృశ్యాన్ని కెమెరా మోసంచేత కల్పించగలదు. ఒక క్రిమినల్ కేసులో ఈ నడుమ ఒక ఫొటోగ్రాఫ్ సాక్ష్యంగా తీసికోబడిందని పత్రికలలోచదివాను. నాఅభిప్రాయంలో అట్లు తీసికోవడం ఎంతమాత్రం సరి అయింది కాదు. సంఘంలో అత్యంత గౌరవప్రదంగా జీవించేవ్యక్తికి పరువు నష్టపెట్టే ఫొటోగ్రాఫులు నేను సునాయాసంగా కల్పించగలను. 'స్కార్ ఫేస్' అని మేము ఈ మధ్య తయారుచేసిన ఫిలింలో తుపాకిగుళ్ళుకూడా ఫొటో తీయబడ్డాయి. ఫొటోలో అవి మనష్యులమీద ప్రయోగింపబడ్డట్లే కనిపిస్తాయి. నిజానికి అవి గోడల్ని అంటి మాత్రమే ఉండేవి."

౬. మాటలాడే ఫిలుముల పిమ్మట వాసనవేసే ఫిలుములు :—

మాటలాడే ఫిలుములు ప్రపంచంఅంతా అల్లుకున్నాయి. వీనికిపిమ్మట వాసన వేసే ఫిల్ములు. సినీమాలో ఉద్యానవనదృశ్యంవచ్చిన పుడు పువ్వుల వాసన, సముద్రదృశ్యం వచ్చినప్పుడు ఉప్పు నీటిగాలి వాసన మొదలైన ఆయాదృశ్యాలికి ఉచితమైన వాసన్నికూడా థియేటరులో విరజిమ్మే యంత్రములు సినీమా పరిశ్రమకు జన్మస్థానమగు హాలివుడ్డులో నెలకొల్పబడ్డాయి. త్వరలో మనదేశానికికూడా రాగలవు.

# అబిసీనియా చరిత్ర

ఐరోపియను దేశీయులు కబళింపగా ఆఫ్రికాఖండమున మిగిలియున్న స్వతంత్రదేశము అబిసీనియా ఒక్కటే. అబిసీనియాను ఇథోపియా అనికూడ అందురు. విశాలఖండమగు ఆఫ్రికాలో మిగిలియున్న ఈ ఒక్కస్వతంత్రదేశపు స్వాతంత్ర్యమును కాజేయ ఇటలీదేశపు నియంత ముసోలినీ ఉరకలు వేయుచున్నాడు.

అబిసీనియారాజ్యపు రాజచిహ్నము వెనుకటికాళ్లపై నిలుచుండి కిరీటమును ధరించియున్న ఒకసింహము. ఆ సింహము తన కుడి పంజాలో రాజదండమును ధరించి యుండును. ముప్పదిశతాబ్దుల ఈమధ్యను ఒక్కసారికూడ అది జయింపబడలేదు. నేడో?

1889-వ సంవత్సరము నవంబరు 3-వ తేదీని మెనెలెక్ అనువాడు పట్టాభిషిక్తుడగుటతో అబిసీనియాచరిత్రయందు నూతనాధ్యాయము ప్రారంభమైనదని చెప్పవచ్చును. మెనెలెక్ దృఢకాయుడు, ఆరడుగులఎత్తు మనిషి., నల్లటిరూపు, మొగమునిండ మశూచికపు గంట్లు.సూటిగ మాటలాడువాడు. ప్రతిదినమును చర్చికి వెళ్లువాడు. లేఖలు వ్రాయుచు, రాజ్యాంగవిషయములను తనమంత్రులతో ఆలోచించుచు ఆతడు దినమునందలి విశేషభాగమును వెచ్చించువాడు. ధనవంతుడు దరిద్రుడు అను విచక్షతలేక ఎల్లరకును ఎల్లవేళలయందును ఆతని దర్శనము సులభసాధ్యమైయుండెను. తనదివాణపుకచ్చేరియందు జరుగు ప్రతిచిన్నవిషయముకూడ ఆతనికి తెలిసియుండునది. విదేశాంగవ్యవహారములందు ఆతనికి అభినివేశము మెండు. ఐరోపాఖండపు వివిధదేశముల రాజ్యాంగతంత్రములను ఎప్పుడును ఒకకంటితో చూచుచుండువాడు. సామంతరాజులను మంచి అదుపులో పెట్టి వారికడ తన ప్రతినిధులను నెలకొల్పి తిరుగుబాటులు లేకుండ చేసికొని ఆతడు ఇథోపియారాజులకు రాజైనాడు. బానిస వ్యాపారమును తుదముట్టించినాడు. న్యాయస్థానముల నెలకొల్పినాడు. సుంకములను పన్నులను క్రమమొనర్చినాడు. దేశమున రైల్వేల, టెలిగ్రాఫుల స్థాపించినాడు.

ఒకసారి పంటలుచెడి దేశమున క్షామము సంభవించెను. అప్పుడా రాజు తన ఉగ్రాణము నందలి ధాన్యమునంతను ప్రజలకు పంచినాడు. తన ఖర్చున విదేశములనుండి ధాన్యము తెప్పించి వారికిచ్చినాడు. 1898 లో ఆ దేశమున పశువులలో రోగములు ప్రబలెను. అప్పుడాతడు పశురోగనివారక ప్రయత్నములందు స్వయముగ పనిచేసినాడు. స్ఫోటకము నిరోధించుటకు దేవతారాధనతోపాటు టీకాలు వేయించుటకూడ ఆరంభించినాడు.

ఇంతకును ఆతడు గొప్పవీరుడు. ‘గల్లా’ అను దేశభాగమును జయించి తన రాజ్యపు సరిహద్దులను పెంపొందించినాడు. ఎడోవా అనుచోట 1896 లో ఆతడు ఇటలీసైనికులను చిత్తుచేసినాడు. ఆ యుద్ధములో ఇటలీవారికి కలిగిననష్టము అపారమైనది. పదమూడు వేలమంది ఇటాలియను సైనికులు చిత్రవధ చేయబడిరి. ఏడు వేలమంది బందీలుగా గొనబడిరి. ఆతనిభార్య వీరాంగన. ఆమెకు ప్రత్యేకము సేనయుండెను. మకాల్లి యుద్ధములో ఆ సైన్యమును ఆమె స్వయముగ నడపెను. ఐరోపియనులనిన అంటు ముఖ్యముగా

ఇటాలియనులనిన ఆమెకు బొత్తిగా సరిపడదు. 'అబిసీనియాదేశము అబిసీనియనులకే' అను ఆమెభర్తసిద్ధాంతమునకు ఆమెయే ప్రతిపాదకురాలుఅని చెప్పవచ్చును.

అబిసీనియాకు అనేకవిషయములలో నూతనచైతన్యమును కలిగించిన ఆ ప్రభువు దాని రాజధానిని వీడి 'అడిస్ అబాబా' అను క్రొత్తరాజధానిని నిర్మించినాడు. అడిస్ అబాబా అనగా ఆ దేశపుభాషలో 'క్రొత్తపువ్వు' అని అర్థము. ఆ పట్టణము కొండకోనలలో కట్టబడినది. చెంతను రెండునదులు ప్రవహించుచుండును. దట్టముగా పెరిగినయూకలిప్టస్ వృక్షములతో ఆ ప్రదేశ మొకఅరణ్యము వలెనుండును. జనాభా ఎనుబదివేలు. ఇటలీని ఓడించిన విజయోత్సాహములో మెనెలెక్ ఈ క్రొత్తపట్టణమును కట్టించినాడు. రాజగృహములు, ప్రభుత్వమందిరములుగల పేటను అచటిభాషలో 'గిబ్బి' అందురు.

ప్రజలలో మెనెలెక్కుగల పలుకుబడి అపారమైనది. దుష్టులకు అతని నామము సింహస్వప్నముగా నుండెను. ఒట్టులు పెట్టుకొనునపుడు అబిసీనియాప్రజలు గౌరవప్రదముగా ఆతనినామము నుచ్చరింతురు. ఆతనికి పురుషసంతతి కలుగలేదు. కాగా ఆతడు 1913 లో మరణించినపుడు అతని ఆదేశానుసారము ఆతని కూతురు కొడుకు లెడ్జు ఇయాసు అనువాడు రాజయ్యెను. ఆతడు పదునారు వత్సరముల బాలుడు. చెడు సహవాసము లబ్బెను. తనకు రాజ్యమిచ్చిన తాత దినవారములైన ఆతడు సరిగ నిర్వర్తించలేదు. పైగా క్రైస్తవమతమును వీడి మహమ్మదీయమతమును చేపట్టెను. అరబ్బుస్త్రీని పెండ్లాడెను. పలువురు స్త్రీలను ఉంపుడుకత్తెలుగా నుంచెను. ఈ చేతలకు కినిసి ప్రజలాతనిని 1916 లో రాజ్యభ్రష్టునిగావించిరి. మెనెలెక్ మఱియొక కూతురగు జాడిటూను రాజ్యాధికారిణిగా నొనరించి మెనెలెక్ మేనల్లుడు ఆమెకు రీజెంటుగా నుండుటకును, ఆమె మరణానంతర మాతడు రాజగుటకును నిర్ణయించిరి. రీజెంటు నామము రాస్‌టఫారీ. ఇతడే ఇపుడు అబిసీనియా చక్రవర్తి. జాడిటూను త్రోసి రాజని రాస్‌టఫారీ చక్రవర్తి అయినాడు. ఆ వృత్తాంతము చమత్కారమైనది.

1916 లో జాడిటూరాణి అబిసీనియా అధికారిణి యయ్యెను. రాస్‌టఫారీ ఆమెకు రీజెంటు. ప్రతిదినము నడుచు రాజ్యాంగవ్యవహారము లన్నియు ఆమెకు అతడు నివేదించుచుండవలెను. వివిధశాఖలలో నుద్యోగస్థుల నియామకము, వారి ప్రమోషనులు ఆమెయే చూచుచుండును. కాని ఆమెపూర్వాచారప్రియురాలు. క్రొత్తయగు దానిని ప్రతిదానిని ద్వేషించును. తనదేశము అభివృద్ధినందవలయు నన్నచో క్రొత్తపద్ధతులను అవలంబింపక తీరదని రీజెంటుతలంపు. ఆ దేశమున పూర్వాచార ప్రియులందఱు ఆమె పార్టీగాను, క్రొత్తను కోరువారు అతని పార్టీగాను ఏర్పడిరి. అభిప్రాయభేదములు దినదినము అతిశయించుచుండెను. ఎట్లో పండ్రెండుసంవత్సరములు గడచిపోయెను.

1928 సెప్టెంబరు 4-వ తేదీరాత్రి గిబ్బియందలి జాడిటూరాణి భవనమునుండి ఫిరంగిపేల్పులు వినవచ్చెను. తనదేశమున సంపూర్ణశాంతి నెలకొనియున్నదని ఆతడు చాటియుండెను. ఫిరంగిమ్రోతలువిని ఆ పట్టణమున నివశించుచున్న విదేశప్రతినిధులు ఏమనుకొందురు? తోడనే ఆతడు జాడిటూరాణి మందిరమునకు పరుగెత్తెను. అడ్డగించుచున్న రాజగృహాధికారిని పక్కకునెట్టి నేరుగా రాణిక

డకు పోయి పేల్పులకు కారణమడిగెను. రాణి స్నేహితురాలు మగపిల్లవానిని నీళ్లాడినది. ఆ సంతోషమునకు గుఱుతుగా ఈ పేల్పులు. ప్రపంచమునకు ఈ పిల్లవానిపుట్టుక తెలియదు. ఫిరంగిగుండ్లపేల్పులు మాత్రము తెలియును. ఇక అబిసీనియాలో శాంతియున్నదని తాను తఱుచుగా చెప్పుమాటను ఎవరు విశ్వసింతురు? కాగా ఆ పిల్లవాని తండ్రిపై మూడువేలథేలరు (ఆ దేశపునాణెములు) లపరాధము విధింపబడెను. రాణి మనస్సునకు కష్టము తోచెను. ఆమె తనసేనలను కూర్చుకొని యుద్ధసన్నద్ధఅయ్యెను. సామంతరాజులలో బలవంతుడు రాస్‌టస్సా సాయము నామెఅర్థించెను. రాజసభలో కూడ పలువురు రాస్‌టఫారీచేతను ఆమోదింపలేదు. అయినను ఆతడు ప్రయిలోడక బహుధైర్యసాహసములతో వర్తించెను. తనకు ఎదురుతిరిగినవారిని ఖైదు చేసెను. రాస్‌టస్సాకు ఉన్నతోద్యోగ లాభము ఎఱచూపి తనవైపుకుతిప్పుకొనెను. జయలక్ష్మి ఆతనిని వరించెను. జాడిటు-రాణికి అధికారము పోయెను. రాస్‌టఫారీ సింహాసనారూఢుడై కిరీటము ధరించెను. నాటినుండి ఆతడే అబిసీనియాకు 'నెగూస్' (అచటిభాషలో రాజు అని అర్థము.) ఇట్లు ఒకపిల్లవాని జన్మోత్సవము ఆతనిరాజ్యోత్సవముగా మారెను.

ఇంతటి అదృష్టవంతుడగు సాహసికవీరుడు ముసోలినీచేత ఓడింపబడునా?

—ఆర్. శ్రీరామమూర్తి. బి. ఏ.

---

# రాస్ టఫారీ

[యుద్ధప్రశంసలోనున్న నేటి అబిసీనియా చక్రవర్తి.]

అచటిభాషలో రాస్ అనగా ప్రభువుఅనియు, టఫారీ అనగా భయములేనివాడనియు అర్థము. నిజమునకు ఆతడు భయములేని ప్రభువే. ముసోలిని అంతటివాడు తనపై ఎత్తి వచ్చుచున్నను ఏ మాత్రమును భయపడక తన సైన్యమును స్వయముగ నడుప సిద్ధమగుచున్న ఈ అబిసీనియాచక్రవర్తి నిజముగా భయములేని ప్రభువే.

రాస్‌టఫారీ 1891 లో జననమందెను. తండ్రిపేరు రాస్‌మాకొనెన్. అబిసీనియా దేశపు సారవంతమును ధనవంతమును అయిన రాష్ట్రములలో నొకటియగు హారార్‌నకు ఆతడు గవర్నరు. పైగా ఆతనికి పెక్కుఎస్టేట్లుగలవు. అంతటి ధనవంతునకు పుట్టిన రాస్‌టఫారీకి విద్యాసౌకర్యములకు లోటేమి? హారార్‌నందలి ఫ్రెంచిమతప్రచారకులతనికి ఐరోపియను పద్ధతులలో విద్యగఱపిరి. ఫ్రెంచిభాషను ఆతడు ధారాళముగ చదవను, వ్రాయను, మాటలాడను నేర్చినాడు. విద్యాప్రియుడగు నాతడు బహుగ్రంథములను పఠించెను. తనదేశపుసారస్వతమునందు ఆతనికి నిరుపమానమైన ప్రవేశముగలదు. ఐరోపియను భాషలలోని శాస్త్రవిషయకములగు ఉద్గ్రంథములతో ఆతనికి మంచి పరిచయమున్నది.

అబిసీనియాదేశమున విద్యావ్యాప్తికై ఆతడు విశేషకృషి సల్పెను. నిజమైన విద్య మంచి పుస్తకములవలననే కలుగునను సత్యమును గ్రహించి పుస్తకములు ముద్రించుట

ఒక ముద్రణాలయమును అతడు స్వయముగ రాజధానీనగరమగు ఆడిస్ అబాబాయందు నెలకొల్పినాడు. దానిపేరు ఇంపీరియల్ ప్రింటింగ్ ప్రెస్ అని. సామాన్యజనుల కందుబాటులోలేని పూర్వపు మతగ్రంథముల నెన్నిటినో అతడు తన పీఠికలతో ముద్రించినాడు. గొప్పగ్రంథములు పెక్కింటికి అతడు ఉపోద్ఘాతములు వ్రాసినాడు. స్వయముగా కొన్ని గ్రంథములను రచించినాడు.

చక్రవర్తినను ఆడంబరమెఱుగడు. యుద్ధములందును సామాన్యసైనికునివలె దుస్తులు ధరించును. సూటిగ మాటలాడును. ఎట్టివారితోనైన మర్యాదగా వర్తించును. మీసములు, చిన్నగెడ్డము కలిగి అతని ముఖము ఠీవిగానుండి చూచువారిని ఆకర్షించును.

అతడొకగొప్ప దేశభక్తుడు. ప్రపంచమునందలి వివిధదేశములలో తన దేశమున కొక ఉన్నతస్థానము రావలయునను తీవ్రకాంక్షలో అతడు స్వశరీరసుఖమును త్యాగముచేయును. నిముసమైన విశ్రాంతిగొనడు. ఉదయమునుండి రాత్రి చాలప్రొద్దు పోవువఱకు అతడు పని చేయుచునేయుండును. అబిసీనియాలో దినమున కన్నిగంటలవంతున పనిచేయువాడు మఱియొకడు లేనేలేడని చెప్పవచ్చును.

అతని విద్యార్జనాకాంక్ష అపారము. ఆధునికనాగరికతవలని లాభములను తనప్రజల కుపదేశించుటలో అతడత్యుత్సాహమును, అమితశ్రద్ధను చూపును. తన దేశమున టెలిఫోనులు నెలకొల్పినాడు. మోటారుకారులు తెప్పించినాడు. అతని కొకరోల్సురాయిస్ కారున్నది. అతని రాజభవనమున ఆధునికనాగరికతా చిహ్నములగు వైర్‌లెస్, సినీమా, విద్యుచ్ఛక్తి మొదలగు సౌకర్యములన్నియునున్నవి.

1906 లో రాస్‌టఫారీ తండ్రి చనిపోయెను. 1916 లో అతడు అబిసీనియాకు జాడిటూరాణి తరఫున రీజెంటుగ నియమింపబడెను.

1923 లో అతడు ఏడెన్ నగరమును దర్శించెను. బ్రిటిష్‌వారు అచట అతనిని రాజోచిత గౌరవములతో సన్మానించిరి. అచటి బ్రిటిష్ సైనికశిక్షణమును గమనించినాడు. వారి తుపాకులు, ఇతరయుద్ధపరికరములు అతనికి ముచ్చట గొల్పినవి. ముఖ్యముగా నాతనిని ఆకర్షించినవి గాలివిమానములు. కూడవచ్చినవారు నిరోధించుచున్నను లెక్కచేయక అతడొకగాలివిమానమునెక్కి విహరించి తన నూతనవస్తుప్రియత్వమును ప్రదర్శించెను.

1924 లో అతడు రోము, ప్యారిస్, లండను మొదలగు ఐరోపియను మహానగరములను సందర్శించినాడు. అతడు గొప్పరాజ్యాంగవేత్తయగుటచే సామంతరాజులను కూడ ఆ యాత్రలో తనవెంట గొనిపోయినాడు. అగుట రాస్‌టఫారీ లేనపుడు దేశమునఉండి అలజడిగాని తిరుగుబాటుగాని కల్గించుటకు ఆ సామంతరాజులకు అవకాశము లేకపోయినది.

ఇట్టి దూరదృష్టి తోడనే అతడు తన దేశమును నానాజాతిసమితిలో చేర్చినాడు. సమితిలో చేరినంత మాత్రమున ఐరోపియనులదాడి నుండి తన దేశమునకు రక్షణలేదని అతనికి తెలియును. కాని నేడు రాగలదాడిని మరి కొంతకాలము ఆపుచేయుటకు ఆ సభ్యత్వము అక్కఱకురాగలదను దృష్టితోడనే అతడందు చేరినాడు. దీనిసత్యమును నేటిచరిత్ర ప్రత్యక్షీకరించుచునే యున్నది.

రాస్‌టఫారీ భార్యపేరు వెంఇజాహోమానన్. భర్తవలె ఆమెయు పలుదేశములు చుట్టి వచ్చినది. మతవిషయములందు ఆమెకు అభినివేశముమెండు. ఆమె తన సంతానమునకు పాశ్చాత్య విద్యాలాభమును కలి

గించినది. కూతురు లాసానీలో చదువుచున్నది.

1928 లో జాడిటూరాణిని త్రోసి రాజని రాస్టఫారి నెగూస్ అనగా రాజు అయినాడు. ఏనాడో ఒకనాడు యుద్ధమురాక తప్పదని ఆతడప్పుడే గ్రహించి అప్పటినుండియు యుద్ధ పరికరములు కూర్చుచునేయున్నాడు. బెల్జియము, జర్మనీ, జెకోస్లావియా దేశములకు తన దేశమునపండు కాఫీగింజలు విరివిగా ఎగుమతిచేసి అందుకు బదులుగా ఆ దేశములనుండి ఆయుధసామగ్రిని తెప్పించుకొనుచున్నాడు. బెల్జియము, స్వీడను దేశములనుండి నిపుణులను రప్పించి తన సైనికులను యూరపియను పద్ధతులలో తరిబీయతు చేయించుచున్నాడు.

1930 నుండియు ఆతడు ఫ్రాంసుదేశము నుండి విరివిగా విమానములను తెప్పించుచున్నాడు. తన దేశము మొదటి విమానమును విలిచిన దానికి గుర్తుగా – మన దేశమునందలి నేటి జూబిలీ పోస్టల్ స్టాంపులవలె – ప్రత్యేకము పోస్టల్‌స్టాంపులు వేయించి విమానయుద్ధమునకు కూడ తయారై యున్నాడు.

తన దేశము చుట్టును వలసరాజ్యములను కలిగియున్న ఐరోపియనురాజ్యములను ఎప్పుడును ఆతడు అనుమానదృష్టులతోడనే చూచుచుండును. కాగా ఆతడు దూరమున ఉన్న అమెరికా, జపాను దేశముల సఖ్యమును చేకొనును. ఈనడుమనే జపానుతో వర్తకపు టొడంబడికను గావించుకొని ఇరువది లక్షల యకరముల నేలను ప్రత్తి పండించుటకుగాను జపానువారికి ఇచ్చియున్నాడు.

ప్రస్తుతములో ఆతనికి ఇతర పనులమీద దృష్టి తగ్గినది. యుద్ధసామగ్రిని తయారుచేయు కర్మాగారములు ప్రపంచమున ఎన్ని కలవో అన్నిటి క్రొత్త కేటలాగులును ఆతనికడ కుప్పలుగ నున్నవి. నిరంతరము ఆ కేటలాగులను చూచుటయే ఆతనిపని. క్రొత్తమాదిరి యుద్ధపరికరము ఏదిఉన్నను వెంటనే తెప్పించవలసినదే.

కేటలాగులు చూచుట తరువాత అతని ఇప్పటి ముఖ్యమైనపని సైనికులను హెచ్చరించుట. 'సైనికులారా! యుద్ధముచేయునపుడు మీరు గీరులుగా మరణించుట ఎట్లో నేర్చుకొందురు. విచారింపకుడు. వెనుదీయకుడు. తన దేశముకొరకు జీవితము నర్పించువాడే సుఖజీవి.' సైనికులకు తాను స్వయముగా నాయకత్వము వహించి నడుపుటకు ఆతడు పూనియున్నాడు.

ఆ దేశమున ఇప్పుడు ఒక్కటే ఉత్సాహము. దేశరక్షణమునకు స్త్రీలుకూడ ముందునకు వచ్చుచున్నారు. ఆకాశమంటు కొండలను దాటి, పాతాళమంటు నదులను ఉత్తరించి, కాకులు దూరని కాఱడవుల నతిక్రమించి ముసోలినీ సైనికులు అబిసీనియాలో ప్రవేశింపగలిగినను నిరాఘాటముగా పోవుటకు ఆ దేశమున చాలినన్ని రోడ్లు లేవు. ఎంతమంచి బూట్సులైనను మూడురోజుల కంటె మన్నవు. కాళ్ళకు జోళ్ళులేనిదే ఇటాలియను సైనికులు అడుగువేయలేరు. అబిసీనియను సైనికులకు జోళ్ళు అక్కరలేదు. వారి నేలమీద వారు వట్టికాళ్ళతో నడుచుటకే అలవడి యున్నారు. ప్రపంచమునందలి స్వాతంత్రప్రియు లెల్లరు అబిసీనియా స్వాతంత్ర్యము రక్షింపబడుగాక అని కోరుచున్నారు. 'భయములేని ప్రభువు' అని అర్థము వచ్చు రాస్టఫారీనామముతో వెలయుచున్న అబిసీనియాచక్రవర్తిని జయించుట ముసోలిని యంతవానికికూడ సులభముగా జరుగు పనికాదు.

—జి. వెంకటరావు, బి. ఏ.

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొనఁ పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.

౯౮. ఒక సంశయము.

"భుక్త్వాశతపదంగచ్ఛేత్
వామపార్శ్వేతు శాయనమ్
.....................
....................."

పయిశ్లోకము ఉత్తరార్థము తెలియ లేదు. ఉత్తరార్థమును తెలుపుచు, పూర్వార్థము నందలి 'వామపార్శ్వేతు శాయనమ్' అను వాక్యమును వివరింప గోరుచున్నాను.

—వే. శంకరశాస్త్రి.

౯౯. భార్యను పేరుతో పిలవకుండడము.

ఎవరిభార్యలను వారు పేరుపెట్టి పిలవరాదనిమనలో ఒకకట్టడి. ఈ మాదిరికట్టడి మన హైందవసంఘములోనేనా ప్రపంచమున మరి యే ఇతరసంఘములందైన గలదా?

—వింజమూరి విశాలాక్షి.

౯౬. స్త్రీ కోర్టుషిప్ చేయుటగలదా?

ప్రపంచమునందలి వివిధజాతుల వివాహాచారములలో కోర్టుషిప్ తఱుచుగా మగవాడే చేయుచుండును. అట్లుగాక స్త్రీ కోర్టుషిప్ చేయుట ఏదేశమందైన గలదా?

—రావిపాటి అప్పారావు.

౯౭. తలిదండ్రులకు పెళ్ళిచేసినకొడుకు.

పెళ్ళికాని—ఒండొరులను చూచుకొనని దంపతులకుపుట్టిన పిల్లవాడు తన తలిదండ్రులకు సంధానము చేసినాడను పురాణగాథ ఏమైనగలదా? అది ఎచట వివరింపబడినది?

—కందాళం వెంకటరావు.

౯౦ సంభోగమునకు అర్హమగు కాలము.

అత్యంత ప్రాచీనకాలమునుండియు సంభోగమునకు రాత్రికాలమే ఉపయోగింపబడుచున్నది. నేటి నాగరికప్రపంచముకూడ ఈ కాలమునే చేకొనియున్నది. రాత్రిలో పూర్వపు రాత్రియా, అపరరాత్రియా అను ప్రశ్నకు అప్పటిప్పటి అనుకూలమునుబట్టి అది యుండునని చెప్పవచ్చును. అనేక కారణములచే ఈ కృత్యమునకు రాత్రిభాగమే లెస్సయైనదని చెప్పనగను. రాత్రిభాగమున పురుషుడు తన లౌకికవృత్తివలని అలజడులకు దూరుడై యుండును. ఇంటిలోని ఇతరవ్యక్తులు, ఇరుగువారు, పొరుగువారు, ఊరంతయు మాటు మణగియుండు సమయమది. భయసంకోచాదులకు ఇసుమంతయు అవకాశముండదు. మరియు సంభోగానంతరము గాఢనిద్రపొంది అలసటను బాపుకొనుటకును వెచ్చించిన శక్తిని, దీప్తిని తిరిగి పొందుటకును రాత్రిఎంతయు అనుకూలమైనది. నవీనశాస్త్రవేత్తలు దీనికి వ్యతిరేకముగా కొంత చెప్పుచుండకపోలేదు. జీవయాత్రకువలయు పరికరములను కూర్చుకొనుటలో పురుషులెల్లరును, స్త్రీలలో విశేషము మందియు పగలెల్ల కష్టపడి పనిచేయవలసియుందురు. ఈ కారణముచే సాయంకాలములందు ఆ స్త్రీపురుషుల వీర్యశక్తులు మిక్కిలి నీరసస్థితిలో నుండును.? అదియును గాక పడకగదులు సాధారణముగా తగినంత గాలి రానివిగానుండును. భోజనముతో కడుపు నిండియుండును. శరీరములు బడలిక చెంది

యుండును. ఇట్టి స్థితిలో స్త్రీలకు బొత్తిగా సంభోగవాంఛయుండదు. ఉండినను అట్టి సమయములందు నిలిచిన గర్భమువలన కలుగు పిల్లలు బలవంతులును, ఆరోగ్యవంతులును అయిఉండరు. ఈ కారణముచే ఇటీవల సంభోగకాలమునుగూర్చి కొంతమార్పు అభిప్రాయము కలుగుచున్నది. పూర్వ రాత్రికంటె ఉదయకాలము అప్పటికాంతి అందులకుమంచిదను అభిప్రాయము క్రమముగా పాదుకొనుచున్నది. కాంతిలో ధరింపబడిన గర్భమువలన కలుగుపిల్లలు హెచ్చు తేజస్సు కలిగియుందురని నమ్మబడుచున్నది. నాగరికత బొత్తిగా ఎఱుగని కొన్ని అడవిజాతులవారు ఈ విషయములో మనకంటె మెఱుగుగా ఉన్నారని ఒక శాస్త్రవేత్త అనుచున్నాడు. న్యూగినియాలోను, బూరుద్వీపములలోను స్త్రీ పురుషులు దినకృత్యములచే అలసిపోయిఉండి ఈ కృత్యమును రాత్రిభాగమున చేయనొల్లరు. ఉదయముననే అడవులలోనికి పోయి చెట్లక్రింద ప్రశాంతవాతావరణమున నుద్దీప్తులై ఈ పవిత్రకార్యము నాచరింతురు. పట్టణములలో నివసించు నాగరికులకు ఈ పద్ధతి అందుబాటుకానిది. కావున వారి రాత్రికాలమువిషయములో ముఖ్యముగా ఈ నాలుగు విషయములు జ్ఞప్తి యందుంచుకొనవలయును. 1. ఆ కాలమున కడుపునిండుగా నుండకూడదు. భోజనముచేసి మూడుగంటలు దాటినతరువాత కాని ఆ కార్యమునకు కడంగరాదు. 2. అప్పటికి శరీరము ఏ మాత్రమును బడలి యుండరాదు. 3. ప్రదేశము ధారాళముగా గాలి వచ్చునదై యుండవలెను. కాంతిగల దీపము తప్పక నుండవలెను. 4. అనంతరము విశేషకాలపు విశ్రాంతికి అనుకూల ముండవలెను.

౫౧. పొగచెట్టు ఓషధీగుణము జెప్పుగ్రంథము

పొగచెట్టు మనదేశపు ఓషధికాదు. సుమారు మూడువందల సంవత్సరములక్రితము యిది మన దేశమునకు కొనిరాబడినది. ప్రాచీనమును, దేశీయమును అగు ఓషధి కాకపోవుటచేత, ప్రాచీననిఘంటువులందు దీనిని గూర్చిన వివరములు లభింపవు. ఇటీవలి వైద్యనిఘంటుకారులు దీనిగుణమును గుర్తించి గ్రంథములందు జేర్చిరి:—శాలిగ్రామనిఘంటు, వనౌషధిదర్పణము చూడతగును. తామ్రకూట, తమాఖు, తాంబాకు, పొగాకు, అను పేళ్లచే వాడిరి. —వే. శంకరశాస్త్రి.

౫౨. మిరపకాయల నిషేధము

"పోర్చుకీసువారు (బుడతకీచులు) మన దేశమునకు రాక పూర్వమిక్కడ మిర్యపుగాయలు లేవు. కారమునకు మిర్యములే యుపయోగించెడివారు. ఆ దేశమునుండి పోర్చుకీసువారే తొలుత వీనిని మన దేశమునకుఁదెచ్చిరి. కావుననే నేఁటికిని గొందఱు వైదికకృత్యములందుఁగారమునకు మిర్యములనే యుపయోగింతురు. మిర్యములకు బదులుగా నేర్పడినవి గాన వీనిని మనవారు మిర్యపుఁగాయలనిరి" అని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చాటుపద్యమణిమంజరిలో వ్రాసియున్నారు. మిరపకాయలు దేశీయమగు వస్తువు కాకపోయి నప్పటికి; నేడు యిక్కడ విరివిగా పండింపబడుచున్నవి. ఇవి విదేశజములగుటచే, మడికి పనికి రావను చాదస్తమే, కొందరు నేటికిని పైతృకకర్మలందు, వీనిని వాడకుండుటకు కారణము. మిరియములకు బదులుగా వాడబడు వస్తువని ఈ క్రింది నామసాదృశ్యములను బట్టియే తెలియతగును:—

సం. మరిచ—మిర్చి, మరిచఫలమ్.

తె. మిరియాలు—మిర్యపుగాయలు,
మిరపకాయలు, మిర్చి.

అ. మొళఘు—మొళఘూ, మొళఘూయి.

—వే. శంకరశాస్త్రి

REGISTERED TRADE MARK:
MESSRS REDDY & CO.

స్థాపితం. 1920.

# అత్యద్భుత కుష్ఠరోగనివారిణి

(రిజిష్టర్డు)

గుణములేదని ఋజువుచేయువారికి రు 500 లు బహుమానము.

18 రకముల కుష్ఠులు, శ్వేతకుష్ఠు, తదితర చర్మవ్యాధులు యెంతకాలమునుండి జీర్ణించి యున్ననూ గ్యారంటీగా బాగుచేయబడును. 'అత్యద్భుత కుష్ఠరోగనివారిణి' యను దివ్యౌషధమువలన అనేకవేల రోగులు పూర్ణారోగ్యమును బొంది సంసారసుఖము ననుభవించుచున్నారు. చిరకాలమునుండి ప్రసిద్ధికెక్కిన కంపెనీ రెడ్డికంపెనీయే. యింజక్షనులవలన ఫలితముపొందని రోగులనేకులు మాయొద్ద చికిత్సబొంది పూర్ణారోగ్యమును బడయుచున్నారు. పైవ్యాధులకేగాక శెగ, సవాయి, శుక్లనష్టము, మూర్ఛ, మూలశంక మొదలగువ్యాధులకు మాయొద్ద గ్యారంటీ ఔషధములున్నవి.

"నకలు మందులనుచూచి మోసపోకుడు"

పూర్తివివరములకు యీక్రింది యడ్రసునకు వ్రాయుడు.

| | | |
|---|---|---|
| గోపాలపురము పోస్టు<br>(వయా) కొత్తపేట,<br>తూర్పుగోదావరి జిల్లా. | **రెడ్డి అండ్ కో**<br>(రిజిష్టర్డు) | బ్రాంచి ఆఫీస్ :<br>(కుష్ఠురోగచికిత్సానిపుణులు)<br>వాల్తేరు.ఆర్.యస్.పోస్టు. |

# గోలకొండపత్రిక

దాదాపు అరువదిలక్షల ఆంధ్రులకు నెలవును, అనేకాంధ్రసంస్థానములకు ఉనికిపట్టును, అగు నిజామురాష్ట్రమునందు విశేషప్రచారంగల ద్వైవారపత్రిక. ప్రతి సోమ గురువారములందు ప్రకటింపబడును. వ్యాపారప్రకటనలకు అనువైనది.

సాలుచందా రు 6. అరుమాసములకు రు 3. విడిపత్రిక ఒకఅణా.

# గోలకొండకవులసంచిక

30 చిత్రపటాలతో, 354 కవులరచనలతో నిండారిన 450 పుటలుగల ఉత్తమ సంచిక. బహుభాషావిదులు, ఆంధ్రభాషాసేవకులు అగు శ్రీసురవరం ప్రతాపరెడ్డిగారి ప్రజ్ఞాపరిశీలనమున వెలువడినది. సర్వాంగసుందరం—ఆనందకందం, గ్రంథాలయాలకు అమూల్యాలంకారం.

గోలకొండ చందాదారులకు ఒక్కరూపాయి—ఇతరులకు రెండురూపాయిలు, టపాఖర్చులు పది అణాలు ప్రత్యేకము.

చిరునామా :

గోలకొండపత్రికాకార్యాలయం, త్రూపుబజారు, హైద్రాబాద్, (దక్కన్).

# ఆంధ్రభూమి బుక్కుడిపో—వేపేరి, మదరాసు

## విపంచి — 80 పుటలు — నాలుగు అణాలు.

తన మృదుమధురరచనములచే నవ్యాంధ్రభారతిని సేవించుచున్న యువకవులలో నొకరగు శ్రీయుత భాడ్డు బాపిరాజుగారి మధురకావ్యముల సంపుటి. పత్రికలు, ప్రముఖులు విశేషముగ కొనియాడినది. ముద్దులమూట. రసములఊట. పాలతెల్లని ఆంటిక్ కాగితములు. నాలుగైదు రేఖాచిత్రములు. మొత్తమున కొక అందముల బరిణె

## వైద్యయోగరత్నావళి — 370 పుటలు — రెండు రూపాయిలు.

మద్రాసు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్ మెంబరు బ్రహ్మశ్రీ పండిత ములుగు రామలింగయ్యగారిచే సంపాదితము. ఇందు గవర్నమెంటు 1929 వ సంవత్సరపు జీ. ఓ. 2411 నెంబరు గల పుస్తకమందు సర్వప్రకరణములను చేయుపద్ధతి వివరముగ వ్రాయబడినవి. సాంప్రదాయ యోగములు, అవసరమైన పరిభాష చేర్పబడినవి. ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్లకు, ఫార్మశీల వారికి మిక్కిలి ఉపయోగమైనది. చాల పరిశ్రమచేసి వ్రాసిన గ్రంథము. ఇండియన్ మెడికల్ స్కూలు ప్రిన్సిపాల్ శ్రీయుత వైద్యరత్న కెప్టెన్ జి. శ్రీనివాసమూర్తిగారి పీఠికతో అలరారుచున్నది. చక్కని గ్లేజు కాగితములు.

## రామప్రియ — 150 పుటలు — పండ్రెండు అణాలు.

ప్రసాదమైన హాస్యమునకు పేరుకెక్కిన తోట కృష్ణమూర్తి (బి. ఏ. యల్. టి) గారిచే సులభశైలిని వ్యవహారికభాషలో వ్రాయబడిన స్వతంత్రకల్పనాకథలపుస్తకము. 'కథలు మిక్కిలి ముచ్చట లూరుచున్నవి' అని పత్రికారాజమగు భారతి, 'హాస్యరసగర్భితము' అని విశేషప్రచారముగల వినోదిని పత్రికయు ప్రశంసించినవి.

## తర్కసంగ్రహము — పోకెట్ సైజ్ — ఒక రూపాయి.

తర్కశాస్త్రపారంగతుడగు అన్నంభట్టు సులభార్థబోధకముగ సంస్కృతములో రచియించిన గ్రంథమునకు ఆంధ్రతాత్పర్యమును రచించి చరకమతదీపికాఖ్యాయుర్వేదమతవివరణముతో ఆయుర్వేదాచార్య డాక్టరు ములుగు విశ్వేశ్వరశాస్త్రి, యల్. ఐ. యమ్.; హెచ్. పి. ఐ. యమ్. గారు వెలువరించియున్నారు. ఆయుర్వేదమునకు అత్యావశ్యకమైన పదార్థవిజ్ఞానపటముకూడ కలదు. ఆయుర్వేదానుబంధములో వ్రాయబడిన ఈగ్రంథము ప్రతి ఆంధ్రాయుర్వేదవైద్యునకు ఎంతయు ఉపకరించుటయేగాక ఆంగ్లలాజిక్ విద్యార్థులుకూడ చదువతగినది.

## కామశాస్త్రము — ఒక రూపాయి.

ఇది వాత్స్యాయన మహర్షి సంస్కృతభాషలో వ్రాసిన సూత్రములను కొత్త సత్యనారాయణ చౌదరిగారు గావించిన చక్కని తేటతెల్లమగు తెలుగుసేత. రైలులో అమ్ము పుస్తకాలవంటిది కాదు. సరియైన శాస్త్రగ్రంథము. కామపురుషార్థమునకుగల ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తెల్లమగును.

# 'తెలుగు చింతపండుకి జయ్'

గీ. గరితలేనియిల్లు దొరలేనితగవును
జింతపండులేని వింతచవియుఁ
జనవులేనికొలువు శశిలేనిరాత్రియు
ముక్కులేనిమొగము నొక్కరూపు.

అని రసార్ద్రహృదయుడు, నిత్యయావనుడు అయిన కవి పాడుతున్నాడు. ఆడదిలేని యిల్లు, దొరలేనితగువు, చనువులేనికొలువు, చంద్రుడులేనిరాత్రి, ముక్కులేనిమొగం ఎల్లాంటివో చింతపండులేనిరుచి అల్లాంటిదట. ఎంతటి సత్యమైన పలుకు!

చింతపండు! ఓహో! ఆ మాటలోనే ఎంత పులుపుఉంది? మన పచ్చళ్ళరుచులకు మెచ్చులు తెప్పించేది చింతపండే. అరవవారి సాంబారును తీసి అవతల పారవేయగల చిక్కదనాన్ని మన ధప్పళానికి కలిగించేది చింతపండే. చెవుల్లో పొగలుపుట్టి చిమ్మిరేగేటట్లు అరవవారి రసంలో ఉండే మిర్యాలఘాటును మన చారులో లేకుండా చేసేది చింతపండే. చేదు విషమైన వేపపువ్వును ఉగాదిపండుగ పూటా మనచేత తినిపించేది చింతపండే. అట్టిచింతపండు—చింతచచ్చినా పులుసు చావని అట్టి చింతపండు—ఆంధ్రులకు చిరపరిచితమైన అట్టి చింతపండు ఈ మధ్య కొంత ప్రతికూలప్రచారానికి పాల్పడుతూ ఉందని చెప్పవలసి వచ్చినందుకు నాకు చాలాచింతగాఉంది.

నిమ్మకాయపులుసును ఒప్పుకునే ప్రకృతి వైద్యులు, పుల్లదానిమ్మకాయల ఉసిరికకాయల పులుపును ఒప్పుకునే ఆయుర్వేద వైద్యులు, అసలు పథ్యనియమంలేని అల్లోపతిక్ వైద్యులుకూడా చింతపండుమీద కొంత శీతకన్ను వేశారు. వారిరోగులధరిమానా వాగు చింతపండును రానీయకుండా ఉన్నారు. జిహ్వ చచ్చిపోయినప్పుడు దానికి తిరిగి ప్రాణం పొయ్యడానికి చింతపండు చింతామణిలాపని చేస్తుందని ఈ వైద్యచింతామణులకు తెలియకపోవడం చూస్తే వైద్యలోకంలో ఎంత అజ్ఞానం ప్రబలిఉందో తెలుస్తుంది.

కిలంపట్టిన రాగిబిందెల్ని, ఇత్తడి గిన్నెల్ని, కంచు చెంబుల్ని బాగుచేసి మెఱుగుపెట్టడానికి ఉపయోగించినట్లే చింతపండు తుప్పుపట్టిఉన్న రోగులనాలికల్ని బాగుచేయడానికి కూడా పనికివస్తుందని వైద్యులు ఇంకా గ్రహింపలేకపోవడం చింతపండుకు ఏ విధంగాను న్యూనత కాదుగాని రోగుల నాలుకలకు కర్మపరిపక్వం కాలేదనడానికి గుఱుతు.

చింతపండు తింటే రక్తంవిరిగిపోతుందనే మూఢనమ్మకానికి కొందరు ప్రచారం కలిగిస్తున్నారు. ఇల్లాప్రచారం కలిగించేవారిలో చాలామంది స్వార్థపరులు ఉన్నారని ఇటీవల కనుగొనబడింది. ఈ ప్రచారకుల్లో చాలామంది సాధారణంగా చింతపండు విస్తారం తినేవాళ్లే. కాని వారు చింతపండు రక్తాన్ని విరిచేస్తుందని బాహాటంగా ప్రచారం చేస్తారు. ఈ ప్రచారంవల్ల కొందరైనా చింతపండువాడకం మానివేస్తారనీ, అట్లు మానివేయడంవల్ల చింతపండు కొనేవారు తగ్గి దాని ధరకూడా తగ్గుతుందనీ, తక్కువధరలో తాము ఇంకా హెచ్చు చింతపండు స్వాహాచేయవచ్చుననీ ఆస్వార్థపరుల తలంపు. వీళ్ళమాటలు ఎంతమాత్రము విశ్వసించకండి. నిరాఘాటంగా చింతపండు వాడండి. ఒకవేళ చింతపండు తినడంవల్ల రక్తము విఱిగిపోవడంనిజమే అనుకుం

డాము. అట్లు విఱిగినందువల్ల ఏమిన్నీ నష్టములేదు. పైగా లాభంకూడాను. రక్తము విఱిగిపోయినవారికి రక్తపుపోటు మొదలగు ప్రమాదకరమైన వ్యాధులు ఏమిన్నీరావు. కనుర్చుటకంటె ఆటంకపరుచుటమేలు అని ఉన్నది కాబట్టి చింతపండుతిని రక్తాన్ని విఱుచుకొని రక్తపుపోటువ్యాధిరాకుండా ఆటంకపరచడం ఎంతేనా దూరదృష్టిని సూచిస్తుంది. రక్తం విఱుగడం విఱక్కపోవడంఅను ఆలోచనలతో బుర్రపాడు చేసుకోక నిష్కామభక్తులవలె చింతపండును సేవిస్తూఉండండి.

ప్రేమమయుడైన భగవంతుడు తనతో ఐక్యమైన వారిని కూడా ప్రేమమయులనుగా చేస్తాడని ఉపనిషత్తులు చెప్తాయి. అల్లే పుల్లటిగుణంగల చింతపండు తనతో ఐక్యమైన ప్రతివస్తువుకీ—ఆఖరికి పుచ్చువంకాయముక్కకికూడా—పుల్లటిగుణం ఇస్తుంది. తన సొత్తును తనచెంతకువచ్చే ప్రతివారికి పంచియిచ్చి సోషలిజంసిద్ధాంతాన్ని ప్రతిపాదించి చింతపండు తన విశాలభావాల్ని చూపెడుతుంది. చింతపండును విస్తారం తినేవాళ్ళకు ఈవిశాలభావాలు పట్టుబడి వారు అందరితోటి కలిసిమెలిసి ఉంటారు. ఒంటెత్తుగుణం కలవారు చింతపండు తక్కువతింటారనీ, కలిసికట్టుగా ఉండేవారికి ఆ కలిసికట్టుగుణం కలగడానికి కారణం వారు చింతపండు ఎక్కువగా తిండమేనని రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ వారు తీవ్రపరిశోధనలుచేసి కనుగొన్నారు. అందరికీ తలలో నాలికలా తిరగాలనుకునేవారు చింతపండు తినడం హెచ్చించాలని తేలిపోతోంది.

ఉప్పుతింటే అప్పుపెరుగుతుందనీ, చింతపండుతింటే చింత హెచ్చుతుందనీ, పెద్దలు అంటారు. ఇది ఎంతవఱకు నిజమనవచ్చు అనేది ఒకప్రశ్న. దీనికి సమాధానం చెప్పవలసిన శాధ్యత 'తెలుగుచింతపండుకిజయ్' అనే ఈ వ్యాసం వ్రాస్తున్న నామీద ఉందని ఒప్పుకుంటాను. అయితే ఉప్పుతింటే అప్పుపెరుగుతుందా పెరగదా అనేప్రశ్నకు సమాధానం చెప్పడానికి నాకంటె లవణానందస్వాములవారు సమర్థులు. సమర్థులు సన్నిహితులై ఉండగా ఇతరుల్ని అడగడం సమంజసంకాదు. కాబట్టి దయచేసి ఆ విషయం వారిని అడగండి. ఇక చింతపండుతింటే చింత హెచ్చుతుందా హెచ్చదా అనేదానికి నేను సమాధానం చెపుతాను. అసలు మనకు చింతపండు ఇచ్చేచెట్టుకు చింతచెట్టు అనేపేరు ఎల్లావచ్చిందో విచారించి తెలుసుకున్నామంటే ఈ సమస్య కొంతవఱకు విడుతుంది. అనేకవిషయాలను తెలిపేపురాణాలు ఈ విషయాన్ని గురించి కూడా స్పష్టంగా చెపుతూనే ఉన్నాయి. చింతచెట్టుకు ఆపేరు రావడానికి కారణం ఇది:

క. భ్రాంతివడి కల్పవృక్ష
ప్రాంతంబునఁ గూడుఁగూర్కుఁ బట్టక సుర ల
శ్రాంతంబు దీనికై మదిఁ
జింతించుటఁ జేసి పరఁగెఁ జింత యనంగన్.

విన్నారా? కల్పవృక్షమే చింతచెట్టు అనుకొని భ్రాంతిపడి దానికింద తిండీతిప్పలు లేకుండా చింతిస్తూ దేవతలు ఉండడంమూలాన్ని ఈ చెట్టుకు 'చింత' అనేపేరు కలిగింది. పురాణప్రోక్తమయిన ఈ విషయాన్ని తెలుసుకోలేక చింతపండులో 'చింత' అనేశబ్దంఉంది కనక ప్రాసకోసం ఏడ్చి మనపెద్దలు అది తింటే చింతవస్తుందని అనేసివుంటారు. ప్రాసమీద వారికుండినప్రీతిచేత చింతపండుకు తాము అన్యాయంచేస్తున్నామనే జ్ఞానం మనపెద్దలకు లేకపోయింది. పెద్దలనగా సరా? ఏ వస్తువేనా లేకపోయినా, ప్రయత్నంమీద దొరక్కపోయినా చింతగాని వుండి వుపయో

గిస్తే చింత ఏమిటండీ? విడ్డూరం! చింతచెట్టు లేక దేవతులూ, వుండి మనం చింతించి చింత చెట్టును మొత్తంమీద సార్థకనామధేయను చేసినవాళ్ళ మవుతాము పురాణవాక్యంతో పాటు ఈ పెద్దలవాక్యంకూడా నిజమంటే. చింతచెట్టుకూ మానవులచింతకూ ఏమీ సంబంధంలేదనీ, పైగా తన్ను సేవించిన మానవుల్ని అది నిశ్చింతులనుగా చేస్తుందనీ ఈ క్రింది పురాణవాక్యం వేనోళ్ళచాటుతూంది.

క. చింత మదిలేక మనుజులు
చింతించినకొలఁదిఁ జవులు చేకూర్చుచు ని
శ్చింతులఁగా నొనరించెడు
చింతకు సరిగలదె లోకచింతామణికిన్.

పురాణప్రోక్తమైన ఈ విషయాన్ని విస్మరించి అందుకు వ్యతిరేకముగా చింతపండు తింటే చింత హెచ్చుతుందనే పెద్దలను ఆంధ్రదేశంలో సనాతనధర్మసముద్ధరణమునకై సవ్యసాచులై పాంచజన్యమును పూరించిన పాంచజన్యపత్రికాధిపతులు తప్పకుండా ఆంక్ష పెట్టవలసివుంటుందని మనవిచేస్తాను. వాళ్ళ ఆంక్షకు ఏమయినా ఏతావతా తేల్చే దేమిటంటే చింతవిషయములో మనం ఎట్టి ఆంక్ష లేక నిశ్చింతులమై చింతపండు నిరాఘాటంగా వాడవచ్చునని.

చింతపండు అనడంతోటే నోరు ఊరేటట్లే పురాణప్రశంస రావడంతోటే ప్రతీవానికి 'జనమేజయునితో శుకుం డిట్లనియె' అనే వాక్యం జ్ఞాపకంవస్తుంది. దాంతో వాళ్లు కూడా జనమేజయుళ్ళలాగ ప్రశ్నలు వెయ్యడం ప్రారంభిస్తారు. చూడండి: చింతచెట్టుకు సంబంధించిన చింత దేవతలదనీ, ఆచెట్టు మానవుల్ని నిశ్చింతులనుగా చేస్తుందనీ, పురాణంలో వున్న విషయం చెప్పాను. పాఠకజనమేజయులకు అంతతో తృప్తిలేకుండా వుంది. 'ఈ చించావృక్షమును గూర్చి మఱికొన్ని గాథలు విన మామనంబులు కుతూహలంబులయ్యెడిని' అని వారంటున్నారు. తప్పకుండా మఱికొన్ని కథలు మనవిచేస్తా: ముక్తసరిగా మూడుచెప్పి విరమిస్తేగాని గ్రంథవిస్తరభీతి పట్టుకుంటుంది. మొదటికథ. బ్రహ్మ ఒకసారి ఒకరసికుణ్ణి సృష్టించాడు. ఆ రసికుడు ఆరురుచులుగల వివిధఫలములను బ్రహ్మ ఎదుటనే తినడానికి ప్రారంభించాడు. రసికులంటే ఇతరులకు పెట్టకుండా తాము తినేవారే కాదండీ! ఐదురుచుల ఫలములను తింటూండగా చూచినా బ్రహ్మకు నోరూరలేదు కాని రసికుడు పుల్లటిరుచిగల చింతపండు తింటూంటే మాత్రం నోరూరింది. బ్రహ్మకైనపుట్టు రిమ్మతెగులు అనే వేమన్నవాక్యం ఈసందర్భంలోదే. మూలం చూపిస్తేగాని ఏ విషయం నమ్మని పాడురోజులు కాబట్టి ఈ కథకు మూలపద్యం ఇచట వ్రాస్తున్నాను.

క. వెస నిర్మించిన బ్రహ్మకు
రసికుఁడు బ్రొక్కుడుచు ఫలము రంజిల్లఁగ ష
డ్రసములలో నిది నమలెడు
దెసఁగన నోరూరె నాదిదేవున కంతన్.

ఇక రెండోకథ. చంద్రునివద్ద అమృతము వుండికూడా దానివల్ల రుచిభేదం కలగక పోవడం మూలాన్ని చిక్కిపోయి ఆతడు విడిచేసిన కళలన్నీ గొడిసెలరూపాన్ని చింతచెట్టుని కొలుస్తున్నాయి. ఈ కథకు మూలపద్యం.

క. ఉడుపతి తనలో నమృతము
గడలుకొనియుఁ బెక్కు చవులుగానక కృశుఁడై
విడిచిన కళలన్నియు నీ
గొడిసెల రూపమునఁ జింత గొలువఁగఁబోయెన్.

మూడోకథకూడా కొంచం ఇల్లాగే వుంటుంది. పార్వతి ఒకప్పుడు చారులో చింతపండు వెయ్యడం మరిచిపోయిన సందర్భంలో శివుడు

ఈ కథ ఆమెకు చెప్పినట్లు తింత్రిణీపురాణం లో వుంది. శివుడు చెప్పినాడు: 'ఓ ప్రియురాలా! ఈ చింతపండుతో అమృతముకూడా సాటిరాదు. అట్టి అమృతాన్ని తాగి ఇంద్రుడు మొదలైన దేవతలు తమజిహ్వలు చచ్చి అఘోరిస్తున్నారు.' దీనికిమాత్రం మూలం ఎందుకు ఉదాహరించకపోవాలి? ఇదిగో.

క. ఈచింతపంటి సరిగా
నో చెలి! యమృతంబుఁ జెప్పనొప్పదు దానిన్
వాచవిగొని తమజిహ్వల
నేచవులును లేక చెడిరి యింద్రాదిసురల్.

ఆంధ్రమహాశయులారా! ఏది చూసిన సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడికి సయితం నోరు ఊరిందో, ఏది లేక ఇంద్రాది దేవతలు పుల్ల విరిగిపోయారో, ఏది తినక చంద్రుడు నానాటికి కృశించిపోయాడో అట్టి చింతపండు మీకు వలసినంత కోరినంత లభ్యం అవుతూ వున్నప్పుడు నోరూరకుండా, విరిగిపోకుండా, కృశించిపోకుండా తిని బ్రహ్మను, ఇంద్రాది సురుల్ని, చంద్రుణ్ణి ఎందుకు ఊరించరు? చింతపండు తిని వాళ్ళని ఊరించండి. వాళ్ళు అమృతం నాలుగురెట్లు ఐదురెట్లుగానేనాఇచ్చి సాటాబేరాన్ని కొంత చింతపండు తీసుకుపోవానికి ప్రయత్నంచేస్తారు. మీరు ఎంతమాత్రం ఒప్పుకోకండి. రొక్కంబేరానికి వస్తే అప్పుడు ఆలోచిద్దాం. ఈలోగా అమ్మకాని కని నిలవవుంచక చెల్లించకలిగినంత చింతపండు చెల్లిస్తూవుండండి.

బొంబాయిలో చింతపండువీధి అని ఒక వీధి ఉన్నా ఉత్తరాదివాళ్ళకి చింతపండు మజా తెలియదు. అచ్చట మందుల దుకాణాల్లోకాని చింతపండు దొరకదనీ, ఉత్తరాది వాళ్లు దాన్ని విరోచనాలమందుగా వాడతారనీ గోలకొండపత్రిక వ్రాస్తూంది. చింతపండు తెలుగువారి ప్రత్యేకపు సొమ్ము. కాబట్టి దాన్ని కాపాడండి.

చింతపండు ప్రశస్తిని ప్రస్తరించడానికి ఉద్దేశింపబడిన ఈ వ్యాసంలో దాని కుటుంబానికి చెందిన ఇతర వ్యక్తుల్నికూడా కొంచెం ప్రశంసింపవలసి ఉంటుంది. కృతిపతుల్నే కాకుండా కృతిపతుల తాతల్ని పెదతాతల్ని చిన తాతల్ని తండ్రుల్ని పెత్తండ్రుల్ని పినతండ్రుల్ని అన్నల్ని తమ్ముల్ని పొగిడి వర్ణించే ఆచారం మనకవుల్లో ఉండనేవుంది. ఆ ఆచారాన్ననుసరించి చింతపండును ప్రశంసించే సందర్భంలో ఆ కుటుంబానికి చెందిన చింతచిగుర్ని, వామనకాయల్ని, దోరకాయల్ని గురించి కూడా కొద్దిగా చెప్పడం అవసరం. మామూలుగా మనంవండుకునే పప్పుకు సరిపోయినంత చింతచిగురు సంపర్కం తగిలితే ఏర్పడే రుచి నాకంటేనూ మీకంటేనూ మా బావమరిదికి బాగా తెలుసు. ఇల్లాంటి బావమఱుదులో మేనల్లుళ్లో మీకున్నూ వుంటారనే నాతలంపు. చిగురు తరువాత ఆకు. ఆకు ఎండబెట్టి వఱుగుచెయ్యడం గుంటూరు నెల్లూరు జిల్లాలవాళ్ళకి తెలుసు. వఱుగుగా తయారవడమే కాని చింతాక్కి విశేషోపయోగం ఏమీలేదా అని కొందఱు అనవచ్చు. అల్లాంటివారికి 'చింతాకంతయు చింత నిల్పవుగదా?' అని భక్తికి కొలగఱ్ఱగాను, 'తింత్రిణీపత్రవిశాలవిలోచనా!' అని స్త్రీనేత్రవైశాల్యానికి కొలగఱ్ఱగాను చింతాకును వుపయోగించిన ధూర్జటి కవిని, శ్రీనాధ కవిని చూపెడతాను. ఆకుతోటే పుట్టుకొస్తుంది పువ్వు. గుంటూరుజిల్లాలో చైత్రమాసంలో ఎవరింటికి భోజనానికి వెళ్ళినా ఈపువ్వు పప్పుకూరో, వేపుడుపచ్చడో జిహ్వకు తగులుతుంది. పువ్వు తరువాత ఓమనగాయలు. వీటికీ

సీమమిరపకాయలికి జోస్తి జాస్తి. తెలుగు దేశంలో ప్రతిగర్భిణీస్త్రీ ఓమనగాయల సీమమిరపకాయల యీజోస్తి ఎంతగా రొట్టలు వేయతగిందో చెప్పగలదు. యీఓమన గాయల పచ్చడి తింటూ తెలుగు చూలింత గాళ్ళు తమకు పుట్టబోయే పిల్లల్ని ఓమన గాయలుగా నోముకొనుటకు ఉవ్విళ్ళూరుతూ వుంటారు. ఓమనగాయలు ముదిరితే దోరకాయలు. వీని రుచి చిలకలికికూడా తెలుసు. కాని ఇవి విశేషంగా రోళ్ళు రోకళ్ళ సందున నలిగిపోయి కుండల్లో కూరుకుపోయి నిలవలో పడిపోతాయి. కాయ తరువాత పండు. మళ్ళీ మనం మన చింతపండు దగ్గరకు వచ్చాం. యీపైవి ఏవీ ఒల్లకపోయినా వైద్యులు మాత్రం అపుడపుడు చింతబెరడు, చింతగింజ వాడుతూ వుంటారు. చింత కుటుంబంలో పండు అన్నిటికంటే శ్రేష్టమైందని ఒప్పుకు తీరాలి. శ్రేష్ఠుల్ని ఆశ్రయించడం మంచిది కాబట్టి మనం ఆ శ్రేష్ఠమైనదాన్నే విశేషంగా ఆశ్రయిద్దాం.

దేశాన్ని అంతలో కవితాప్రవాహంలో ముంచెత్తి ఇంతలో రసనాకలో తేల్చగల కవులు

క. మును జిగురునఁ బువ్వున నో
మనగాయల దోరపండ్ల మతియూరఁగఁ బం
డిన పండ్ల నెల్లకాలముఁ
దనియఁగ జవులూనఁగ నొందు తరువులుగలవే.

అని చింతచెట్టును పొగడ్తంచూచి కొందరు డాక్టరు మహాశయులు కూడా తమకళ్లు తెరిచారు. మదరాసులో పేరుమోసిన డాక్టర్లలో ఒకరైన గురుస్వామి మొదలియారు గారు ఇటీవల ఒకచోట ఉపన్యసిస్తూ చింతపండులో అన్ని విటమినులు ఉన్నవనీ, అది పండ్లలోకి శ్రేష్టమైందనీ, విరివిగా వుపయోగింపతగిందనీ చెప్పినారు. నిజము నిలకడమీద తేలుతుందంటారు. ఇన్నాళ్ళకు యీ నిజమును ఒప్పుకుని వెళ్ళడించినందులకు చింతపండుప్రియులెల్లరు ఆ డాక్టరునకు కృతజ్ఞులై వుండక తీరదు. ఎచ్చట ధర్మముగలదో అచ్చట జయముకలదు. కావున సుప్రసిద్ధుడగు ఆ మదరాసు డాక్టరుతో కంఠములు కలిపి మన మిట్లు జయధ్వానములుచేద్దాము:

ఓం తుష్టిరస్తు
పుష్టిరస్తు
ఆరోగ్యమస్తు
ఆయుష్యమస్తు
తెనుగు చింతపండుకీ జయమస్తు.

ఆగస్టు 12–వ తేదీనాటి ఆంధ్రపత్రికలో 'ఇండియాటీ'ని గురించి 'అది ప్రకటనో, వ్యాసమో తెలియకుండా 'ఈ ఛాంధసులు' అనేశీర్షికతో కొన్ని పంక్తులు ప్రచురింపబడ్డాయి. మచ్చుకి కొన్ని వాక్యాలు చూడండి: ''నిజం విచారిస్తే టీ అనేది స్వయంభువు. దానికదే శిఫార్సు చేస్తుంది...కొందరు అసూయాగ్రస్థులు టీనిగురించి పలికే నీలాపనిందలనువిని సామాన్యమానవు డొక్కొక్కప్పుడు ఆశ్చర్యపడుతూ ఉంటాడు. బాగుగా తయారుచేసిన ఒకకప్పు యిండియన్ టీని యీవిమర్శకాగ్రేసరచక్రవర్తులలో ఒక్కరయినా రుచిచూచిన పాపానపోలేదని అనుకోవలసి వస్తుంది. అయితే అదృష్టవశాత్తు అట్టి విమర్శకుల సంఖ్యకూడ చాలమటుకు తక్కువే. వాళ్లు ఒక్కసారి రుచికరమైన ఒకకప్పు యిండియన్ టీ త్రాగితే యెంతో బాగుండేది. అప్పుడు వాళ్లుకూడ యీ యిండియన్ టీ తప్పకుండ మంచిపానీయమని ఢంకాబజాయించి చెప్పడానికి ఏమి సందేహములేదు...టీ అనేది హిందూదేశప్రజల ఆరోగ్యానికి మంచిదా కాదా అనుప్రశ్న అడిగితే అసలు సదరు ప్రశ్న బయలుదేరడమే చాలమందికి ఆశ్చర్యం

గా కనబడుతుంది. పరిశుభ్రమైన ఇండియన్ టీ మంచిపానీయము అనేసంగతి భేదాభిప్రాయం కలుగనే కలుగదు. టీలో కలిపే సలసల కాగిన వేడినీళ్ళలో క్రిములు ఏ మాత్రము వుండవు . . . టీ త్రాగటంగురించి వెకసక్కెములు పలికే యీ మొండిబండ, ససేమిరా గాళ్ళకు న్యాయాన్యాయములుగాని, కారణాలుగాని లేవు. హిందూదేశములో ఆ సేతు హిమాచలపర్యంతము నానాటికి దిన ప్రవర్థమాన మగుచున్న యీ టీ త్రాగే మానవ కోటిమీద సదరువిమర్శకులు అనవసరంగా జోక్యం కలుగచేసుకుంటున్నారని దీనివలన బోధపడుతుంది. అసూయతకంటె యథార్థ జ్ఞానం ఉత్తమమైనది. సత్యము ఎప్పటికయినా జయించకమానదు.’’

‘తెలుగు చింతపండుకిజయ్’ అనే శీర్షిక గల నా యీ వ్యాసం నేను ఎప్పుడు వ్రాసి వున్నా ఆగష్టు 25–వ తేదీ దాటితేగాని ఆంధ్ర లోకానికి చేకూరదు కాబట్టి నేనీ వ్యాసాన్ని ఆ ‘యిండియాటీ’ వ్యాసాన్ని చూచివ్రాసి వుంటానని వ్యాసపాఠకులు తలంచవచ్చు. నా యీ వ్యాసం ఆ యిండియాటీవ్యాసప్రచురణకు ముందే వ్రాయబడిందని పవిత్రమైన ఇండియాటీమీద ప్రమాణంచేసి చెబుతున్నా. ఇల్లాచెప్పినా నా యీ వ్యాసం ఆ యిండియాటీవ్యాసం చూసింతర్వాతనే వ్రాయబడిందనే అభిప్రాయం వ్యాసపాఠకుల్ని వీడకుండా వుంటే వారికి నేను ఒకమనవి చేస్తాను : వుపవిలేఖకుల అభిప్రాయాలకు సంపాదకుడు బాధ్యుడుకానట్లే వ్యాసపాఠకుల అభిప్రాయాలకు వ్యాసకర్త కూడా ఎంతమాత్రం బాధ్యుడు కాడని. మీానడుమ నానడుమ ఇంక ఏమిన్నీ బాధ్యతలేదు కాబట్టి సెలవు తీసుకోకుండా విరమిస్తా. —ఎ. శేషాచలపతి, బి.ఏ.


# అమృతకేసరి

సర్వ సవామేహములను అమృతమువంటిది. స్త్రీల కుసుమరోగములను, చర్మరోగములను పోగొట్టి రక్తశుద్ధిని బలమును ఆరోగ్యమును కలుగచేయును.

20 రోజుల మందు. సీసా 1-కి రు. 1-8-0.

# వజ్రాయుధము

‘‘కలరారోగనివారిణి’’ అజీర్ణము. కడుపునొప్పి, విరేచనములు, వాంతులు. శూలలను పోగొట్టి ఆరోగ్యమును కలుగచేయును. తు. 1-కి రు. 1-0-0.

వ.రా.—వైద్యులకు కావలసిన సమస్త ఆయుర్వేద ఔషధములు మావద్ద లభించును. కేటలాగు ఉచితము.

# మృత్యుంజయఫార్మసి,

బెజవాడ.



# ఆంధ్రజ్యోతి

మోల్మేన్—వారపత్రిక

సాలు చందా రు 3. విడి పత్రిక 9 పైసలు.

బర్మాలోని 1,60,000 ఆంధ్రుల క్షేమానికి పాటుబడుచున్న వారపత్రిక. ఇందు ధార్మిక, సాంఘిక, రాజకీయ, వాణిజ్య విషయములు నిష్పాక్షికముగ చర్చించబడును. దీనికి బర్మాఅంతట ప్రచారము గలదు. వర్తకు లిందు తమ సరకులను ప్రకటించిన మంచి లాభమును పొందగలరు.

వివరములకు :—

ఎడిటర్, ‘‘ఆంధ్రజ్యోతి’’

185, లోవర్ మెయిన్‌రోడ్డు,

మోల్మేన్-అని వ్రాయుడు.

# అత్యాశ్చర్య కుష్టు రోగ నిర్మూలిని

(రిజిష్టర్డు.)




యీ ట్రేడుమార్కును చూచిన మోసపోరు.

గుణములేదని ఋజువుచేయువారికి రు. 1000 లు బహుమానము. 18 రకముల కుష్ఠులు, బొల్లి, సుఖరోగములు యేస్థితిలో యెంత కాలమునుండి జీర్ణించియున్నను గ్యారంటీగా బాగు చేయుదుము. మృత్యుముఖమునుండి అనేకవేల రోగులు రక్షింపబడిరి. యింజక్షనువలన ఫలితముగానని రోగులం మామందువలన పూర్ణారోగ్యమును పొందిరి. పూర్తి వివరములకు అన్నిభాషలలోను దొరకు మా కేట్లాగులకు యీ దిగువ యాడ్రసుకు వ్రాయుడు.

## లక్ష్మీ అండ్ కంపెనీ (రిజిష్టర్డు.)

కుష్టు అండ్ సుఖరోగ చికిత్సా నిపుణులు,

అల్లిపురం మెయిన్‌రోడ్డు, వాల్తేరు ఆర్. యస్ పోస్టు, విశాఖపట్టణము.



# ఐరావతి

లక్షా అరువదివేల బర్మాఆంధ్రుల క్షేమాభివృద్ధులకు ప్రతి శనివారము వెలువడు ప్రజాహిత పత్రిక. 7 సంవత్సరముల నుండి బర్మాఆంధ్రుల శ్రేయోభివృద్ధికై పాటుపడుచున్నది. ఇది ఆంధ్రులకు అండ కార్మికులకు పట్టుకొమ్మ. యువజనోద్యమము నకు ఉనికి. నిర్మోమాటముల నిప్పు. అన్యాయముల సంహరింప జేయుటకు బ్రహ్మాస్త్రము. అంతర్యమెరిగినవారికి హాయి, చదివినవారికి మిఠాయి.

సంవత్సరపు చందా రు 3. పై గ్రామస్థులకు రు 3-12-0.

చిరునామా :

ఐరావతి పత్రికా కార్యాలయము, 233 వార్ స్ట్రీట్, రంగూను. (బర్మా.)